సూర్య 18వ వసంతంలోకి...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

సోమవారం | 1 సెప్టెంబర్ 2025 | హైదరాబాద్

సంపుటి 18 | సంచిక 311
| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో
నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : దక్షిణాయణం - వర్ష ఋతువు, శుక్ల పక్షం భాద్రపదం మాసం శుద్ధ నవమి రా.11.18 వరకు, జ్యేష్ఠ సా.6.01 వరకు, వర్జ్యం రా.2.40 నుంచి 4.24 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.25 నుంచి 1.15 వరకు తిరిగి మ.2.54 నుంచి 3.44 వరకు

## యూపీఎస్సీ అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు'

● 125వ మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ ● యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం ● అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోవటంతో ప్రధాని ఆవేదన ● విపత్తు సమయంలో, సహాయం చేయడానికి ముందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు

యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు మోడీ వెల్లడించారు. దీని ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు మన్‌కీ బాత్ 125వ కార్యక్రమంలో మోడీ తెలిపారు. దేశంలోని కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటని ప్రధాని వెల్లడించారు.



6లో

అత్యంత ప్రజాదరణ కలిగిన
## సిఎంగా ఆదిత్యనాథ్
### మూడో స్థానంలో ఏపీ సీఎం చంద్రబాబు

మూడ్ ఆఫ్ ది నేషన్ పేరిట నిర్వహించిన సర్వేలో దేశంలోని ముఖ్యమంత్రుల పనితీరుపై వివరాలు సేకరించారు. ఈ సర్వేలో ఏపీ సీఎం చంద్రబాబు మూడో స్థానంలో నిలవడం విశేషం



6లో

## పాక్‌కు సపోర్ట్ చేసిన చైనాతో స్నేహమా?



6లో

● జిన్‌పింగ్‌తో మోడీ భేటీపై కాంగ్రెస్ ఫైర్ ● భారత్, చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొందా? ఎక్కడ? ● మోడీ ప్రభుత్వం వెన్నుముక లేనట్లు ప్రవర్తించిందని విమర్శ

చైనాలోని తియాంజిన్‌లో ఆ దేశ అధ్యక్షుడు జిన్పింగ్, ప్రధాని మోడీ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-చైనా సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని మోడీ ప్రకటించడాన్ని తప్పుబట్టింది.

# చైనా, భారత్ ఒక్కటవ్వాలి

### భారత్-చైనా సంబంధాలపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

● చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగిస్తాం భారత ప్రధాని మోడీ
● ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు దృష్ట్యా సంబంధాల పునరుద్ధరణ
● ఇప్పటికే కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైంది
● పరస్పర విశ్వాసం, గౌరవంతో ఇరు దేశాల మధ్య సంబంధాలుంటాయి



6లో

షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం భారత ప్రధాని మోడీ చైనాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాలపై మాట్లాడారు.

# విద్య.. ఒక గొప్ప ఆయుధం

● తెలంగాణలో విద్యాభివృద్ధిపై పెద్ద ఎత్తున దృష్టి సారించాం ● అదే అందరికీ గొప్ప శక్తి.. అని నేను చాలా బలంగా విశ్వసిస్తా ● అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ రాష్ట్రం ● కేసీ వేణుగోపాల్ పేదల పక్షపాతి..అణగారిన వర్గాలకోసమే తన పోరాటం ● అణిచివేత, అన్యాయాలపై గళం విప్పుతున్న నేత ● కేరళలో ఎంపీ మెరిట్ అవార్డ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం అని అదే అందరికీ గొప్ప శక్తి అని నేను చాలా బలంగా విశ్వసిస్తున్నా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాంటి విద్యకు ప్రధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ రాష్ట్రం అని పేర్కొన్నారు. కేరళలోని అలప్పుళ లో మెరిట్ విద్యార్థులకు అందించే "ఎంపీ మెరిట్ అవార్డ్-2025" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్ ఎల్లప్పుడూ పేదల పట్ల, అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే ఉన్నారు.



2లో

## ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద అమరణ నిరాహార దీక్ష చేయండి

● బీసీ బిల్లుపై సీఎంకి కేటీఆర్ సూచన ● పంచాయతీ రాజ్ చట్ట సవరణపై శాసనసభలో కేటీఆర్ వ్యాఖ్య

3లో

నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అనే
## రోజులు త్వరలో వస్తాయ్



# బీసీలకు న్యాయం చేద్దాం

● న్యాయ స్థానాల పట్ల మాకు గౌరవం ఉంది ● కేటీఆర్ వ్యాఖ్యలు కోర్టుకు వెళ్ళాలి అని ప్రోత్సహించే విధంగా ఉన్నాయి ● తమిళనాడు చెన్నై కేసు విషయంలో గవర్నర్ దగ్గర ఉన్న బిల్లులపై కోర్టు జోక్యం చేసుకుంది ● గడువు పూర్తయితే ఆ బిల్లులు ఆమోదించుకున్నట్టే అని తెలిపింది ● బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం ● బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి హౌజ్ లో డిఫెరెంట్ ఆఫ్ ఒపినియన్ రాకుండా అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాలి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీలో రెండవ రోజు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు పై చర్చ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కోర్టులు కోడ్ ఆఫ్ హౌజ్ పరిగణనలోకి తీసుకుంటారు.



2లో

# వాడివేడిగా అసెంబ్లీ

● గంగుల కమలాకర్‌పై మంత్రులు సీరియస్ ● మంత్రి పొన్నంకు అవగాహన లేదంటూ గంగుల విమర్శలు ● మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సీరియస్ ● ఆకారాలు పెద్దగ ఉంటే..అవగాహన ఎక్కువ ఉంటది అనుకోవద్దు ● అంటూ మంత్రుల సెటైర్లు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా సాగుతున్నాయి. బీసీ రిజర్వేషన్లపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో గంగుల కమాలకర్‌పై మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. సభలో గంగుల మాట్లాడుతూ.. మంత్రికి వాస్తవాలు తెలియదు.. నేను అడిగిన వాటికి సీఎం క్లారిటీ ఇవ్వాలి అని అన్నారు. గంగులు వ్యాఖ్యలతో హీట్ పెరిగింది. ఆకారాలు పెద్దగ ఉంటే..అవగాహన ఎక్కువ ఉంటది అనుకోవద్దు అని మంత్రి పొన్నం ఫైర్ అయ్యారు.



2లో

క్రీడలతో
## ఆరోగ్యకరమైన జీవితం

సండేస్ ఆన్ సైక్లింగ్ విస్తృతం చేయాలి
రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



3లో

వినాయక నిమజ్జనానికి
# డీజేలు బ్యాన్

● శ్రుతిమించుతున్న శబ్దాలతో ప్రజలు బెంబేలు ● నియంత్రణ ఆదేశాల అమలుకు కార్యాచరణ

మితిమీరిన శబ్ద కాలుష్యం ప్రస్తుతం ఫ్యాషన్ అవుతోంది. రాజకీయ నాయకులకు స్వాగతం పలకాలన్నా, పెళ్లి ఊరేగింపు జరపాలన్నా, డీజే తప్పనిసరి అయింది. ఇక వినాయక చవితి విగ్రహాల నిమజ్జనం జరిగే సమయంలో వీటికి ప్రాధాన్యం మరీ ఎక్కువ. అధిక శబ్దంతో వృద్ధులు, చిన్నారులు భయకంపితులవున్నారు. పక్కపక్కనే ఉన్న వారికి మాట వినపడని పరిస్థితి నెలకొంటుంది. భారీ శబ్దాల కారణంగా చెవిలోని కర్ణభేరి ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో వినికిడి శక్తి కోల్పోతారని హెచ్చరిస్తున్నారు.



2లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

జమ్ములో విరిగిపడ్డ
## కొండచరియలు



6లో

### 11 మంది మృతి, పలువురికి గాయలు

జమ్ము కశ్మీర్‌లో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. భారీ వర్షాల కారణంగా రాంబాన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 11 అక్కడికక్కడే మృతి చెందారు.. అలాగే శిథిలాల కింద మరికొంత మంది ఉన్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

హరీష్ చెప్పిన అబద్ధాన్నే
# మళ్లీ చెబుతున్నారు

● విద్యాసాగర్ రావు బతికి ఉంటే వీళ్ల అబద్ధాలు వినలేక అదే కాలేశ్వరంలో దూకి ఆత్మహత్య చేసుకునేవారు ● నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితో కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారు ● శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఆనాడు మంత్రిగా ఉన్న హరీష్ రావు ఈనాటికీ మంత్రిగా ఉన్నట్టుగానే భావిస్తున్నారు. చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ చెబుతున్నారు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ఆదివారం అసెంబ్లీలో మాట్లాడుతూ నీరు అందుబాటులో ఉందని చెప్పినా మళ్లీ పరిశీలించాలని లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రాజెక్టు నిర్మించుకుంటామని వాదించకుండా.. పేరు మార్చి ఊరు మార్చి దోపిడీకి పాల్పడ్డారన్నారు.



7లో

కాళేశ్వరం నిర్మాణంలో తీవ్ర
# లోపాలు ఉన్నాయి

● అసెంబ్లీలో పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ ● డ్యామ్, బ్యారేజీకి తేడా లేకుండా కట్టడం వల్లే మేడిగడ్డ కుంగిపోయిందని ఉత్తమ్ ఆరోపణ ● ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా అసెంబ్లీలో వివరాలు వెల్లడించిన మంత్రి ● తక్కువ ఖర్చుతో అయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టారని వ్యాఖ్య

కాళేశ్వరం కమిషన్ నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ హాట్ హాట్ గా జరిగింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై లఘుచర్చను ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రారంభిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.87,449 కోట్ల ఖర్చు అయిందని తెలిపారు.



2లో

బంగాళాఖాతంలో
## అల్పపీడనం



● మూడు రోజులు వర్షాలు ● లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరిక

వాయవ్య బంగాళా ఖాతంలో రానున్న మంగళవారం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలకు సమీపంలో వాయువ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.



సవాళ్లు జీవితాన్ని ఆసక్తికరంగా చేస్తాయి మరియు వాటిని అధిగమించడం జీవితాన్ని అర్థవంతం చేస్తుంది.
- జాషువా జె. మెరైన్



"పట్టుదల అనేది సుదీర్ఘ పరుగు పందెం కాదు ఇది ఒకదాని తర్వాత ఒకటి అనేక చిన్న జాతులు."
- వాల్టర్ ఎలియట్



"గొప్ప మనసులు ఆలోచనలను చర్చిస్తాయి సగటు మనసులు సంఘటనలను చర్చిస్తాయి చిన్న మనసులు ప్రజలను చర్చిస్తాయి."
- ఎలియనోర్ రూజ్‌వెల్ట్

# విద్య .. ఒక గొప్ప ఆయుధం

● తెలంగాణలో విద్యాభివృద్ధిపై పెద్ద ఎత్తున దృషి సారించాం ● అదే అందరికీ గొప్ప శక్తి.. అని నేను చాలా బలంగా విశ్వసిస్తా ● అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ రాష్ట్రం ● కేసీ వేణుగోపాల్ పేదల పక్షపాతి..అణగారిన వర్గాలకోసమే తన పోరాటం ● అణిచివేత, అన్యాయాలపై గళం విప్పుతున్న నేత ● కేరళలో ఎంపీ మెరిట్ అవార్డ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి




తెలంగాణ బ్యూరోప్రతినిధిః విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం అని అదే అందరికీ గొప్ప శక్తి అని నేను చాలా బలంగా విశ్వసిస్తున్నా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అలాంటి విద్యకు ప్రధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ రాష్ట్రం అని పేర్కొన్నారు. కేరళలోని అలప్పుళ లో మెరిట్ విద్యార్థులకు అందించే "ఎంపీ మెరిట్ అవార్డ్-2025" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీ వేణుగోపాల్ ఎల్లప్పుడూ పేదల పట్ల, అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే ఉన్నారు. అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న బాధితుల తరపున వారు గొంతుకగా నిలుస్తున్నారు. కేసీ వేణుగోపాల్ తన నియోజకవర్గంతో పాటు కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారు. వేణుగోపాల్ 2006 లో ప్రారంభించిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉంది. 10 వ తరగతి, 12 వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఈ ఏడాది వంద శాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారు. దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉంది. దేశంలో వంద శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళ. ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న వయోజన విద్యా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. కేరళ రాష్ట్రంలో విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు 10 వ, 12 వ తరగతి తర్వాత%శ% సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధించడమంటే అందులో ఆశ్చర్యమేమీ ఉండదు. విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం. అదే అందరికీ గొప్ప శక్తి.. అని నేను చాలా బలంగా విశ్వసిస్తా. అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ రాష్ట్రం. తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్ద ఎత్తున దృషి సారించాం.

విద్యకున్న ప్రాధాన్యత గురించి నేను ప్రతి సందర్భంలోనూ ప్రజలకు చెబుతున్నా. ప్రభుత్వం చేసే సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు ఏది చేసినా విద్య మనకు అత్యంత ప్రాధాన్యత కలిగింది. వచ్చే పదేళ్లలో తెలంగాణకను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగాపెట్టుకున్నాం 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిదేందుకు కృషి చేస్తున్నాం. తెలంగాణలో పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించాం

కేవలం 55 రోజుల్లో 11055 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించబోతున్నాం

ఒక్కో స్కూల్ కు రూ.200 కోట్లు ఖర్చుతో 25 ఎకరాల్లో నిర్మించబోతున్నాం. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించాం

యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. ఆనంద్ మహీంద్రాను చైర్మన్ గా నియమించాం

ఐటీఐ లను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేశాం. ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసుకుంటున్నాం. విద్యార్థుల్లో ఒక స్ఫూర్తిని నింపడానికి ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టిన కేసీ వేణుగోపాల్ కు అభినందనలు. వేణుగోపాల్ తీసుకున్న ఈ చొరవను ప్రతి నియోజకవర్గంలో, రాష్ట్రం మొత్తం ఈ విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరుకుంటున్నా. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అగ్రస్థానంలో విజేతగా నిలుస్తున్న కేరళ రాష్ట్రం పట్ల ఒకింత అసూయ కలుగుతోంది. గత లోక్ సభ ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీని, ప్రియాంకా గాంధీ ని తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరాను.

కానీ వారు కేరళను తమ ఇంటిగా, తమ నియోజకవర్గంగా, తమ కర్మభూమిగా ఎంచుకున్నారు. ఈ రోజు దేశంలో నెలకొన్న పరిస్థితులను గమనిస్తున్నాం.

ఓట్ చోరీకి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమం చేస్తున్నాం. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరముంది. కేరళ రాష్ట్రానికి ఎన్నికలు రాబోతున్నాయి. 2026 లో జరిగే ఎన్నికలు కేవలం కేరళ అసెంబ్లీ ఎన్నికలుగా భావించకండి. అవి 2029 లో దేశ భవిష్యత్తుని నిర్ణయించే ఎన్నికలవుతాయి. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికి రాజీవ్ గాంధీ ఓటు హక్కు కల్పించారు. అదే బీజేపీ నాయకుడు నరేంద్ర మోదీ పౌరుల నుంచి ఓటు హక్కును కొల్లగొడుతున్నారు. 2029 లో జరగబోయే లోక్ సభ ఎన్నికలు ఈ రెండు శక్తుల మధ్య జరగబోతున్నాయి. దేశంలోని యువత ఈ తేడాను గమనించాలి. 21 ఏళ్ల వయసున్న ఐఎఎస్ లు జిల్లాలను సమర్ధవంతంగా నడుపుతున్నప్పుడు 21 ఏళ్ల వయసున్న యువత ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదు ఆ దిశగా మనం రాజ్యాంగాన్ని సవరించుకోవాల్సిన అవసరం ఉంది. యువతకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది. యువత తమలోని శక్తిని గుర్తించాలి.

రాజ్యాంగ పరిక్షణ కోసం పని చేస్తున్న కాంగ్రెస్ పార్టీ వద్ద ఆర్థిక బలం లేదు. మీడియా మద్దతు లేదు. కేవలం యువత, యువతలోని శక్తిని నమ్ముకుని కాంగ్రెస్ పోరాటం సాగిస్తోంది. ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడుతుంది. బీజేపీ యువత హక్కులను కొల్లగొడుతోంది. కాంగ్రెస్ యువత హక్కులను పరిరక్షిస్తుందని గుర్తించండి. 2029 సంవత్సరం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే సంవత్సరంగా అందరికీ చాటుదాం. మీరే మా నమ్మకం. మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు. మీ భవిష్యత్తు కోసం పోరాటం చేయండి. దేశం కోసం పోరాటం చేయండి. మీరంతా ఆ పని చేస్తారని బలంగా విశ్వసిస్తున్నా అని ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగాన్ని ముగించారు.

# వాడివేడిగా అసెంబ్లీ

● గంగుల కమలాకర్‌పై మంత్రులు సీరియస్
● మంత్రి పొన్నంకు అవగాహన లేదంటూ గంగుల విమర్శలు
● మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సీరియస్
● ఆకారాలు పెద్దగ ఉంటే..అవగాహన ఎక్కువ ఉంటది అనుకోవద్దు మంత్రుల సెటైర్లు



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడివేడిగా సాగుతున్నాయి. బీసీ రిజర్వేషన్లపై చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో గంగుల కమాలకర్ పై మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. సభలో గంగుల మాట్లాడుతూ.. మంత్రికి వాస్తవాలు తెలియదు.. నేను అడిగిన వాటికి సీఎం క్లారిటీ ఇవ్వాలి అని అన్నారు. గంగులు వ్యాఖ్యలతో హీట్ పెరిగింది. ఆకారాలు పెద్దగ ఉంటే..అవగాహన ఎక్కువ ఉంటది అనుకోవద్దు అని మంత్రి పొన్నం ఫైర్ అయ్యారు. అవగాహన లేదు అంటున్నారు.. ఆయన కంటే ఎక్కువ చదువుకున్నాను. రాజకీయాల్లో విద్యార్థి దశ నుంచి ఉన్నా.. మంత్రికి అవగాహన లేదని మాట్లాడటం పొరపాటు.. గంగుల వ్యాఖ్యలను వెనక్కి తీస్కోవాలని డిమాండ్ చేశారు. దీనికి బదులుగా గంగుల మాట్లాడుతూ.. నేను బాడీ షేమింగ్ గురించి మాట్లాడితే చాలా కాంట్రవర్సీ అవుతుంది. ముఖ్యమంత్రి సభలో ఉన్నారు. నేను తప్పు మాట్లాడలేదు.. అతనికి అవగాహన లేదని ఎందుకు అన్నానంటే..అని చెప్పబోతుండగా.. ముఖ్యమైన బిల్లుపై చర్చ జరుగుతుంటే చిన్న చిన్న అంశాలను పట్టుకుని రాద్దాంతం చేయడం కరెక్ట్ కాదన్నారు శ్రీధర్ బాబు. మంత్రిని ఉద్దేశించి అవగాహన లేదని మాట్లాడడం కరెక్ట్ కాదన్నారు. బలహీన వర్గాలకు సంబంధించిన మంత్రిని.. బలహీన వర్గాలకు సంబంధించిన బిల్లుపై చర్చ జరుగుతుంటే ఇలా మాట్లాడడం సరికాదన్నారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా మాట్లాడుతున్నారని శ్రీధర్ బాబు మండిపడ్డారు. గంగుల కమలాకర్ గతంలో మంత్రిగా పనిచేశారు. బలహీన వర్గాలు పడుతున్న బాధ ఏంటో ఆయనకు తెలుసు. చారిత్రాత్మకమైన బీసీ రిజర్వేషన్లకు సభ్యులంతా సహకరించాలని కోరారు. స్పీకర్ మాట్లాడుతూ.. రెండో సారీ మంత్రి అప్పీల్ చేశారు.. పొన్నంపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి అని గుంగులకు సూచించారు. మా హక్కులనున కాపాడండి అని గంగుల స్పీకర్ ను కోరారు. మాకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు.. అంతరాయం కలగకుండా చూసే బాధ్యత మీదే అని తెలిపారు. దీంతో స్పీకర్ మాట్లాడుతూ మీ హక్కులు కాపాడతాం.. కానీ మిమ్మల్ని తిట్టించుకునే మాటలు మాట్లాడకండి అని అన్నారు. పర్సనల్ గా మాట్లాడొద్దు అని చెప్పండి మంత్రులకు అని గంగుల అనడంతో ఆ అవకాశం ఇవ్వకండి మీరు అని స్పీకర్ ఘాటుగా రిప్లై ఇచ్చారు

# బీసీలకు న్యాయం చేద్దాం

● న్యాయ స్థానాల పట్ల మాకు గౌరవం ఉంది ● కేటిఆర్ వ్యాఖ్యలు కోర్టుకు వెళ్ళాలి అవి ప్రోత్సహించే విధంగా ఉన్నాయి ● తమిళనాడు చెన్నై కేసు విషయంలో గవర్నర్ దగ్గర ఉన్న బిల్లులపై కోర్టు జోక్యం చేసుకుంది ● గడువు పూర్తయితే ఆ బిల్లులు ఆమోదించుకున్నట్టే అని తెలిపింది ● బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం ● గతంలో ఉన్న 50 శాతం కాబ్ తొలగించాలని ఆర్డినెన్స్ తెచ్చాం ● బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి హౌజ్ లో డిఫెరెంట్ ఆఫ్ ఒపినియన్ రాకుండా అన్ని పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపాలి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం అసెంబ్లీలో రెండవ రోజు పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు పై చర్చ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. కోర్టులు కోడ్ ఆఫ్ హౌజ్ పరిగణన లోకి తీసుకుంటారు. బలహీన వర్గాల మంత్రిగా విజ్ఞప్తి చేస్తున్న.. మీరు 10 సంవత్సరాలు అధికారం లో ఉండి బీసీ లకు,ఎంబీసీలకు మీరు ఏం చేశారు మేం ఏం చేశామో తరువాత చర్చిద్దాం. మేనిఫెస్టో లు ఇతర అంశాలు చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. బలహీన వర్గాలకు న్యాయం చేయాలని అడుగుతున్నాం. అధ్యక్ష పదవి ,కార్యనిర్వహక అధ్యక్ష పదవి, ప్రతిపక్ష నాయక పదవి మీ దగ్గరే ఉన్నాయి. సభ ఆలోచన విధానం ఏకగ్రీవంగా ఉండాలి. చారిత్రాత్మక నిర్ణయం లో కోర్టులు కోట్లడతాయని అపశకునం మాట్లాడుతున్నారు. ఇబ్బందులు ఉంటే సలహాలు సూచనలు ఇవ్వండి. ఇది సామాజిక న్యాయానికి సంబంధించిన చరిత్రాత్మక నిర్ణయం. బీజేపీ శాసన సభ పక్షం కూడా బీసీ లకు ఇవ్వలేకపోయారు. దేశ వ్యాప్తంగా ఇంత పెద్ద చర్చ జరుగుతుంటే రాష్ట్రం లో వచ్చిన ఐదు ఎమ్మెల్సీలు బలహీన వర్గాలకు వచ్చాయి.. ఈ సమయం లో బీజేపీ పార్టీ అధ్యక్షుడునీ కూడా బీసీ లకు ఇవ్వలేకపోయారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు.. బీసీ లను న్యాయం చేయండి మద్దతు ఇవ్వండి. న్యాయ స్థానాల పట్ల మాకు గౌరవం ఉంది. కెటిఆర్ వ్యాఖ్యలు కోర్టుకు వెళ్ళాలి అనే ప్రోత్సహించే విధంగా ఉన్నాయి. తమిళనాడు చెన్నై కేసు విషయంలో గవర్నర్ దగ్గర ఉన్న బిల్లుల పై కోర్టు జోక్యం చేసుకుంది.. గడువు పూర్తయితే ఆ బిల్లులు ఆమోదించుకున్నట్టే అని తెలిపింది.. బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. గతంలో ఉన్న 50 శాతం కాబ్ తొలగించాలని ఆర్డినెన్స్ తెచ్చాం..ఆరోజు అసెంబ్లీ లో చర్చిస్తున్నాం. ఢిల్లీలో ధర్నా చేస్తే గ్రామీణ ప్రాంతాల నుండి కూడా పెద్ద ఎత్తున ఢిల్లీ తరలి వచ్చారు. అసెంబ్లీ లో జరుగుతున్న చర్చ ప్రజలు గమనిస్తున్నారు. సభలో నాయకులు అపషకునంగా మాట్లాడే పద్ధతి సరి కాదు అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

జిత్ నీ ఆబాది.. ఉత్ నీ హిస్సెదారీ

# కాంగ్రెస్ తోనే సాధ్యం

రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జిత్ నీ ఆబాది.. ఉత్ నీ హిస్సెదారీ కాంగ్రెస్ తోనే సాధ్యం అని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. స్థానిక సంస్థలలో 50 శాతం రిజర్వేషన్ల నిబంధన ఎత్తివేస్తూ..వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లు శాసనసభలో ఏకగ్రీవ ఆమోదం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. "తెలంగాణ చరిత్రలో ఒక మహత్తర ఘట్టం. బీసీలకు న్యాయం చేస్తూ, 50% పరిమితిని ఎత్తివేసి 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన ప్రజా ప్రభుత్వం. ఈ తీర్మానం బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ, సామాజిక-ఆర్థిక రంగాల్లో కొత్త అవకాశాలకు నాంది పలుకుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,కేబినెట్ సహచరులు ప్రతిపక్ష నేతలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. బీసీలకు వాటా ప్రకారం అవకాశాలు రావాలని ఎప్పటి నుంచో పోరాడిన రాహుల్ గాంధీ గారి ఆశయం నెరవేరుతోంది. ఇది తెలంగాణకే కాక, దేశమంతటికీ స్ఫూర్తి కలిగించే నిర్ణయం. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలో తెలంగాణలో తీసుకున్న ఈ మోడల్, దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం జరిగే మార్గదర్శకంగా నిలుస్తుంది." అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయం పట్ల టీపీసీసీ చీఫ్ హర్షం

తెలంగాణ బ్యూరోప్రతినిధిః రిజర్వేషన్‌ల అమలుకోసం 50 శాతం నిబంధన ఎత్తివేస్తూ బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ చర్యలను సమాజం సంపూర్ణాంగా స్వాగతించాలని ఆయన ఆకాంక్షించారు. అన్ని రకాలుగా సాంకేతిక, న్యాయ, రాజకీయ అంశాలన్నీ పరిగణలోకి తీస్కొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ లో ఏకగ్రీవంగా బిల్లు చేయడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

బిల్లు కోసం అన్ని రకాల చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు, మంత్రి వర్గ ఉప సంఘానికి బిల్లుకు మద్దతు తెలిపిన ప్రతిపక్ష నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బిసి వాటా ప్రకారం రాజకీయ అవకాశాలు కల్పించాలని మొదటి నుంచి ఆకాంక్షిస్తున్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశయాలు తెలంగాణ లో నెరవేర బోతున్నాయని ఇది మంచి పరిణామమని ఆయన అన్నారు... ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలో ఈ బిసి రిజర్వేషన్లు దేశవ్యాప్తంగా అమలు అయ్యేలా తెలంగాణ నుబచే అడుగులు పడతాయని అన్నారు. ఇది దేశవ్యాప్తంగా అమలు అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

గాంధీ భవన్ లో సంబరాలు

అసెంబ్లీలో బిసి బిల్లు ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ టీపీసీసీ పిలుపు మేరకు గాంధీ భవన్ లో పెద్దఎత్తున సంబరాలు చేశారు.రిజర్వేషన్లు పరిమితి ఎత్తివేస్తూ బిసి లకు 42 శాతం అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకొని బిల్లు ప్రవేశ పెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలుపినందుకు హర్షం వ్యక్తం చేస్తూ టీపీసీసీ ఉపాధ్యక్షులు సంగిశెట్టి జగదీష్ రావ్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావ్ నేతృత్వంలో గాంధీ భవన్ లో పెద్దఎత్తున బాణసంచా కాల్చి స్వీట్స్ పంచుకొని సంబరాలు చేశారు. ఈ సందర్భంగా సంగిశెట్టి జగదీష్ మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ల కృషిని తెలంగాణ సమాజం హర్షించాలని అన్నారు. బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఓబీసీ కో ఆర్డినేటర్ కేతురి వెంకటేష్, పులి అనిల్ కుమార్ పాల్గొన్నారు.



# కాళేశ్వరం నిర్మాణంలో తీవ్ర లోపాలు ఉన్నాయి

● అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ● ఉత్తమ్ ప్రసంగానికి అడుగడుగునా బీఆర్ఎస్ నేతలు అడ్డంకులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : కాళేశ్వరం కమిషన్ నివేదికపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ హాట్ హాట్ గా జరిగింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై లఘుచర్చను ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రారంభిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.87,449 కోట్ల ఖర్చు అయిందని తెలిపారు. నిరుపయోగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ఉన్నాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయలాంటి మేడిగడ్డ కూలిందని వివరించారు. 20 నెలల నుంచి ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండటం బాధాకరమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు . అతి పెద్ద ప్రాజెక్టుగా కాళేశ్వరం పనులను కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు. తెలంగాణకు ఇది చాలా బాధాకరమైన రోజు అని అభిప్రాయపడ్డారు. ప్రాణహిత - చేవెళ్ల కట్టాలని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రాణహిత - చేవెళ్లపై 2014 నాటికే రూ.11,600 కోట్లను అప్పటి ప్రభుత్వం ఖర్చు చేసిందని స్పష్టం చేశారు. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టు సరికాదని నాటి ప్రభుత్వ కమిటీ చెప్పిందని వివరించారు.

వాప్కోస్ రిపోర్టు రావడానికి ముందే మేడిగడ్డ బ్యారేజ్‌ను కట్టాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని.. సాంకేతిక అంశాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ఉత్తమ్ ప్రశ్నించారు. అయితే మంత్రి ఉత్తమ్ ప్రసంగానికి అడుగడుగునా బీఆర్ఎస్ నేతలు అడ్డుపడారు.

# మంత్రి ఆదేశాలతోనే ఈవో నియామకం

మంత్రి కొండా సురేఖ కార్యాలయం వివరణ



తెలంగాణ బ్యూరోప్రతినిధి: వేములవాడ ఈవోగా రమాదేవిని ఎటువంటి ఒత్తిడులు కానీ, ఎవరి అభిష్టం మేరకు కానీ నియమించ లేదని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కార్యాలయం స్పష్టం చేసింది. వేములవాడ ఈవో నియామకంపై వస్తున్న వార్త కథనాలపై తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కార్యాలయం ఆదివారం వివరణ ఇచ్చింది. సదరు ఈవో రమాదేవిని తొలుత హౌసింగ్ డిపార్టుమెంటుకు పంపాలని ఆదేశాలు రాగా.. సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆమోదం తీసుకొని మళ్లీ ఎండోమెంట్ డిపార్టుమెంటులో ఆమెను కొనసాగించాలని మంత్రి కొండా సురేఖ నిర్ణయించారని పేర్కొంది. ఆ క్రమంలో వేములవాడ ఈవోగా రమాదేవిని నియమిస్తూ.. ఉత్తర్వులు ఇవ్వాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారని చెప్పింది. వేములవాడ ఈవోగా రమాదేవి నియామకం ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామాయ్యర్ అభిష్టం మేరకు జరిగిందంటూ ఆగస్టు 31వ తేదీన ఆంగ్ల పత్రిక ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ కార్యాలయం స్పందించింది. కాగా ఈ అంశంలో ఎండోమెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ సొంత నిర్ణయం ఏ మాత్రం లేదని గుర్తించాలని మీడియా మిత్రులకు తెలంగాణ దేవాదాయ మంత్రి కొండ సురేఖ కార్యాలయం వివరణ ఇచ్చింది. ఆదివారం ఆంగ్ల పత్రికలో వెలువడిన కథనం.. కొంత మేర తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే విధంగా ఉందని అభిప్రాయపడుతూ.. దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం ఈ మేరకు వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్ ప్రమేయం లేదని.. మంత్రి కొండా సురేఖ ఆదేశాలతోనే ఈవోగా రామాదేవి నియామకం జరిగిందని మంత్రి కార్యాలయం స్పష్టం చేసింది.

## శాసనసభ ముందుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక

తెలంగాణ బ్యూరోప్రతినిధి: తెలంగాణలో శాసనసభ సమావేశాలు కొనసాగుతున్నాయి. కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రభుత్వం రెండవరోజు సభలో ప్రవేశపెట్టింది. ఎమ్మెల్యేలకు పెన్‌డ్రైవ్‌లో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చారు. మున్సిపల్ చట్టసవరణ బిల్లుతో పాటు అల్లోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లును ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టింది. తెలంగాణ పురపాలక చట్టం 2019 నిబంధన సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ మొదలైంది. చర్చ జరుగుతున్నందున ఆర్డినెన్స్ కుదరదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పురపాలక చట్టం 2019 నిబంధన సవరణ చట్టం తెచ్చినట్లు చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని పేర్కొన్నారు. దీని కోసమే ఈ బిల్లు తెచ్చినట్లు తెలిపారు. 3 ఆనకట్టల ప్రణాళిక, నిర్మాణంలో పూర్తి లోపాలు, తప్పిదాలున్నాయి. అంచనాల తయారీ, పరిపాలన అనుమతుల్లో లోపాలున్నాయి. ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతుల్లోనూ లోపాలున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. నిపుణుల కమిటీ ప్రకారం మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించరాదని నివేదిక పేర్కొంది. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదనందునే మేడిగడ్డ నిర్మించారనడం సహేతుకం కాదంది. పూర్తిగా నాటి సీఎం కేసీఆర్ నిర్ణయం ప్రకారమే మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం నిర్మించారని పేర్కొంది. ఆనకట్టల నిర్మాణానికి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానం సరిగా లేదంది. డీపీఆర్ పూర్తిగా పరిశీలించకుండానే అంచనాలు ఆమోదించారని.. కాంట్రాక్టర్ల లబ్ధికే అంచనాల పెంపు నిబంధనలు సడలించారని నివేదిక స్పష్టం చేసింది.

# వినాయక నిమజ్జనానికి డీజేలు బ్యాన్

● శ్రుతిమించుతున్న శబ్దాలతో ప్రజలు బెంబేలు ● నియంత్రణ ఆదేశాల అమలుకు కార్యాచరణ

హైదరాబాద్ : మితిమీరిన శబ్ద కాలుష్యం ప్రస్తుతం ఫ్యాషన్ అవుతోంది. రాజకీయ నాయకులకు స్వాగతం పలకాలన్నా, పెళ్లి ఊరేగింపు జరపాలన్నా, డీజే తప్పనిసరి అయింది. ఇక వినాయక చవితి విగ్రహాల నిమజ్జనం జరిగే సమయంలో వీటికి ప్రాధాన్యం మరీ ఎక్కువ. అధిక శబ్దంతో వృద్ధులు, చిన్నారులు భయకంపితులవున్నారు. పక్కపక్కనే ఉన్న వారికి మాట వినపడని పరిస్థితి నెలకొంటుంది. భారీ శబ్దాల కారణంగా చెవిలోని కర్ణభేరి ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా భవిష్యత్తులో వినికిడి శక్తి కోల్పోతారని హెచ్చరిస్తున్నారు. గతేడాది సెప్టెంబరులో నిమజ్జనాలు జరిగే సమయంలో బాపట్ల జిల్లా అద్దంకి మండలంలో డీజేలు ఏర్పాటు చేయడంతో కొన్ని గ్రామాల్లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిజాంపట్నం మండలంలో కూచినపూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి (30) చనిపోయాడు. అమలుకు నోచుకోని నిబంధనలు : రాత్రి పది గంటల నుంచి తెల్లారి ఆరు గంటల వరకు భారీ శబ్దాలతో ఊరేగింపులు పూర్తిగా నిషేధం. శబ్ద కాలుష్యంపై రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని 2015లో నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ ఆదేశించింది. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావటం లేదు. నాయకుల ఒత్తిడితో నియంత్రణ లోపం : నివాస ప్రాంతాల్లో 50 డెసిబెల్స్ వరకు శబ్దం ఉండొచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచించింది. 55 డెసిబెల్స్‌కు పైబడి ఉండే శబ్దం మానవ ఆరోగ్యానికి హానికరం. అధికారుల అలసత్వంతో అధిక శబ్దాలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఏటా వినాయక ఉత్సవాల్లో డీజేలతో విచక్షణా రహితంగా 100 నుంచి 150 డెసిబెల్స్ శబ్దాలు వినిపిస్తున్నాయి. నియంత్రించాల్సిన పోలీసులు రాజకీయ నేతల ఒత్తిడితో చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో శబ్ద కాలుష్యం అధికమవుతోంది.

సమస్యలు తప్పనిసరి : మితిమీరిన శబ్దాల కారణంగా బలహీనంగా ఉన్న వారి గుండె వేగం పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నరు. ఫలితంగా సమస్యలు తలెత్తుతాయని వివరిస్తున్నారు. కర్ణభేరిపైనా ప్రభావం పడే అవకాశం లేకపోలేదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే కొంతకాలానికి చెవి పని చేయడం మానేస్తుందని స్పష్టం చేస్తున్నారు.ఈ ఏడాది డీజేలు పూర్తిగా నిషేధం : యాప్‌లో దరఖాస్తు చేసుకున్న వినాయక విగ్రహ పందిళ్ల వద్దకు వెళ్లి పరిశీలించినట్లు అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వాహేలా చౌదరి తెలిపారు. ఈ ఏడాది డీజేలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఉన్నతాధికారులు ఆదేశించారని, వాటిని అమలు చేస్తామని అద్దంకి సీఐ సుబ్బరాజు తెలిపారు. మనిషి చెవిలోని కర్ణభేరి సాధారణంగా 25 డెసిబెల్స్‌ను తట్టుకుంటుందని, 70 నుంచి 90 డెసిబెల్స్ అయితే పూర్తిగా వినికిడిలోపం వస్తుందని ఈఎన్‌టీ వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక ఉత్సవాల్లో ఎంత శబ్దం వస్తుందో, దానివల్ల ఎలాంటి నష్టం వస్తుందో అర్థం చేసుకోవాలి.

## బీసీలకు రిజర్వేషన్లు విప్లవాత్మకమైన ముందడుగు

సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమనేది విప్లవాత్మకమైన ముందడుగు అని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభలో పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. "సభలో ఎవరేం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఒకవైపు బీసీ బిల్లుకు సంపూర్ణ మద్దతిస్తున్నామని చెబుతూనే 9వ షెడ్యూల్‌లో చేర్చకపోతే బిల్లు అవ్వదని అంటున్నారు. 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కలిసి పోరాటం చేస్తామని ఎందుకు చెప్పట్లేదు? సభలో చర్చ చూస్తుంటే తెర మీద సినిమాలు గుర్తొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బిల్లు చేసి పంపిస్తే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది" అని కూనంనేని అన్నారు.



మనసు చెప్పినట్టు మనం
వినడం కాదు...
మనం చెప్పినట్టు మనసు
వినేలా చూసుకోవాలి.
-కార్ల్ జంగ్



వినడానికి కటువుగా
ఉన్నా...మీ గురించి
వాస్తవాలు చెప్పే వారి
సలహాలు తీసుకోండి.
-మాయ ఏంజెలో



ఒక మంచి పుస్తకం వంద
మంది మిత్రులకు సమానం.
కానీ, ఒక మంచి స్నేహితుడు
ఒక గ్రంథాలయంతో సమానం.
-డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం


## స్వచ్ఛ భారత్ ప్రాముఖ్యతను
# ప్రధాని మోడీ మరోసారి గుర్తుచేశారు

### దానిని మనమంతా తప్పకుండా కాపాడుకుందాం : కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : స్వచ్ఛ భారత్ కార్యక్రమ ప్రాముఖ్యతను ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి గుర్తుచేశారని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు మన్ కీ బాత్ లో ప్రధాని నరేంద్ర మోడీ ఈ మేరకు బస్తీలు, నగరాలు, దేశం పరిశుభ్రంగా ఉండాలని, పరిశుభ్రతతోనే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని చెప్పారు. ప్రధాని అయిన వెంటనే చేపట్టిన తొలి కార్యక్రమం స్వచ్ఛ భారత్ అని, కోట్లాది పేదల ఇళ్లలో టాయిలెట్లు నిర్మించి మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం బోరబండ డివిజన్లో స్థానిక ప్రజలతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి, దిశ కమిటీ గౌరవ మెంబర్ షర్మిలా జాదవ్ తో పాటు పార్టీ డివిజన్ నాయకులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. "మన దేశ ప్రధానమంత్రి ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలతో మనసులోని మాటలను పంచుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా విరామం లేకుండా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ప్రపంచంలో ఎవరూ చేయని విధంగా, ప్రతి నెలా ప్రజలతో మమేకం అవుతూ అభివృద్ధి, సంస్కృతి, క్రీడలు, మౌలిక వసతులు వంటి విభిన్న అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టమైన సందేశం ఇస్తున్నారు. భారత స్వాతంత్ర్యం అనంతరం 13 నెలల తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జోక్యంతో పోలీస్ యాక్షన్ నిర్వహించారు. నిజాం సైన్యాన్ని, రజకార్లను ఓడించి హైదరాబాద్లో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. తెలంగాణ రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి సర్దార్ పటేల్ చేసిన కృషిని మోదీ గారు మన్ కీ బాత్ లో ప్రస్తావించారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో హైదరాబాద్ లిబరేషన్ డే ఘనంగా నిర్వహించనున్నాం. ఆ కార్యక్రమానికి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు హాజరవుతారు. అలాగే విశ్వకర్మ దివస్ ను కూడా జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటాం. అదేవిధంగా అదే రోజు ప్రధాని నరేంద్ర మోదీ గారి పుట్టినరోజు కూడా కావడంతో తెలంగాణలో మూడు ముఖ్యమైన కార్యక్రమాలను ఒకే రోజున నిర్వహించడం జరుగుతుంది. మోదీ గారు చాలా పేద కుటుంబం నుంచి వచ్చారు. వారి తండ్రి రైల్వే స్టేషన్ వద్ద చాయ్ అమ్మేవారు. ఆ పనుల్లో మోదీ గారు కూడా సాయం చేస్తుండేవారు. ఆ తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎదిగి, గత 11 సంవత్సరాలుగా దేశ ప్రధానిగా సేవలందిస్తున్నారు. దేశానికి సేవలందిస్తున్న తొలి బీసీ ప్రధాని ఆయన. ఆయన తల్లి మాత్రం సాధారణ గదిలో, చిన్న మంచం, చిన్న వంటగదితోనే సాధారణ జీవనం కొనసాగించారు. నరేంద్ర మోదీ గారి కుటుంబం ఆదర్శవంతంగా జీవనం కొనసాగించింది. ఇంత గొప్ప ప్రధానమంత్రి తల్లి రెండు సంవత్సరాల క్రితం మరణించారని తెలిసినా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్ గాంధీతో పాటు వారి అనుచరులు బీహార్లో మోదీ గారి తల్లిగారి గురించి నీచంగా, మానవత్వం లేకుండా మాట్లాడారు. అలాంటి దుర్మార్గ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలు కాలేదు. ప్రతి మహిళకు రూ. 2,500 చొప్పున మహాలక్ష్మి పథకం కింద ఇస్తామని చెప్పి రెండేళ్లు గడుస్తున్నా.. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వేల కోట్లు దోచుకుంటున్నారు.. తప్ప మహిళలకు ఒక్క రూపాయి కూడా అకౌంట్లో జమ చేయలేదు. నిరుద్యోగ యువతకు నెలకు రూ. 4,000 భృతి ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఎవరికీ ఇవ్వలేదు. పేదింటి ఆడబిడ్డలకు పెండ్లి అయ్యాక తులంబంగారం, బీసీల సంక్షేమం కోసం లక్ష కోట్లు, పెన్షన్ల పెంపు వంటి వాగ్దానాలు అన్నీ అబద్ధాలే. భూములు ప్లాటింగ్ చేస్తే అందులో 30 శాతం కమిషన్ తీసుకుంటారు. ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా కమిషన్ల ద్వారానే కాంగ్రెస్ పార్టీ నాయకులు దోచుకుంటున్నారు. అటువంటి వారు ఈరోజు ప్రధాని నరేంద్ర మోదీ గారిపై విమర్శలు చేయడం సిగ్గుచేటు. ప్రధాని నరేంద్ర మోదీ కి సొంత ఇల్లు కూడా లేదు. ఆయనకు వ్యక్తిగత వ్యాపారమేమీ లేదు. మోదీ సోదరుడు రేషన్ షాపు నడుపుకుంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సేవాభావంతో, అంకితభావంతో, రూపాయి కూడా దుర్వినియోగం చేయకుండా దేశానికి సేవ చేస్తున్నారు. అలాంటి మోదీజీ తల్లిగారి మీద దుర్మార్గపు వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరుతున్నాను. " అని కిషన్ రెడ్డి అన్నారు.

## హైదరాబాద్ విమోచన దినోత్సవంపై మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : సెప్టెంబర్ నెలలో హైదరాబాద్ విమోచన దినం జరుపుకోబోతున్నామని ప్రధాని మోడీ వెల్లడించారు. ఆదివారం మన్ కీ బాత్ 125వ ఎపిసోడ్‌లో హైదరాబాద్ గురించి ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ పోలోలో పాల్గొన్న వారందరి ధైర్యాన్ని మనం గుర్తుచేసుకునే నెల సెప్టెంబర్ అని తెలిపారు. 1947 ఆగస్టులో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినా.. హైదరాబాద్‌లో నిజాం, రజాకార్ల దురాగతాలు జరిగేవి. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు, వందేమాతరం చెప్పినందుకు కూడా ప్రజల్ని చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై, పేదలపై దారుణాలు జరిగాయని పేర్కొన్నారు. ఆ సమయంలో బాబా సాహెబ్ అంబేద్కర్ హైదరాబాద్ సమస్యపై ప్రభుత్వాన్ని హెచ్చరించారని గుర్తుకు చేశారు. చివరికి సర్దార్ పటేల్ ఈ విషయాన్ని తన చేతుల్లోకి తీసుకుని ఆపరేషన్ పోలోకు ప్రభుత్వాన్ని ఒప్పించారు. మన దళాలు హైదరాబాద్‌ను నిజాం నియంతృత్వం నుంచి విముక్తి చేసి భారత్‌లో భాగం చేశాయి. దేశం మొత్తం ఈ విజయాన్ని సెలబ్రేట్ చేశారని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సర్దార్ పటేల్ నాడు రేడియోలో మాట్లాడిన వ్యాఖ్యలు వినిపించారు. కాగా, ఏటా సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.



# క్రీడలతో ఆరోగ్యకరమైన జీవితం

### సండేస్ అండ్ సైక్లింగ్ విస్తృతం చేయాలి : రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : క్రీడలను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందవచ్చని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం వద్ద జరిగిన ఫిట్ ఇండియా- సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితానికి, పచ్చని జీవనశైలికి సైక్లింగ్ ఎంతో దోహదం చేస్తుందని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సైక్లింగ్ ను తెలంగాణలో విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆయన అన్నారు. భారత ప్రభుత్వం విస్తృతంగా చేపట్టిన సండేస్ ఆన్ సైక్లింగ్ అనే కార్యక్రమాన్ని జాతీయ ఫిట్నెస్ ఉద్యమంలా తెలంగాణలో నిర్వహించాలని" ఫిట్నెస్ కి డోస్ -అరగంట రోజ్ అన్న నినాదాన్ని విద్యార్థుల్లో యువకుల్లో ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు వివిధ వర్గాల ప్రజల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. క్రీడా కార్యక్రమాల్లో అందరూ పాల్గొనడం వల్ల సామాజిక బంధాలను బలపరుస్తాయని ఆయన అన్నారు. క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జాతీయ క్రీడా దినోత్సవం తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించి దేశంలోనే ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడిందని అన్నారు. పసి వయసు పిల్లలనుండి పండు ముసలి వరకు తెలంగాణ క్రీడా శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం హర్షనీయమని అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా జాతీయ క్రీడ దినోత్సవాన్ని 9 రోజులపాటు జరపామని చెప్పారు. కాగా తెలంగాణ క్రీడాకారులు సాధించిన విజయాలను, స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలను, సంక్షిప్తంగా సమాజానికి తెలియజేసి బావి క్రీడాకారులకు స్ఫూర్తి కలిగించే విధంగా రూపొందించిన నెలవారి సంచిక స్పోర్ట్స్ పల్స్ (క్రీడా నాడి)బులెటిన్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆవిష్కరించారు. ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైక్లింగ్ లో భాగంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ జెండా ఊపి ప్రారంభించిన సైకిల్ ర్యాలీ గచ్చిబౌలి స్టేడియం మెయిన్ గేటు నుండి ప్రారంభమై త్రిబుల్ ఐటీ జంక్షన్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ పిస్తా హౌస్ ఐక్య షోరూం ఇనోరబిట్ నుండి కేబుల్ బ్రిడ్జి నుండి మాదాపూర్ వైపు అటు నుంచి భారతీయ విద్యా భవన్ టీ హబ్ డల్లాస్ సెంటర్ రోడ్డు నుండి బయో డైవర్సిటీ రోడ్డు మీదుగా గచ్చిబౌలి స్టేడియానికి చేరుకుంది. ఇందులో పాల్గొన్న దాదాపు 1,000 మంది సైక్లిస్టులకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సైకిలిస్టుల నుండి మంచి స్పందన లభించింది. సీనియర్ సిటిజన్స్ తో పాటు విద్యార్థులు యువకులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. సోనీ బాలాదేవి తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి ఐజీ (క్రీడలు ) రమేష్ డిసిపి వినీత్ వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు సైక్లిస్ట్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్లు అమలు చేయకుంటే
# రాష్ట్రం అగ్నిగుండమే

### బీసీ పొలిటికల్ ఫ్రంట్ నేతలు బాలగౌని బాలరాజ్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టే విజయ కుమార్ గౌడ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయకుంటే రాష్ట్రాన్ని అగ్ని గుండంగా మారుస్తామని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్లు అయిలి వెంకన్న గౌడ్, యెలికట్టే విజయ కుమార్ గౌడ్, ఎస్. దుర్గయ్య గౌడ్, అంబాల నారాయణ గౌడ్ లు హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి మరోసారి రాజకీయ పార్టీలు మోసం చేస్తే సహించబోమని వారు హెచ్చరించారు. ఆదివారం చిక్కడపల్లిలోని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... 42 శాతం రిజర్వేషన్ పై అసెంబ్లీలో తీర్మానం చేయడం జరిగిందని దీనికి పార్లమెంట్లో చట్టబద్ధత కల్పించి 9వ షెడ్యూల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. కమిషన్ల పేరుతో కాలయాపన చేయాలని చూస్తే కబడ్దార్ అని హెచ్చరించారు. జివోలతో రిజర్వేషన్లు అమలు కావని వెంటనే 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేయాలని చూస్తున్నాయని బీసీలంటే జెండాలు మోసే వారుగా, ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలంతా తిరగబడితే ఏ పార్టీలకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కులగణన ప్రకారం బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇవ్వలేని మీరు చట్ట సభల్లో ఎలా అవకాశం కల్పిస్తారని ప్రశ్నించారు. చిత్త శుద్ధి లేకుండా పార్టీలు వ్యవహరిస్తున్నాయని బీసీలంతా చైతన్యం కావాలని వారు పిలుపునిచ్చారు. ఉప రాష్ట్రపతి ఎంపిక విషయంలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించకపోవడం భాదకరమన్నారు. బీసీలు మేధావులు, రిటైర్ట్ ఐఏఎస్, ఐపిఎస్లు ఉండగా అగ్ర కులానికి అవకాశం ఇచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ నాయకులు బైరు శేఖర్, దామోదర్ గౌడ్, ముత్యం ముఖేష్ గౌడ్, గజ్జె శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అనే రోజులు త్వరలో వస్తాయ్

### బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు హాట్ కామెంట్




తెలంగాణ బ్యూరో ప్రతినిధి : నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అనే రోజులు త్వరలో వస్తాయ్ అని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు హాట్ కామెంట్ చేశారు. ఆదివారం మున్సిపాలిటీ అమెండ్మెంట్ బిల్లు పై అసెంబ్లీలో బీఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ నో ఎల్ఆర్ఎస్, నోబిల్ బీఆర్ఎస్ అన్నారు.. ఇప్పుడేమో ఎల్ఆర్ఎస్ డబ్బులు బరాబర్ కట్టాలని ప్రజల వద్ద నుంచి ప్రభుత్వం వసూలు చేస్తున్నది ఇది ఎంత మాత్రం సరి కాదు అని పేర్కొన్నారు. నో ఎల్ఆర్ఎస్, నో కాంగ్రెస్ అని ప్రజలు అనే రోజులు త్వరలోనే వస్తాయని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎట్టైన ఫైనాన్స్ బిల్లులు ఇవ్వడం లేదు కనీసం అసెంబ్లీలో పెట్టే బిల్లు పై మాట్లాడించండి అని అన్నారు. కొన్ని మున్సిపాలిటీలలో గ్రామపంచాయతీలను చేరుస్తూ గతంలో వచ్చిన ఆర్డినెన్స్ లు సభ ముందుకు తీసుకువచ్చారు. ఈ బిల్లుకు పూర్తిగా సమర్థిస్తున్నా మా మద్దతిస్తున్నాం అని హరీష్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 22 నెలలు అవుతుందని అయితే ప్రస్తుతం మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే ఉందని వీటికి ఆయన సమాధానం చెప్పాలన్నారు. ఎన్ని మున్సిపాలిటీలు ఏర్పాటు చేశాం అన్నది మనది ముఖ్యం కాదు మున్సిపాలిటీలను ఎంత మేరకు అభివృద్ధి చేశాం, మున్సిపాలిటీలకు నిధులు ఇస్తున్నారా ? లేదా ? అనేది ముఖ్యం. అని హరీష్ రావు అన్నారు. సిద్దిపేటలో మున్సిపాలిటీ ఉందని, ఇందులో లక్ష ,20 వేల ఓట్లు ఉంటాయని అక్కడ కనీసం ఫాగింగ్ కి కూడా డబ్బులుఇవ్వని పరిస్థితిలో ప్రభుత్వము ఉందని హరీష్ రావు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు నెల,నెలా పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చేవాళ్లం. అని, ఇప్పటి వరకు పట్టణ ప్రగతి కింద ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. ఎన్నికలు జరగలేదని ఫైనాన్స్ కమిషన్ డబ్బులు కూడా రావడం లేదని హరీష్ రావు విమర్శించారు. ఎల్ ఆర్ ఎస్ విషయంలో గతంలో బీఆర్ఎస్ పై మీరే విమర్శలు చేశారు. కాంగ్రెస్ వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామన్నారు. ఆ ప్రభుత్వం ఉన్నప్పుడే ఎల్ఆర్ఎస్ జీవో తెచ్చాము. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కొంత డబ్బుని డెవలప్మెంట్ కోసం కేటాయించడం జరుగుతుంది. ఎల్ఆర్ఎస్ పై వచ్చిన డబ్బులు ఎన్ని వచ్చినా డబ్బులను ఎన్ని మున్సిపాలిటీలకు, పట్టణాలకు ఎప్పటిలోగా ఇస్తారు ? పట్టణ ప్రగతి కింద నిధులు లేవు ఎన్నికలు లేనందున ఫైనాన్స్ కమిషన్ డబ్బులు లేవు. ప్రభుత్వం నుంచి ఒక రూపాయి వచ్చేది లేదు.. కనీసం ఎల్ఆర్ఎస్ లో వసూలు చేసిన డబ్బుల్లో కొంత మేర మున్సిపాలిటీ అభివృద్ధికి కేటాయించాలని ఆ చట్టంలోనే ఉంది. ఎంతవరకు కేటాయిస్తారో చెప్పాలి. అసలు ఇస్తారా, ఇవ్వాలని కూడా చెప్పాలి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా మున్సిపాలిటీలో ఎన్ని రిజిస్ట్రేషన్లు అయితే అందులో కొంతమేరకు ఆ పట్టణ అభివృద్ధి సంస్థకు ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ డబ్బు,ఎల్ఆర్ఎస్ డబ్బును పట్టణ ప్రగతి డబ్బును ఇవ్వకుంటే ఎట్ల మున్సిపాలిటీలు నడవాలి అధ్యక్ష? ఎన్ని మున్సిపాలిటీలను చేసామని కాదు అధ్యక్ష .. మున్సిపాలిటీలు నడిచేందుకు నిధులు కేటాయిస్తున్నారా లేదా చెప్పాలి.. కొత్త మున్సిపాలిటీలో స్టాఫ్ లేదు. ప్లానింగ్ లేదు. కేవలం ఏర్పాట్లు చేసుకుంటూ పోతే మున్సిపాలిటీ నిర్వీర్యంగా అయిపోతున్నాయి. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటుకు అనుకూలంగా కొత్త నియమకాలు, ఉద్యోగాలు రిక్రూట్మెంట్ జరుగుతున్నదా? గతంలో కేసీఆర్ గారు ఉన్నప్పుడు సంగారెడ్డి జిల్లాలో పటాన్ చెరువు నియోజకవర్గం వర్గానికి, సంగారెడ్డి నియోజకవర్గానికి, జహీరాబాద్ నియోజకవర్గానికి 50 కోట్లు ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించారు. అప్పటిలోనే ఆందోల్ కు కేసీఆర్ కూడా నిధులు ఇచ్చారు . మంత్రి దామోదర్ మాత్రం ఇప్పుడు ఆందోల్ కు ఎస్‌డిఎఫ్ నిధులను ఉంచుకొని పక్కనఇంకో వర్గం హెచ్డిఎఫ్సి నిధులను రద్దు చేశారు. ఇదెక్కడి న్యాయం అని హరీష్ రావు విమర్శించారు. జహీరాబాద్,సంగారెడ్డి, పటాన్చెరువు ప్రజలైనా తెలంగాణ ప్రజలే కదా. పన్నులు కూడా కడుతున్నారు కదా. ఎక్కడైతే గతంలో ఎస్‌డీఎఫ్ నిధులు కేటాయించారో వాటిని తిరిగి సాంక్షన్ చేయాలని కోరుతున్నాం. అని హరీష్ రావు కోరారు.

### సీఎం రేవంత్ రెడ్డి బీసీ జన బాంధవుడు : కాంగ్రెస్ పార్టీ అధికారప్రతినిధి డా. కొనగాల మహేష్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః బీసీ వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికలలో, 42 శాతం రిజర్వేషన్ కల్పించే మహోన్నత లక్ష్యంతో, కెసిఆర్ తెచ్చిన 2018 పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 285 రద్దు పరుస్తూ, నేడు తెలంగాణ శాసనసభలో చట్ట సవరణ చేసినందుకు సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి బీసీ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డా.కొనగాల మహేష్ తెలిపారు. 42% రిజర్వేషన్ అమలు చేయాలని, అనుగుణంగా రిజర్వేషన్లపై 50% పరిమితిని, నిన్నటి రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రికి బలహీన వర్గాల అభ్యున్నతిపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుంది అన్నారు. జనాభా దామాషా పద్ధతిని రిజర్వేషన్ అమలు చేస్తూ, బీసీలకు రాజ్యాధికారం అందించాలని రాహుల్ గాంధీ ఆలోచనను తూచా తప్పకుండా అమలు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలంగాణ బీసీ వర్గాలు సర్వదా రుణపడి ఉంటారని తెలియజేస్తున్నామని మహేష్ తెలిపారు.

# ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద అమరణ నిరాహార దీక్ష చేయండి

- బీసీ బిల్లుపై సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచన
- పంచాయతీ రాజ్ చట్ట సవరణపై శాసనసభలో కేటీఆర్ వ్యాఖ్య



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బీసీ బిల్లు సాధించాలంటే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అమరణ నిరాహార దీక్ష చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణపై శాసనసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ ఈ బిల్లుకు సంబంధించి ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తో అఖిలపక్షానికి సమయం తీసుకోండని, తమ పార్టీ కూడా వచ్చి బలంగా మద్దతు ఇస్తామని అన్నారు. గతంలో కేసీఆర్ ఢిల్లీకి వెళ్తూ తెలంగాణ సాధించుకుని వస్తా అని చెప్పి పోయారని, దమ్ముంటే రేవంత్ రెడ్డి కూడా అదే మాదిరి ఢిల్లీకి పోయి బీసీ బిల్లు సాధించే దాకా అవసరమైతే జంతర్ మంతర్ లోనే కూర్చోవాలని కేటీఆర్ సూచించారు. అంత కమిట్మెంట్, నిబద్ధత ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ఉండాలన్నారు. అపాయింట్‌మెంట్‌లు అడిగితే ఢిల్లీలో చెప్పులు ఏత్తుకుని పోతారని చెప్తారు... రేవంత్ రెడ్డి మాట్లాడిన తర్వాత అపాయింట్‌మెంట్‌లు ఎందుకు ఇస్తారు? ఇప్పటికైనా ముఖ్యమంత్రి బుద్ధి, ఆయన మాట తీరు మార్చుకోవాలి అని కేటీఆర్ అన్నారు. బీసీల రిజర్వేషన్లు తెలంగాణలో ఆమోదం పొందకముందే%ô% తెలంగాణ ప్రజల సొమ్ముతో బీహార్లో ముఖ్యమంత్రి తన ఫోటోలతో పత్రిక ప్రకటనలు ఇచ్చుకుంటున్నాడన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా బీసీలకు ఓబీసీ వెల్ఫేర్ శాఖ పెట్టాలని డిమాండ్ చేసిన నాయకుడు కేసీఆర్ అని, 2004లోనే కేంద్రంలో బీసీ సంక్షేమ శాఖ పెట్టాలని కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తు చేశారు. 2002లోనే బీసీ పాలసీని పార్టీ తరపున తీసుకొచ్చిన నాయకుడు రాహుల్ గాంధీ కంటే ముందే కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. జనగణనతో పాటు కులగణన కోసం కేసీఆర్ డిమాండ్ చేశారని, శాసనసభలో ఎన్ని రాజకీయ విమర్శలు చేసినా, దీనిపై మన పరిధిలో లేదు. కానీ ఈ అంశం ముఖ్యమంత్రికి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు తెలియదనుకోవడం లేదన్నారు. 42 % రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇరుక్కుపోయింది. అందుకే తమ పరిధిలో లేని అంశంపై చట్టం తీసుకువచ్చి బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎంతమంది ఉంటే అంత ప్రాతినిధ్యం ఉండాలని రాహుల్ గాంధీ చెబుతున్నారు. మరి ఎందుకు 42% రిజర్వేషన్ అంశాన్ని ఆయన పార్లమెంట్‌లో మాట్లాడడం లేదు? మార్చిలో బిల్లు పాస్ చేసిందానికి, దీనికి తేడా ఏమిటో ఇప్పుడు చెప్పండి. అప్పుడు చేసిన దానికి, ఇప్పుడు చేసిందానికి తేడా ఏమిటి? అప్పుడు చేయని రాష్ట్రపతి, గవర్నర్ ఇప్పుడు ఎలా చేస్తారు? ప్రభుత్వాలు చేసిన చట్టాలు లొసుగులు లేకుండా చేసుకుంటే మంచిది.కేవలం బీసీ డిక్లరేషన్లు ఇచ్చి వదిలేస్తే సరిపోదు, డెడికేషన్ ఉండాలి . కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదు%ô% గతంలో మేం పెట్టిన పంచాయతీరాజ్ చట్టంలో, మున్సిపల్ చట్టంలో ఎక్కడా సీలింగ్ అనే అంశం లేదు" అని కేటీఆర్ అన్నారు.

**ELECTRONICS MART INDIA LIMITED**

Electronics Mart India Limited

CIN-L52605TG2018PLC126593

**నమోదిత కార్యాలయం:** డో.నం.6-1-91, షాప్ నెం. 10, గ్రౌండ్ ఫ్లోర్, టెలిఫోన్ భవన్ తరువాత సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్, తెలంగాణ - 500 004, టెలి: 040-23230244

Email: communications@bajajelectronics.in Website: www.electronicsmartindia.com

**వీడియో కాన్ఫరెన్సింగ్ / ఇతర ఆడియో-విజువల్ మార్గాలు మరియు ఈ-ఓటింగ్ ద్వారా జరగనున్న ఏడవ (07) వార్షిక సాధారణ సమావేశం ప్రకటన**

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ("MCA సర్క్యులర్లు") మరియు SEBI సర్క్యులర్ నం. SEBI/HO/CFD/CFD-PoD-2/P/CIR/2024/133 ("SEBI సర్క్యులర్") మరియు కంపెనీల చట్టం, 2013 ("చట్టం") మరియు SEBI (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు బహిర్గత అవసరాలు) నిబంధనలు ("SEBI లిస్టింగ్ నిబంధనలు") జారీ చేసిన సర్క్యులర్ నెం. 14/2020, 17/2020, 20/2020, 09/2023 మరియు 09/2024 ప్రకారం ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా లిమిటెడ్ ("కంపెనీ") యొక్క ఏడవ (07వ) వార్షిక సర్వసభ్య సమావేశం ("AGM") గురువారం, 25 సెప్టెంబర్ 2025న మధ్యాహ్నం 12:30 గంటలకు జరగనుందని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. (IST) వీడియో కాన్ఫరెన్స్ ("VC")/ఇతర ఆడియో-విజువల్ మార్గాల ద్వారా ("OAVM") నోటీసులో పేర్కొన్న విధంగా వ్యాపార అంశాలను లావాదేవీలు చేయడానికి. కంపెనీ కార్పొరేట్ కార్యాలయం, 6-3-666/A1 నుండి 7, 03వ & 04వ అంతస్తులు, NIMS హాస్పిటల్ ఎదురుగా, పంజాగుట్ట మెయిన్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ-500082 వద్ద ఉంది, దీనిని AGM వేదికగా పరిగణిస్తారు.

MCA మరియు SEBI జారీ చేసిన సర్క్యులర్‌లకు అనుగుణంగా, కంపెనీ/డిపాజిటరీ పార్టిసిపెంట్(లు)/RTA వద్ద ఈమెయిల్ చిరునామాలు నమోదు చేసుకున్న సభ్యులందరికీ కంపెనీ ఆర్థిక నివేదికలతో సహా ఇంటిగ్రేటెడ్ వార్షిక నివేదికను ఇమెయిల్ ద్వారా పంపిణీ చేసింది. నోటీసు మరియు ఇంటిగ్రేటెడ్ వార్షిక నివేదిక యొక్క ఎలక్ట్రానిక్ సర్క్యులేషన్ ఆగస్టు 30, 2025న పూర్తయింది.

డిపాజిటరీ పార్టిసిపెంట్స్ (DPలు) వద్ద తమ ఇమెయిల్ IDలను నమోదు చేసుకోని లేదా వాటిని నవీకరించాలనుకునే సభ్యులు ఈమెయిల్ IDలను నవీకరించడానికి వారి సంబంధిత DPలను సంప్రదించవచ్చు. భౌతిక రూపంలో వాటాలను కలిగి ఉన్న సభ్యులు కంపెనీ రిజిస్ట్రార్ & షేర్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ అయిన KFin టెక్నాలజీస్ లిమిటెడ్ ("KFin") కు einward.ris@kfintech.com వద్ద ఫారమ్ ISR-1ని సమర్పించడం ద్వారా వారి ఈమెయిల్ IDలను నమోదు చేసుకోవచ్చు.

చట్టంలోని సెక్షన్ 108 ప్రకారం, దాని కింద రూపొందించిన నియమాలు మరియు SEBI లిస్టింగ్ నిబంధనలలోని నిబంధన 44 ప్రకారం, కంపెనీ ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా రిమోట్ ఈ-ఓటింగ్ సౌకర్యాన్ని అందిస్తోంది మరియు వ్యాపారాలు అటువంటి ఓటింగ్ ద్వారా లావాదేవీలు చేయబడతాయి. ఓటు వేయని సభ్యులకు AGM సమయంలో కూడా ఈ-ఓటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఇ-ఓటింగ్ ప్రక్రియను న్యాయంగా మరియు పారదర్శకంగా నిర్వహించడానికి బోర్డు శ్రీ వినోద్ సకారాం, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీ, హైదరాబాద్ (COP: 8345) ను స్క్రూటినైజర్‌గా నియమించింది.

కట్-ఆఫ్ తేదీ, అంటే గురువారం, సెప్టెంబర్ 18, 2025 నాటికి భౌతిక లేదా డీమ్యాట్ రూపంలో వాటాలను కలిగి ఉన్న సభ్యులు, రిమోట్ ఈ-ఓటింగ్ ద్వారా నోటీసులో పేర్కొన్న విధంగా ఎలక్ట్రానిక్‌గా తమ ఓటును వేయవచ్చు.

నోటీసు పంపిన తర్వాత కంపెనీ షేర్లను కొనుగోలు చేసి, కటాఫ్ తేదీ నాటికి షేర్లను కలిగి ఉన్న ఏ సభ్యుడైనా రిమోట్ ఈ-ఓటింగ్ కోసం లాగిన్ ఆధారాలను einward.ris@kfintech.com లేదా cs@bajajelectronics.in కు ఈమెయిల్ పంపడం ద్వారా వారి ఫోలియో నంబర్, DP ID మరియు క్లయింట్ ID ని పేర్కొనడం ద్వారా పొందవచ్చు. అయితే, KFin లో ఇప్పటికే నమోదు చేసుకున్న సభ్యుల విషయంలో వారి ఓటు వేయడానికి అదే ఆధారాలను ఉపయోగించవచ్చు.

రిమోట్ ఈ-ఓటింగ్ **సోమవారం, 22 సెప్టెంబర్ 2025 ఉదయం 9:00 గంటలకు** (IST) ప్రారంభమై **బుధవారం, 24 సెప్టెంబర్ 2025 సాయంత్రం 5:00 గంటలకు** (IST) ముగుస్తుంది.

నిర్దేశిత తేదీ మరియు సమయం తర్వాత రిమోట్ ఈ-ఓటింగ్ నిలిపివేయబడుతుంది మరియు సభ్యులు తమ ఓటు వేయడానికి అనుమతించబడరు.

అయితే, AGM సమయంలో ఈ-ఓటింగ్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది మరియు AGMకి హాజరైన మరియు ఓటు వేయని సభ్యులు కంపెనీ అందించిన ఓటింగ్ విధానం ద్వారా AGMలో అదే విధంగా ఓటు వేయవచ్చు. అంతేకాకుండా, AGMకి ముందు ఓటు వేసిన సభ్యులు AGMలో పాల్గొనడానికి అర్హులు అవుతారు కానీ మళ్ళీ ఓటు వేసే హక్కు ఉండదు.

కటాఫ్ తేదీ నాటికి డిపాజిటరీలు నిర్వహించే సభ్యుల రిజిస్టర్ లేదా ప్రయోజనకరమైన యజమానుల రిజిస్టర్‌లో పేర్లు ఉన్న సభ్యులు మాత్రమే రిమోట్ ఈ-ఓటింగ్ సౌకర్యాన్ని పొందేందుకు, AGMకి హాజరు కావడానికి మరియు అందులో ఓటు వేయడానికి అర్హులు.

AGM నోటీసు మరియు ఇంటిగ్రేటెడ్ వార్షిక నివేదిక కంపెనీ వెబ్‌సైట్ https://investors.electronicsmartindia.com/లో, KFin వెబ్‌సైట్ https://www.kfintech.comలో మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వెబ్‌సైట్, అంటే www.nseindia.comలో మరియు BSE www.bseindia.comలో కూడా అందుబాటులో ఉన్నాయని సభ్యులు గమనించవచ్చు. సభ్యులు einward.ris@kfintech.com లేదా cs@bajajelectronics.inలో మెయిల్ ద్వారా అభ్యర్థించడం ద్వారా దాని హార్డ్ కాపీని పొందవచ్చు.

ఏవైనా ప్రశ్నలు లేదా సమస్యలు ఉంటే, మీరు https://evoting.kfintech.com యొక్క డౌన్‌లోడ్ విభాగంలో అందుబాటులో ఉన్న వాటాదారుల కోసం తరచుగా అడిగే ప్రశ్నలు (FAQలు) మరియు వాటాదారుల కోసం ఈ-ఓటింగ్ యూజర్ మాన్యువల్‌ను చూడవచ్చు లేదా 1800 309 4001 (టోల్-ఫ్రీ)లో KFin టెక్నాలజీస్ లిమిటెడ్‌ను సంప్రదించవచ్చు. ఈ-ఓటింగ్‌కు సంబంధించిన ఫిర్యాదు విషయంలో, సభ్యులు కంపెనీ కార్యదర్శి & కంప్లైయన్స్ ఆఫీసర్ శ్రీ రాజీవ్ కుమార్‌ను కంపెనీ కార్పొరేట్ కార్యాలయంలో లేదా ఫోన్: 040-23230244కు సంప్రదించవచ్చు లేదా cs@bajajelectronics.in కు ఈమెయిల్ పంపవచ్చు.

**ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా కొరకు**
**సం/-**
**రాజీవ్ కుమార్**
**కంపెనీ సెక్రటరీ**
**(A42082)**

**తేది:** 30 ఆగస్టు 2025
**స్థలం:** హైదరాబాద్

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక

# అక్షరం

4 సోమవారం 1 సెప్టెంబర్ 2025
suryaeditpage@gmail.com

## పోస్ట్ బాక్స్





ఒకప్పటి అందరి ఆత్మీయ నేస్తం
సమానత్వానికి అదో నిదర్శనం
బంధాల్ని చేస్తోంది బలోపేతం
పలు కబుర్లను చేతుల్లోకి చేర్చుతూ..
మా అందరి ఆత్మీయ మిత్రుడైంది !
ఉత్తరాలతో కడుపు నింపుకునే..
ఊరి పోస్ట్ బాక్స్ నేడు తుప్పుపట్టి..
నిరాదరణ ఊబిలోకి జారిపోయి..
గత వైభవం చరిత్రలో చేరిపోయి..
కొరియర్ వ్యాపార కోరల్లో చిక్కి పోయి..
డిజిటల్ కొరడా దెబ్బలు తుంటూ..
ఈ-మెయిల్స్ వరదలో కొట్టుకుపోతూ..
వాట్సప్ వాగుడు వైరస్ సోకి..
శుష్కించి క్రమంగా అంతరించి పోతూ..
ఉత్తరాలు రాసే కళ మసకబారుతూ..

ఉత్తరాల రాకకు ఎదురు చూస్తూ..
నిరాశల మబ్బులు కమ్మి పోయి..
పోస్టు డబ్బా కడుపు మాడిపోతూ..
ఒడువని దుఃఖాన్ని దిగమింగుకుని..
దీనంగా చూస్తోంది ఆ ఎర్ర డబ్బా !

**మధుపాళీ 9949700037**

## గోరింక



చక్కని జంటను చిలకా గోరింకలంటారు
రెండింటి పలుకులు వేరుకావు
చిలకా గోరింకలు చూపుకు ఒకటి కావు
రెంటినీ చూసి నేర్చుకోమంటారు!

గూడు గూట్లో హాయిగా వుంటావు
ఆదర్శ మైన కాపురం చేస్తావు
ఉల్లాసంగా ఉత్సాహంగా వుండాలంటావు
పొదరిల్లు నాదని పొంగిపోతావు!

ఓ మైనా మైనా
నీవున్న చోటు సదా కిల కిల
అనిపిస్తుంది చిట్టి గోల గోల
చిన్నారులు రువ్వే నవ్వుల కల కల
వింటే వీనుల విందుల హేల!

గోరింక గోరింక గోరింక
పలకాలి పకాపకా నీ వింక
గువ్వ లే తిరగాలి నీ వంక
కలలో కులకాలి మేమింక !

ఓ మైనా ఏమైనా
నేనంటే నీకిష్టం ఓ మైనా
అప్పుడు ఇప్పుడు ఎప్పుడైనా
మారని నీ ప్రేమ బంగారం ఇలలోన!

**పట్లోళ్ళ బక్కారెడ్డి, 9705315250**

## వానొచ్చే వరదొచ్చే..!




హెూరు గాలిలో వరద నీటిలో
మునిగితేలిన మూగజీవాలెన్నో
అసువులు బాసిన ప్రాణాలెన్నో
ఎడతెరిపి లేని కుంభవృష్టితో
కునుకు కరువైన జీవితాలెన్నో
కూడు దొరకని కడు జీవనాలెన్నో
తుఫాను అలజడి గడిబిడిలో
కూలిపోతున్న గోడలెన్నో
విరిగిపడుతున్న వృక్షాలెన్నో
జోరుగా పారే వాగు వంకల్లో
కొట్టుకుపోతున్న వాహనాలెన్నో
చెదిరిపోతున్న బంధాలెన్నో
చిటపటల చినుకుల చిత్తడిలో
చిరిగిపోతున్న బ్రతుకులెన్నో
చల్లాచెదురై మునిగిన పంటలెన్నో
నెత్తిని చిట్లించే పటపట చినుకుల్లో

ఆరిపోతున్న కంటిపాపలెన్నో
బిక్కుబిక్కుమంటూ చూపులెన్నో
వానొచ్చే వరదొచ్చే వేళల్లో
ముసురొచ్చే ముంచుకొచ్చే దారుల్లో
పడవలు నడుస్తున్న వీధులెన్నో
నీటిలో కలిసిపోతున్న కన్నీళ్లెన్నో
ఉరుమొచ్చే మెరుపొచ్చే పొద్దుల్లో
అదిరిపడిన గుండెలెన్నో
ఒరిగిపోయిన దేహాలెన్నో

**- నరెద్దుల రాజారెడ్డి : 9666016636**

## ఓ విఘ్నేశ్వరా!!



ఓ బొజ్జ గణపయ్య
నీ భక్తులమ్మేమయ్య
చవితి చంద్రున్నిగంటివే-
ఎమోనయ్య
సతమతమవుతూ
సాగుతుంటిమయ్య!

ఆ నీలాపనిందలతో
గిల్లికజ్జాలైతే
గింజల నింపుతున్న గోతాన్ని
ఎత్తికుదేసి నింపితే చక్కగా
ఒదిగినట్లు
వదులుగానున్న బంధాలన్నీ
వదులుకోనంత
బిగుసుకుంటయయ్య !

ఆ నీలాపనిందలతో
ఉప్పునిప్పైతే
తిప్పలెక్కువయ్యి
తిక్కలెక్కువయ్యి
చక్కనయిన స్నేహాలెన్నో
అక్కరకురాని అనుబంధాలుగా
చెదురుమదురై
చిట్లిపోతయయ్య !

ఆ నీలాపనిందలతో
కోరివీచమురైతే
అగ్గి ఆరిపోదదయ్య
అలవిగాదదయ్య
అణచ వీలుకాదదయ్య
అంతా ఆహుతేనయ్య!

ఆ నీలాపనిందలతో
శత్రుఘ్నుల శత్రుత్వమైతే
మిస్సైల్ల పలకరింపులైతే
డ్రోన్ల దాడుల దర్శనాలైతే
మానవత్వమే మృగ్యమయ్య
మనిషితనమే బ్రతకదయ్య
మనిషి మనుగడే ఉండదయ్య!

ఆ నీలాపనిందలు
నిలువరించవయ్య
మిక్కిలి తక్కువతో తిప్పలు
తప్పించవయ్య
విశ్వశాంతిని కాపాడవయ్య
దయతో శాంతిని
ప్రసాదించవయ్య
ఓ విఘ్నేశ్వరా
సర్వవిఘ్నోపశాంతయే
ఓం శాంతి! శాంతి! శాంతిః!

**- రవి కిషోర్ పెంట్రాల,**
**లాంగ్లీ, లండన్!**
**0044-07703327908**

# దక్షప్రజాపతి జననం, సకల జీవరాశుల సృష్టి

## శ్రీ మహాభాగవత కథ-51





**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కం॥ చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, డమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**

పూర్వం పాపభారాన్ని మోయలేక భూమి, గోరూపం ధరించి, బ్రహ్మ దగ్గరికి పోయి కన్నీరు-మున్నీరుగా ఏడ్చింది. ఆమెను తీసుకుని, ఇంద్రాది దేవతలతో సహా విష్ణుమూర్తిని సందర్శించాడు బ్రహ్మదేవుడు. అప్పుడు బ్రహ్మకు భగవద్వాణి విని పించింది. తాను విన్నదాన్ని ఇతరులకు వినిపించాడు బ్రహ్మదేవుడు. భగవంతుడు యదుకులంలో అవతరించనున్నాడని, దేవతలంతా వారి-వారి అంశలతో యదువంశంలో భూమ్మీద విష్ణుమూర్తి కంటే ముందరే జన్మించమని చెప్పాడు. ఆ తరువాత విష్ణువు వసుదేవుడికి కొడుకై పుట్టి భూభారాన్ని తగ్గిస్తాడని చెప్పాడు. దేవతా స్త్రీలంతా శ్రీహరికి సపర్యలు చేయడానికి సుందర రూపంలో పుట్టాలనీ, ఆదిశేషుడు ఆయనకు అగ్రజుడిగా జన్మిస్తాడని కూడా చెప్పాడు.

ఆ సమయంలో శూరసేనుడనే యాదవరాజు మధుర రాజధానిగా రాజ్యపాలన చేస్తున్నాడు. ఆయన కొడుకు వసుదేవుడు దేవకీదేవిని పెళ్లి చేసుకుని, ఆమె అన్న, ఉగ్రసేనుడి కుమారుడు కంసుడు స్వయంగా రథం తోలుతుంటే తన ఇంటికి బయల్దేరాడు. ఇంతలో అశరీరవాణి, కంసుడిని హెచ్చరిస్తూ, ఆయన సోదరికి పుట్టబోయే ఎనిమిదవ కుమారుడు ఆయన్ను సంహరిస్తాడని చెప్పింది. వెంటనే చెల్లెలిని రథం మీద నుండి లాగి చంపడానికి సిద్ధపడ్డాడు. ఆ పని విరమించుకొమ్మని వసుదేవుడు బావ కంసుడిని ప్రార్థించాడు. ఆమెకు పుట్టబోయే కొడుకులందరిని వరుసగా తెచ్చి కంసుడికి ఇస్తానని, వాళ్లను సంహరించమని చెప్పడంతో అంగీకరించి, చెల్లెలిని విడిచిపెట్టాడు. ఏడాదికి ఒకరిని చొప్పున దేవకీదేవి కన్న కొడుకులను వసుదేవుడు అన్నమాట ప్రకారం కంసుడికి తెచ్చి ఇచ్చేవాడు. వారితో తనకు అవసరం లేదని, ఎనిమిదవ వాడిని తెచ్చి ఇమ్మని చెప్పాడు కంసుడు.

ఒకనాడు నారదుడు కంసుడికి దగ్గరికి వచ్చి, దేవతలే యాదవులుగా పుట్టారని, ఆయన కాలనేమి అనే రాక్షసుడని చెప్పాడు. విష్ణుమూర్తి దేవకీదేవి పుత్రుడిగా పుట్టి కంసుడిని సంహరిస్తాడని అన్నాడు. వెంటనే దేవకీవసుదేవులను పట్టి బంధించి, చెరసాలలో వేసి, అప్పటికి పుట్టిన ఆరుగురు కొడుకులను సంహరించాడు. తన తండ్రి ఉగ్రసేనుడిని కూడా చెరసాలలో వేశాడు. యాదవులందరినీ యుద్ధం చేసి ఓడించాడు.

దేవకీదేవి ఆరుగురు కొడుకులను కంసుడు చంపినా తరువాత ఏడవ గర్భంగా ఆదిశేషుడు అనబడే విష్ణువు అంశ ఆనే గర్భంలో ప్రవేశించింది. విష్ణువు యోగామాయాదేవితో, దేవకీదేవి గర్భంలో వున్న ఆయన తేజస్సును నేర్పుగా తీసి వ్రేపల్లెలోని రోహిణీదేవి గర్భంలో ప్రవేశపెట్టమని, ఆమెను నందుడి భార్య యశోదకు కూతురుగా జన్మించమని ఆదేశించాడు. ఆయన ఆజ్ఞానుసారం యోగమాయ భూలోకానికి వచ్చింది. విష్ణువు చెప్పినట్లే చేసింది. దేవకికి గర్భ స్రావం అయిందని భావించారు అంతా. కొన్నాళ్లకు రోహిణీదేవి బిడ్డను కన్నది. అతడిని బలభద్రుడని, రాముడని, సంకర్షణుడని పిలవసాగారు. ఆ తరువాత శ్రీమన్నారాయణుడి తేజస్సు దేవకీదేవి గర్భంలో ప్రవేశించింది. పద్నాలుగు లోకాలను తన కడుపులో సంరక్షిస్తున్న శ్రీహరిని, గర్భంలో మోస్తు న్న దేవకీదేవి ముఖ తేజస్సును చూసిన కంసుడు, విష్ణువు ఆమె గర్భంలో ప్రవేశించి వుండాలన్న నిర్ణయానికి వచ్చాడు. కంసుడు ఎడతెగని విరోధం వల్ల నిరంతరం విష్ణు నామ స్మరణ చేస్తూ, బిడ్డ పుట్టగానే చంపడానికి ఎదురు చూడసాగాడు. తన శరీరాన్ని గడ్డిపోచ తాకినా అది విష్ణు మూర్తేమో అని భయపడసాగాడు. సరిగ్గా అదే సమయంలో ఇంద్రాది దేవతలు, నారదాది మునులు, బ్రహ్మ, శివుడు, దేవకీదేవి వున్నా చెరసాల వద్దకు వచ్చి, ఆమె గర్భంలో వున్న శ్రీమహావిష్ణువును స్తుతించారు. ఆయన జన్మించడం వల్ల భూదేవి భారం తగ్గిపోతుందని, ఆయన పాదస్పర్శతో భూలోకాన్ని ఆనందంగా చూడగలమని అన్నారు. భూభారాన్ని తొలగించమని ప్రార్థించారు. స్తోత్రం చేసిన తరువాత బ్రహ్మాది దేవతలు, మునులు దేవకీదేవిని ఆశీర్వదించి వెళ్లిపోయారు.

ఈ నేపథ్యంలో, గ్రహనక్షత్రాలు అత్యంత శుభ స్థానాలలో వుండగా దేవకీదేవి అర్ధరాత్రి సమయంలో కుమారుడిని కన్నది. దేవదేవుడు ఉద్భవించాడు. ఆ బాలుడిని చూసిన వసుదేవుడు ఆ తేజస్సుకు ఆశ్చర్యపడి, మహెూత్సాహాన్ని పొందాడు. అతడు తన బిడ్డ అని భావించకుండా, సాక్షాత్తు పరమాత్మగా భావించి స్తుతించాడు. కంసాది దానవులను సంహరించడానికి అవతరించిన భగవానుడని స్తుతించాడు. అప్పుడే దేవకీదేవి కూడా ఆబాలుడిని తేరిపార చూసింది. బాలుడిని భగవంతుడిగా గ్రహించి స్తోత్రం చేసింది.

దేవకీదేవి తనను స్తుతిస్తుంటే, శ్రీహరి తన నిజరూపంలో ఆమెకు ఆమె పూర్వ జన్మ వృత్తాంతం చెప్పాడు. స్వాయంభవ మన్వంతరంలో ఆమె 'పృశ్ని' అనే పరమ పతివ్రత అని, వసుదేవుడు 'సుతపుడు' అన్న పేరుగల ప్రజాపతి అని అన్నాడు. వారి తపస్సుకు మెచ్చి తాను ప్రత్యక్షమై వరాలు కోరుకొమ్మన్నప్పుడు తన లాంటి కొడుకు కావాలని కోరారని, అలాగే వరమిచ్చి, మొదట్లో 'పృశ్ని గర్భుడు' అనే పేరుతొ ఆమెకు జన్మించానని చెప్పాడు. వారు రెండవ జన్మలో అదితి, కశ్యపుడుగా పుట్టారని అప్పుడు వారికి అప్పుడు వామనుడిగా తాను జన్మించానన్నాడు. మూడవ జన్మలో మళ్లీ ఇప్పుడు పుట్టానన్నాడు. ఇక ముందు వారికి జన్మ లేదని కూడా చెప్పాడు.

శ్రీహరి వసుదేవుడి కర్తవ్యాన్ని కూడా చెప్పాడు. అదే సమయంలో యశోదా దేవికి యోగమాయ కూతురుగా జన్మించింది. వాసుదేవుడు నిమ్మడిగా బాలు డిని రొమ్మున అదుముకుని పురిటి ఇంట్లో నుండి బయటకు వచ్చాడు. హరి మాయవల్ల తలుపుల తాళాలు విడివడ్డాయి. ఆదిశేషుడు బాలుడికి గొడుగు లాగా కప్పివున్నాడు. ముందుకు వెళ్తుండగా యమునానది అడ్డం వచ్చింది. అది దారి ఇచ్చింది వసుదేవుడికి. యమునానదిని దాటి నందుడి వ్రేపల్లెలో ప్రవేశించాడు. యశోదాదేవి పక్కన బాలకృష్ణుడిని పడుకోబెట్టి, యోగా మాయను ఎత్తుకుని తిరిగి వచ్చి దేవకీదేవి పక్కన వుంచాడు. యశోదాదేవికి ఇదేమీ తెలియదు.

చంటి బిడ్డ ఏడుపు విని ఆ విషయాన్ని కంసుడికి తెలియచేశారు కావలివారు. కంసుడు వచ్చి ఆబిడ్డను చంపబోయాడు. ఆడపిల్ల కాబట్టి చంపవద్దని వేడుకుంది దేవకీ. వినకుండా ఆ బాలికను ఎత్తి పట్టుకుని చంపబోయాడు కంసుడు. ఆ బాల కిందపడిపోకుండా, ఆకాశానికి ఎగిరింది. ఆమె దివ్యాయుధాలతో దర్శనం ఇచ్చింది. 'నిన్ను చంపే వీరుడు నాతోపాటుగా జన్మించి, ఒకచోట భద్రంగా పెరుగుతున్నాడు' అని పలికి అదృశ్యమైపోయింది. చింతాక్రాంతుడైన కంసుడు దేవకీవసుదేవులను తనను క్షమించమని వేడుకున్నాడు. వారి పాదాలు పట్టుకున్నాడు. దేవకీవసుదేవుల అనుమతి తీసుకుని కంసుడు ఇంటికి పోయాడు. కంసుడు యోగమాయ ద్వారా విన్న వృత్తాంతాన్ని కొందరు మంత్రులకు చెప్పాడు ఏకాంతంగా.

ఇదిలా వుండగా అక్కడ వ్రేపల్లెలో నందుడు తనకు మగ పిల్లవాడు పుట్టినందుకు సంబురాలు చేసుకున్నాడు. గోపకులంతా నందుడి కుమారుడిని చూడడానికి వెళ్లారు. వసంతోత్సవం జరుపుకున్నారు. గోపయువతులు ఆ శుభవార్తను ఒకరితో మరొకరు పంచుకున్నారు. వారంతా ఎంతో ఉత్సాహంతో ఆ పసివాడిని చూశారు. కానుకలిచ్చారు. పాటలు పాడారు. బాలుడు కేరింతలు కొడుతూ ఆడుకోసాగాడు.

నందుడు పన్ను కట్టడం కోసం మధురకు పోయి, వాసుదేవుడి ఇంటికి వెళ్లి తగిన మర్యాదతో ఆయన్ను దర్శించాడు. ఆయన దగ్గర వున్నది తన పుత్రుడే నని మెల్లగా చెప్పాడు. తన కొడుకు వాసుదేవుడి కొడుకే అనుకో అని ఓదారుస్తూ అన్నాడు నందుడు. ఆ తరువాత బయల్దేరి వెళ్లిపోయాడు నందుడు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం, రామకృష్ణ మఠం ప్రచురణ ఆధారంగా)**

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# పట్టెడ కోయ సంస్కృతి సాంప్రదాయాన్ని ప్రపంచాన్ని ముందుచే ప్రయత్నం..!!




మన దైనందిక జీవితంలో నిత్యం కళ్ళెదుటే జరుగుతున్న వాస్తవిక సంఘ టనలకు అద్దం పడుతూ, ప్రస్తుత ప్రజల జీవన విధానంలో సంభవించిన మార్పుల సమ్మేళితాలు, ఆధునిక పోకడలతో విజృంభిస్తున్న విపరీత ధోరణులకు పరిష్కారం చూపే అక్షర చైతన్య దీపిక ఈ "ప్రతినిధి" వ్యాస సంపుటి.

నేటి సమాజంలోని దురాగతాలను సమూలంగా కూకటివేళ్లతో పెకిలించి వేయాలన్న తపనతో .... మానవ సంబంధాల పట్ల తనకు ఉన్న నైతిక విలువల స్పష్టత, మానవతా దృక్పథం, అన్యాయాల్ని ప్రశ్నించే తన నైజంతో ప్రజల పాలిట తన గొంతును వినిపిస్తూ ప్రభుత్వానికి కర్తవ్యాన్ని తెలియజేస్తూ అసమానతలను రూపు మాపడానికి తన కలంతో ప్రజలకు సామాజిక జ్ఞానం అందించాలని సమాజ మార్పు కోసం ఈ సంపుటిని తీసుకు రావడం తనకున్న సామాజిక బాధ్యతకు నిలువెత్తు నిదర్శనం. ప్రతీ వాక్యం సరళమైన నిర్మాణంతో మనసులో భావోద్వేగాన్ని కలిగిస్తూ ఆలోచింప చేయడం రచయిత్రి " పోలగాని భానుతేజశ్రీ" గారి రచనా శైలిలోని ప్రత్యేకత.

సరైన మౌలిక వసతులు లేక రాత్రుళ్ళు వీధి దీపాల కింద చదువుకొని దేశం గర్వించదగిన వ్యక్తులుగా ఎదిగిన డా ఏపీజే అబ్దుల్ కలాం, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారు గుర్తుకురావడం మనకు పరిపాటి. ప్రస్తుత కాలంలో అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ క్లాసులు అందుబాటులోకి వచ్చాయి. దీని వల్ల చదువు చాలా సులభతరం కావడం మంచి పరిణామమే. కానీ తల్లి ఒడిలో పెరగాల్సిన పిల్లలు చరవాణి చేతిలో బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. విద్యార్థులు అవసరానికి మించి వాడితే పొంచి ఉన్న అనర్థాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి బాధ్యతగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో నైపుణ్యాన్ని మెరుగుపరిచి వారిని వారు కొత్తగా ఆవిష్కరించుకునే అవకాశాలను పుష్కలంగా ఉన్నాయంటూ" వీధి దీపాల నుండి డిజిటల్ క్లాసెస్" వరకు అంటూ చక్కని సందేశాత్మకంగా విద్యార్థులకు అందించారు. భర్తను కోల్పోయి ఒంటరిగా బ్రతికే మహిళలను,బ్రతుకుదెరువు కోసం పట్నం వచ్చిన అమాయకమైన యువతులకు పెద్దమొత్తంలో డబ్బు ఆశ చూపి ఇంటి పనుల కోసమని నమ్మించి, వినకపోతే బెదిరించి వారిని బలవంతంగా వ్యభిచారం లోకి దింపి వ్యాపారం చేస్తూ లక్షల కోట్లు సొమ్ము చేసు కుంటున్న ముఠాలకు చెక్ పెట్టేలా సాంకేతి కతను వాడుకుంటూ ఎలా అరికట్టాలో "ఉమెన్ ట్రాఫికింగ్" వ్యాసంలో చేసిన సూచనలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి.

ఆన్లైన్ వేదికగా రీల్స్ చూస్తూ వాటి ఊబిలో పడి వివిధ రకాల గేమ్స్ కి అలవాటు పడి చివరకు ప్రాణాలు బలి చేసుకునేంతగా తప్పుదోవ పడుతున్న పిల్లలకు కనీసం అవగాహన తెలిపే దిశగా కన్నవారి పాత్రను గుర్తుచేస్తూ" సోషల్ మీడియా ప్రభావంపై తల్లిదండ్రుల పాత్ర" వ్యాసంలో రచయిత్రిలో ఉన్న నైతిక బాధ్యత కనిపిస్తుంది ప్రజలకు అవసర మైన విద్యా, వైద్యంను మరిచి అవసరం లేనట్టి సంక్షేమ పథకాలను ఉచితంగా అమలుచేస్తూ నిత్యవసర వస్తువుల ధరలను అధికంగా పెంచి వారిపై పన్నుల భారం పెంచుతుంది ప్రభుత్వం.ఉచిత పథకాలపై ప్రజలకు జరుగుతున్న అన్యాయాల్ని ప్రశ్నిస్తూ "ఉచిత పథకాలు" అనే శీర్షిక తో రాసిన వ్యాసంలో తన మనోవేదనను తెలియజేశారు. ఇంతకుముందు రోజుల్లో ఏదైనా రంగంలో ప్రతిభను గుర్తించేందుకు వారిలోని నైపుణ్యత మరియు వారు సమాజ శ్రేయస్సు కోరి చేస్తున్న కృషి, ఆ రంగం పట్ల వారిలో ఉన్న బాధ్యత, వారి యొక్క నిబద్ధతతోపాటు,అపార అనుభవం ,భవిష్యత్ తరాలకు ఒక దిక్సూచి లాగా ఉంటూ వారు చేస్తున్న నిస్వార్థ సేవలను కొలమానాలుగా చూసి ప్రత్యేకంగా ఆహ్వానించి ప్రముఖుల సమక్షంలో వారి ప్రతిభాపాతావాలను పరిచయం చేస్తూ గొప్ప వేదికలపై ఆత్మీయంగా అవార్డులతో సత్కరించేవారు. కానీ ఇప్పుడు అవార్డులన్నీ వారం సంతలో దొరికే సరకుల్లా అగ్గువసగ్గువకే దొరికేస్తున్నాయి.డబ్బులిస్తే చాలు ప్రతిభతో సంబంధం లేకుండా కోరుకున్న విధంగా ఘనంగా సన్మానాలతో అవార్డులను పంచి పెడుతున్న సందర్భాలు కోకొల్లలని "అవార్డుల అమ్మకం" ద్వారా కనువిప్పు కలిగించారు రచయిత్రి భానుతేజశ్రీ గారు.

దినదినాభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ వల్ల ఇప్పుడంతా మొబైల్ నోట్, టెక్స్ట్ లోనే పఠనం జరుగుతుంది. పఠనానికే ఇప్పుడున్న పాఠక ప్రియులు కూడా ఎక్కువ మొగ్గు చూపడంతో %జూంట% మరియు %జు% పఠనం చాలా వరకు పుస్తక పఠనం పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. పుస్తకాన్ని చేతిలో పట్టుకొని ఏకాగ్రతగా చూపుడువేలుని నెమ్మదిగా కదుపుతూ ఒక్కో వాక్యాన్ని చదువుతూ ఉంటే కళ్ళముందే కదలాడే పాత్రల అనుభూతిని ఆస్వాదించలేక ఊహా శక్తిని మరిచి జ్ఞాపక శక్తిని కోల్పోతున్నారు. హడావిడి చదువులతో అరకొర మార్కులతో ఉత్తీర్ణత సాధించలేక మతిమరుపును కొనితెచ్చుకొనే %జు% పాఠ్యాంశాలను మాన్పించి పుస్తక పఠనం వైపు ఆసక్తి పెంచేలా ఉపాధ్యాయుల క్రియాశీల పాత్ర ను " కాగిత పఠనంబి %జు% పఠనం" వ్యాసంతో గుర్తుచేసింది.

అలాగే ఇంకా ఈ పుస్తకంలో కష్టపడి చదివిన చదువులకు సరైన ఉద్యోగాలు దొరక్క బాధపడుతున్న యువతను టార్గెట్ గా చేసుకొని "బ్యాక్ డోర్ జాబ్స్" పేరిట జరిగే పెద్ద పెద్ద మోసాలతోపాటుగా జరిగే అనర్థాలను ఆవిష్కృతం చేస్తుంది.' ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా వ్యవస్థ"ల మధ్య ఉన్న తారతమ్యాలను చెప్తూ ప్రభుత్వ పాఠశాలల ఉన్నతిని కోరుకుంటూ వాటి వైభవాన్ని పునరుద్ధరించే దిశగా అడుగులు వేయాలని కాంక్షించింది.

మొత్తం ఈ వ్యాస సంపుటిలో 25 వ్యాసాలు ఉంటాయి. ప్రతీ వ్యాసం కూడా సామాజిక నేపథ్య వస్తువే.సమాజంలోని లోటుపాట్లను తెలుపుతూ, లోతైన విశ్లేషణతో వాస్తవాలను చూపిస్తూ ప్రజాస్వామ్యాన్ని,ప్రభుత్వాన్ని ప్రజల తరుపున తానే "ప్రతినిధి"గా నిలబడి ప్రశ్నించడం తో పాటు పరిష్కారాలు చూపి సమాజ మార్పు కోసం యువకవయిత్రి భానుతేజశ్రీ చేసిన ప్రయత్నం ఈ సంపుటితో విజయవంతమైంది. ప్రతినిధి పుస్తకాల కోసం 9866597260 ను సంప్రదించవచ్చు.

**హరీష్.తాటి - 9553152939**

# కంద పద్యాల సుమధుర "సుకృతి" శతకం




నూరు పద్యాల రచన కలిగినది శతకం. ప్రస్తుతం 108 వరకు శతక పద్యాలను వివిధ కవులు రాస్తున్నారు. శతకంలో మకుట నియమం ఉంటుంది .పద్యాలు వేటికవే స్వతంత్రంగా ఉంటాయి. ముక్తాలుగా చెప్పవచ్చు. శతకాలు నీతి శతకాలు, భక్తి శతకాలు, వైరాగ్య శతకాలుగా ఉంటాయి . ఇవి విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందిప చేయడానికి, సత్ప్రవర్తనకు మార్గదర్శనం చేస్తాయి ."కంద పద్యాలు రాసిన వాడే కవి" అంటారు. కందపద్యంలో అనేక ఛందో నియమాలు ఉంటాయి. వాటన్నింటినీ అవపోసన పట్టి ఆ నియమాలకు అనుగుణంగా కంద పద్యం రాయడం అనేది కవులకు "కత్తి మీద సాము" లాంటిది. వర్ధమాన కవి నల్ల అశోక్ తెలుగు బాషా పండితుడుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హవేళీ ఘనపూర్, మెదక్ జిల్లా యందు విధులు నిర్వహిస్తున్నారు. కంద పద్యాలను అవలీలగా రచిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు అశోక్ గారు. తాను చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా చక్కటి దుష్టాంతాలతో "సుకృతి" అనే మకుటంతో 108 పద్యాలను రాశారు. ప్రతి ఒక్క పద్యంలో చక్కటి విలువలతో కూడి, నైతిక విలువలను తెలియ జెప్పే ప్రయత్నం చేశారు కవి గారు. తన తొలి రచనను ప్రచురిస్తున్న నల్ల అశోక్ గారు కందపద్యంలో గణనాథాన్ని ప్రార్థిస్తూ శతకాన్ని మొదలుపెట్టాడు . పద్య సంపదను తనకు నిరంతరంగా ఇవ్వమని వేడుకున్నాడు.

**కం: గణనాథా నీకెప్పుడు ప్రణమిల్లుడు**
**విఘ్నరాజ పార్వతి తనయ గణనీయ పద్య సంపద**
**గుణముగ నిరతమ్మొసగుము గొప్పగ సుకృతి**

తన వాదన తప్పని తెలిసిన కూడా నరుడు ఏ మాత్రం తగ్గకుండా వినని వెఱ్ఱి గాథ వినిపిస్తాడని 09వ పద్యంలో కవి వివరించాడు.

**కం: తన వాదన సరికాదని**
**తనకెప్పుడు తెలిసియున్న తగ్గక తానున్**
**తన గెలుపే కోరి నరుడు**
**వినిపించును వినని గాథ వెఱ్ఱిగా సుకృతి**

కలియుగంలో విలువలు వెల వెల బోయాయని తన ఆవేశాన్ని 17వ పద్యంలో తెలియచెప్పాడు.

**కం: విలువలు**
**వెలవెలబోయెను**
**కలియుగమున మోసమంత**
**కల్లలునంతన్**
**బలియగుటే ప్రతి భూమిని**
**నలినాక్షుడు బ్రోవకున్న**
**నరకము సుకృతీ**

చెప్పుడు మాటలు చేటును కలిగిస్తాయని 30వ పద్యంలో కవి ఆక్రోశించాడు .

**కం: అప్పటికప్పుడు పుట్టిన**
**చెప్పుడు మాటలు వినినను**
**చేటేమనకున్**
**గొప్పల కొరకే మనుజులు చెప్పుట**
**మానరు ధరణిని చిరముగా సుకృతీ**

తన కో పమే తన తనువును బలహీనము చేస్తుందంటాడు 87వ పద్యములో

**కం: తన కోపమే తనదగు తను**
**వును బలహీనముగ చేయు పూర్తిగ నెపుడున్**
**తన సహనమే ధన సంపద**
**తన యోర్పే కీర్తి పెంచు దండిగా సుకృతీ** ఇః 106 వ పద్యంలో పుస్తక ప్రాధాన్యతను చక్కటి కందంలో చిక్కగా కవి నల్ల అశోక్ గారు వివరించారు.

**కం: పుస్తకమిచ్చు జ్ఞానము**
**పుస్తకము మనుజుల పుణ్యపురుషుల జేయున్**
**పుస్తకము జీవితమిడును**
**పుస్తకము పథమును జూపు పుడమికి సుకృతీ**

ఈ పుస్తకములోని ప్రతి పద్యం ఒక చక్కటి సందేశాన్ని, లోకం పోకడను తెలియజెప్పే ప్రయత్నం చేశారు నల్ల అశోక్ గారు. తొలి ప్రయత్నం లోనే కవిగా విజయం సాధించాడు అనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. ఈ సుకృతి శతకంలోని ప్రతి పద్యం విద్యార్థులు కంఠస్థం చేసే విధంగా సరళమైనటువంటి పదాలతో వివరించాడుకవి గారు. తను రాసిన కంద పద్యాలకు సుకృతి అనే మకుటాన్ని పెట్టడం వెనక నిగూడార్థం ఉంది. ఈ పుస్తక ముఖచిత్రం అందంగా ఉంది . మొత్తం పేజీల సంఖ్య 44. పుస్తకం ధర 50 రూపాయలు. ఇలాంటి చక్కటి శతక పద్యాలు మరెన్నో యువకవి కలం నుండి జాలు వారాలని కోరుకుంటూ ,వర్ధమాన కవి నల్ల అశోక్ గారిని అభినందిస్తూ, ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం

**పుస్తక ప్రతులకు:** నల్ల అశోక్, :8008385335

**పుస్తక సమీక్షకులు: యాడవరం చంద్రకాంత్ గౌడ్, 9441762105**

# పిల్లలే కదా టీచర్లకు తరగని ఆస్తులు



చీకటి మృదువుగా అల్లుకునే
భాద్రపద మాస
దివసావసాన సమయాన,
పోల్చుకోలేని గొంతొకటి
ఫోన్లో వినిపిస్తుంది.
పరిచయం కాస్తా
అయ్యాక,
ఆ అమ్మాయి చిన్నప్పటి
రూపమేదో మదిలో
తళుక్కున మెరుస్తుంది.
ఇరవై ఏళ్ల తర్వాత
పిల్లలెంతగా మారిపోతారు.
అయినా వాళ్ల చిన్ని ముఖాలే
కళ్ళ ముందు తారాడుతాయి.
పిల్లలప్పుడు గాలికి
కదిలే పూలతావి లాంటివాళ్ళు.
వాళ్ల తత్తర మాటలింకా
చెవుల్లో వినిపిస్తూనే ఉంటాయి.
మేము ప్రైమరీ టీచర్లం కదా!
మాకు గతాలకూ, ప్రస్తుతాలకూ
పెద్దతేడా ఏమీ తెలియదు.
కళ్ళెదురుగా చెట్టంత ఆకారం
కనిపిస్తున్నా,
కళ్ళనిండా వెనుకటి రూపాల్నే
నింపుకుంటాం.
నిజానికి వాళ్ళలో కొందరే మమ్మల్ని
లీలగా గుర్తుంచుకుంటారు.
జ్ఞాపకాల న్యూరాన్లింకా ఏపుగా
ఎదగని బాల్యం కదా అది.
కానీ, ఒక్కో గుర్తూ నెమరేసుకున్నాక,
వాళ్లకు మేమో
ప్రాకృతిక శక్తిలా అనిపిస్తాం.
పెద్దైనా
వాళ్ళ ముఖాల్లో ఆశ్చర్యం, మాటల్లో చొరవ,
ఇంకా కనిపిస్తూనే ఉంటుంది.
పిల్లలే కదా టీచర్లకు తరగని ఆస్తులు.

**-లేదాళ్ళ రాజేశ్వరరావు,**
**9441873602,**

# పుస్తకాల తోటలో (54)

**డా: అమ్మిన @ 77298 83223**




ప్రజాస్వామ్య పాలనలకు వెన్నెముక ఎన్నికలు, వీటి పట్ల దేశ పౌరులందరికీ సంపూర్ణ అవగాహన అవసరం, అందుకే భావి పౌరులైన పిల్లల్లో కూడా వాటి పట్ల అవగాహన కలిగించాలనే సత్ సంకల్పంతో అశ్వరావుపేట భానుదయ సాహితీ సంస్థ నిర్వాహకులు రచయిత సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు గారు బాలసాహిత్యానికి చేయూతగా "మరక మంచిదే" అనే బాలల కవితా సంకలనం ప్రచురించారు.

ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు వ్రాసిన ఎంపిక చేసిన కవితలకు ఇందులో స్థానం కలిగించారు, ఆది అంత్య ప్రాసలతో సాగిన కవితలన్నీ వేటికవే వైవిధ్యంగా ఉన్నాయి, ఒకే కవితా వస్తువుతో రాసిన కవితలన్నీ భిన్న శైలుల్లో సాగాయి, "సోదరా మేలుకో" అంటూ మొదలైన ఈ కవన ప్రయాణం "బాధ్యతను నెరవేర్చు" అనే చక్కని కర్తవ్యాన్ని గుర్తు చేస్తూ ముగుస్తుంది, దీనిలో మొత్తం 38 మంది విద్యార్థులు తమ అక్షర భావాలను పంచుకున్నారు, వీరిలో ప్రజాస్వామ్యం పట్ల ఎన్నికల పట్ల ఆందోళన, ధర్మాగ్రహం, కనిపిస్తూ మార్పు కోసం ఏదో చేయాలనే తపన స్పష్టంగా కనిపిస్తుంది,

"ఎక్కుపెట్టిన రామబాణం" అని కవితలో పి.నిత్య సాయి శ్రీ ఓటును రామబాణంతో పోల్చి దాని విలువ మరింతగా పెంచుతూ.." 18 వయసు దాటితే దక్కే హక్కే ఓటు/ నవ సమాజ నిర్మాణానికి /సరైన సారధిని ఎంచుకునేహక్కే ఓటు/... ఓటు అంటే తిరుగులేని వజ్రాయుధం /శివ ధనస్సుకు ఎక్కుపెట్టిన రామబాణం/... అంటూ నైతికతో ఓట్లు వేసి విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించుకుందాం అనే ఉత్తమ సందేశాన్ని అందించింది ఈ చిన్నారి,

జి. శైలజ అనే విద్యార్థిని తన చదువుల భాష అయిన ఆంగ్ల పదాలతో ఉత్తేజవంతమైన అక్షరావిష్కరణ చేస్తూ.. నేటి స్వార్థ పూరిత రాజకీయాలు, అసమర్థ నాయకుల గురించి ఎలాంటి రియాక్షన్ చూపిందో తెలియాలి అంటే తను రాసిన "మంచిదైతే మన సెలక్షన్" అనే కవిత విధిగా చదివి తీరాల్సిందే.

ఇక ఓట్లు వేయడంలో బద్ధకం చేసే వారికి స్ట్రాంగ్ వార్నింగ్ లాంటి కవిత సాత్విక్ రాసిన "మరక మంచిదే" దీనిలో అక్షర సత్యం నిండి ఉంది ఓట్ల పండగనాడు సెలవే కదా? అని నిర్లక్ష్యంగా నిద్రపోవడం కాదు నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుంది? అందరూ వేస్తున్నారు కదా? అనే నిర్లక్ష్యపు బద్ధకం అసలు వద్దు అని హెచ్చరిస్తూ...

" రాష్ట్ర ప్రగతిని కాంక్షించే/ నాయకుని పై మీటను నొక్కి/ నీ వేలుపై మరకలు గర్వంగా చూపించు/ ప్రజాస్వామ్య రక్షణ కోసం /వేలిపై పడ్డ మరక మంచిదే..!!/

అంటూ ఆశావాద దృక్పథం వ్యక్తరిచాడు ఈ భావిక విరత్నం.

ఈ చిన్నారులు తమ కవితాక్షర భావాల ద్వారా కేవలం ఓటర్లను మాత్రమే చైతన్య పరచడం కాదు అటు నాయకులకు అభ్యర్థన హెచ్చరికలు జారీ చేశారు, ఈ కోవకు చెందిందే వి.గగన్ వ్రాసిన "నాయకులారా ఆలోచించండి" కవిత, ఇలా ప్రతి కవిత ఓ మంచి ముత్యంగా ఆలోచింపజేసేదిగా ఉండటం అభినందనీయం ఆచరణీయం,

ఈ చిన్న వయసులోనే ఇంతటి భావనశక్తి ప్రతిస్పందన గుణం అలవడింది అంటే భవిష్యత్తులో ఇంకెన్ని ఉత్తమ భావాలను వ్యక్తపరచగలరో!! అనిపిస్తుంది,

కావున సాహితీ రంగంలో బంగారు భవిత గల భావికవి రత్నాలు వ్రాసిన ఈ కవితలు చదవటం ద్వారా ఒకే వస్తువు గురించి భిన్నమైన భావాలు ఎలా వ్యక్తీకరించాలో అర్థం కావడమే కాక, ఈ తీరు కవితలు రాయాలనే వారికి మార్గదర్శనం చేసే ఈ చక్కని కవితలను ఆబాల గోపాలం చదవడం అత్యవసరం, మేలైన ఈ కవితా సంకలనం రూపొందించిన సంపాదకులు సిద్ధాంతపు ప్రభాకర చార్యులు గారి కృషికి, వివిధ విద్యాలయాల విద్యార్థులు స్పందించిన తీరుకు అభినందనలు.

మరకా మంచిదే (బాలల కవితా సంకలనం) పేజీలు: 42, ధర: 100/- రూ, ప్రతులకుబీ సంపాదకులు సెల్: 9491357842.

## ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్.. సెప్టెంబర్ నుంచి కొత్త రూల్స్..




ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్, సిల్వర్ హాల్ మార్కింగ్ నుంచి ఎస్బీఐ క్రెడిట్ కార్డ్ వరకు.. సెప్టెంబర్ నుంచి కొత్త రూల్స్.. ఆగస్ట్ నెల అయిపోయింది. సెప్టెంబర్ నెల వచ్చేస్తోంది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పలు అంశాల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమల్లోకి వస్తాయి. సెప్టెంబర్ నెలలో అనేక మార్పులు వస్తాయి. ఆర్థికపరమైన కొత్త నియమాలు అమల్లోకి వస్తాయి. కొత్త రూల్స్ లో కొన్ని మొదటి రోజు నుంచే అమలవుతాయి. ఇవి చాలా మంది జీవితాలను ప్రభావితం చేస్తాయి.ఆదాయపు పన్ను దాఖలు గడువు మొదలు ఆభరణాల హాల్ మార్కింగ్ వరకు సెప్టెంబర్ నెలలో అనేక ముఖ్యమైన మార్పులు అమలవుతాయి. ఇందులో కొన్ని డబ్బుతో ముడిపడి ఉన్న రూల్స్ ఉన్నాయి. ఇవి దేశంలో పెద్ద సంఖ్యలో ప్రజల జీవితాలపై ప్రభావం చూపనున్నాయి. కొత్త రూల్స్ ఏంటి, అవి ఏ విధంగా ఎఫెక్ట్ చూపుతాయో తెలుసుకుందాం.

**ఇన్ కమ్ ట్యాక్స్ రిటర్న్ గడువు..**


రిటర్న్స్ ఫైల్ చేయడానికి నాన్ ఆడిట్ ట్యాక్స్ పేయర్లకు ఇన్ కమ్ ట్యాక్స్ శాఖ మరింత సమయం ఇచ్చింది. ఇప్పటివరకు రిటర్న్స్ దాఖలు చేయడానికి జూలై 31వ వరకు సమయం ఉండేది. దాన్ని సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించారు. అకౌంట్లు ఆడిట్ చేయాల్సి ఉన్న వారికి ఆ గడువు అక్టోబర్ 31వ తేదీగా ఉంటుంది.

**యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కి మారేందుకు లాస్ట్ ఛాన్స్..**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ కింద ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ఎంపిక చేసుకోవడానికి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గడువు ఇచ్చారు. ముగిసింది.

## రైల్వే ప్రయాణికులు బంపర్ ఆఫర్..

### టిక్కెట్ రిజర్వేషన్‌పై 20% డిస్కౌంట్..!



పండుగ సీజన్‌లో ప్రయాణీకుల కోసం భారతీయ రైల్వే ప్రత్యేక ఆఫర్‌ను తీసుకొచ్చింది. మీరు రావడానికి, వెళ్ళడానికి రెండు టిక్కెట్లను బుక్ చేసుకుంటే, మీకు 20% వరకు ప్రత్యక్ష తగ్గింపు లభిస్తుంది. రైల్వే కొత్త యాప్ రైల్‌వన్ లేదా ఆఫ్‌లైన్ కౌంటర్ల ద్వారా బుకింగ్ చేసుకుంటే ఈ తగ్గింపు వర్తిస్తుంది. నిర్ణీత తేదీలలో ప్రయాణించే వారికి ఈ అవకాశం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

రైల్వే ప్రయాణికులు బంపర్ ఆఫర్.. టిక్కెట్ రిజర్వేషన్‌పై 20% డిస్కౌంట్..! ఈ పండుగ సీజన్‌లో మీరు బయటకు వెళ్లాలని, సొంతూరుకు వెళ్లాలని ప్లాన్ చేసుకుంటున్నారా? రైల్వే నుండి ఒక గొప్ప శుభవార్త వచ్చింది. భారతీయ రైల్వే తన ప్రయాణీకుల కోసం ఒక ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో మీరు రెండు టిక్కెట్లను కలిపి బుక్ చేసుకుంటే, మీకు 20 శాతం ప్రత్యక్ష తగ్గింపు లభిస్తుంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, రైల్వేలు %=ఖఅశ్రీూఅవ% అనే కొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. మీరు కోరుకుంటే, మీరు రైల్వే స్టేషన్‌కు వెళ్లి కౌంటర్ నుండి ఈ టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు.

ఈ పథకానికి రైల్వేలు నిర్దిష్ట తేదీలను నిర్ణయించాయి. మీరు అయా తేదీలలో ప్రయాణించినట్లయితే మాత్రమే మీకు డిస్కౌంట్లు లభిస్తాయి. మీ బయటికి ప్రయాణం అక్టోబర్ 13 నుండి అక్టోబర్ 26, 2025 మధ్య ఉండాలి. అయితే, తిరుగు ప్రయాణం నవంబర్ 17 నుండి డిసెంబర్ 1, 2025 మధ్య ఉండాలి. గుర్తుంచుకోండి, మీరు రెండు వైపులా కలిసి అప్ అండ్ డౌన్ టిక్కెట్లు బుక్ చేసుకుంటేనే ఈ డిస్కౌంట్ లభిస్తుంది. అంటే, మీరు వేర్వేరు రోజులలో తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు బుక్ చేసుకోలేరు. అలాగే, స్టేషన్, రైలు తరగతి, ప్రయాణీకుల సంఖ్య కూడా ఒకేలా ఉండాలి.

**రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసుకోవడం ఎలా:**

రైల్వేస్ ప్రయాణీకుల సౌలభ్యం కోసం కొత్త మొబైల్ యాప్‌ను ప్రారంభించింది.రైల్‌వన్ యాప్ ఆండ్రాయిడ్, ఐఫోన్ రెండింటిలోనూ అందుబాటులో ఉంది.టిక్కెట్లు బుక్ చేసుకోవడం చాలా సులభం.ముందుగా మీ మొబైల్‌లో రైల్‌వన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.యాప్‌ను తెరిచిన తర్వాత, మీరు ఎం పిన్ లేదా వేలిముద్రతో లాగిన్ అవ్వవచ్చు.యాప్ హోమ్‌పేజీలో 'అవైల్ ఫెస్టివ్ ప్యాకేజీ' అనే ఆప్షన్ మీకు కనిపిస్తుంది.బుకింగ్ ప్రక్రియ ఇక్కడి నుండి ప్రారంభమవుతుంది.

ఇప్పుడు ముందుగా, మీ ప్రయాణ వివరాలను నమోదు చేయండి. ఎక్కడి నుండి ఎక్కడికి, ఏ తేదీ (అక్టోబర్ 13 నుండి 26 మధ్య) వంటివి ఎంట్రీ చేయాలి. టికెట్ బుక్ చేసుకున్న తర్వాత, మీకు పిఎన్ ఆర్ నంబర్ లభిస్తుంది. తర్వాత, మీకు యాప్‌లో మరొక ఎంపిక లభిస్తుంది, బుక్ రిటర్న్ టికెట్ (20% డిస్కౌంట్). ఇక్కడ క్లిక్ చేసిన తర్వాత, యాప్ ఆటోమేటిక్‌గా మీ స్టేషన్, తరగతి, ప్రయాణీకుల వివరాలను పూరిస్తుంది. ఇప్పుడు మీరు తిరిగి వచ్చే తేదీని (నవంబర్ 17 నుండి డిసెంబర్ 1 మధ్య) ఎంచుకోవాలి. మీరు చెల్లింపు చేసిన వెంటనే, మీకు టికెట్‌పై నేరుగా 20% తగ్గింపు లభిస్తుంది.


**టికెట్ కౌంటర్ నుండి డిస్కౌంట్**

మీరు మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకోకూడదనుకుంటే, పర్వాలేదు. మీరు రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ నుండి కూడా ఈ పథకాన్ని పొందవచ్చు. ఒకే షరతు ఏమిటంటే మీరు రెండు ట్రిప్పులకు ఒకేసారి టిక్కెట్లు బుక్ చేసుకోవాలి. తేదీలు పథకంలో పేర్కొన్న విధంగానే ఉండాలి.

**దీన్ని గుర్తుంచుకోండి**


ఈ పథకం అందరికీ వర్తిస్తుంది, కానీ కొన్ని షరతులతో. మీ ప్రయాణాలు, వెళ్ళడం, రావడం రెండూ నిర్ణీత తేదీలలోపు ఉంటేనే ఈ తగ్గింపు లభిస్తుంది. టికెట్ బుకింగ్ ఒకేసారి చేయాలి. మీరు రెండు వేర్వేరు సమయాల్లో టికెట్ బుక్ చేసుకుంటే, మీకు తగ్గింపు లభించదు. అలాగే, స్టేషన్, తరగతి, రెండు ప్రయాణాలలోని ప్రయాణీకుల సంఖ్య ఒకేలా ఉండాలి. రైల్ వన్ యాప్‌తో, మీరు టిక్కెట్లు పొందడమే కాకుండా, రైలు లోకేషన్ స్టేటస్, ఆహారాన్ని ఆర్డర్ చేయడం, టాక్సీ బుకింగ్ వంటి సౌకర్యాలను కూడా పొందవచ్చు.

## ఒక్కరోజే రూ. 1600 పెరిగిన గోల్డ్ ధర



బంగారం ధరలు పసిడి ప్రియులను గజగజ వణికిస్తున్నాయి. వరుసగా ెప ంెర గ ె త ెా ఆకాశాన్నంటుతున్నాయి. నేడు మరోసారి భారీగా పెరిగి షాకిచ్చాయి. ఒక్కరోజులోనే తులం గోల్డ్ ధర రూ. 1640 పెరిగింది. వెండి కూడా బంగారం బాటలోనే పయనించింది. నేడు కిలో సిల్వర్ ధర రూ. 1100 పెరిగింది. హైదరాబాద్ లో ఈరోజు 24 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.10,495, 22 క్యారెట్ల బంగారం ధర (1 గ్రాము) రూ.9,620 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1500 పెరిగింది. దీంతో రూ.96,200 వద్ద అమ్ముడవుతోంది.24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1640 పెరిగింది. దీంతో రూ. 1,04,950 వద్ద ట్రేడ్ అవుతోంది. విజయవాడ, విశాఖ పట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 96,350 వద్దకు చేరింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,05,100 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో ఈ రోజు కిలో వెండి ధర రూ. 1,31,000 వద్ద అమ్ముడవుతోంది. ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ. 1,21,000 వద్ద ట్రేడ్ అవుతోంది.

## గ్రేహ్ లక్ష్మి మిసెస్ ఇండియా గా మీను సింగ్



హైదరాబాద్‌కు చెందిన ఇంజనీర్, సామాజిక కార్యకర్త మరియు మోడల్ మీను సింగ్ న్యూఢిల్లీలోని మయూర్ విహార్‌లోని క్రౌన్ ప్లాజాలో జరిగిన ఒక అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమంలో గ్రేహ్ లక్ష్మి మిసెస్ ఇండియా 2025 కిరీటాన్ని పొందారు. ఈ ప్రతిష్టాత్మక పోటీని భారతదేశంలోని ప్రముఖ మహిళా పత్రిక గ్రేహ్ లక్ష్మి నిర్వహించింది, ఇది 35 సంవత్సరాల స్త్రీత్వాన్ని జరుపుకునే వారసత్వాన్ని కలిగి ఉంది.కిరీటంతో పాటు, మీను రెండు ప్రత్యేక బిరుదులను కూడా గెలుచుకుంది – లా పింక్ నేచురల్ స్కిన్‌కేర్ సమర్పించిన "రేడియంట్ స్కిన్" మరియు "బెస్ట్ డ్రెస్డ్". మీను సింగ్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "ఈ కిరీటాన్ని ధరించడం నాకు చాలా గౌరవంగా మరియు కృతజ్ఞతగా అనిపిస్తుంది. నాకు, ఇది కేవలం వ్యక్తిగత విజయం కాదు, స్ఫూర్తినిచ్చే మరియు సాధికారత కల్పించే బాధ్యత. అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించడానికి మరియు మహిళా సాధికారతకు దోహదపడటానికి నేను ఈ వేదికను ఉపయోగించాలనుకుంటున్నాను" అన్నారు. ఈ విజయం మీను సింగ్ సాధించిన అనేక సాధనల్లో ఒకటి మాత్రమే. ఒక ఇంజనీర్‌గా తన వృత్తిపరమైన నైపుణ్యాలను ప్రతిబింబించడంతో పాటు, సామాజిక కార్యకర్తగా ఆమె అనేక సామాజిక సమస్యలపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తోంది.

## సెప్టెంబర్‌లో సగం రోజులు సెలవులే..

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. అసౌకర్యం కలగకుండా ఉండేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రతి నెల ప్రారంభానికి రెండు, మూడు రోజుల ముందే సెలవుల జాబితాను విడుదల చేస్తుంది. తాజా సెప్టెంబర్ నెలకు సంబంధించిన సెలవుల జాబితాను ఆర్బీఐ రిలీజ్ చేసింది.

ఈ నెలలో పండుగలు, వారాంతాలతో కలుపుకుని దాదాపు నెలలో సగం రోజుల పాటు బ్యాంకులకు సెలవులు వచ్చాయి. అయితే, ఆర్బీఐ విడుదల చేసిన బ్యాంక్ సెలవులు అన్ని రాష్ట్రాలకు వర్తించదు. ఆ రాష్ట్రాలకు సంబంధించిన ప్రాంతీయ వేడుకలు, పండుగల ప్రకారం సెలవులు ఉంటాయి. అయితే దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులకు పబ్లిక్ హాలీడేస్ మాత్రం కామన్‌గా ఉంటాయి.

వారాంతపు సెలవులు..

సెప్టెంబర్ 7: ఆదివారం
సెప్టెంబర్ 14: ఆదివారం
సెప్టెంబర్ 21: ఆదివారం
సెప్టెంబర్ 27: నాలుగో శనివారం
సెప్టెంబర్ 28: ఆదివారం

పండుగ సెలవులు చూసినట్లయితే..




సెప్టెంబర్ 3 (బుధవారం) : కర్మ పూజ (జారండ్, ఒడిశా, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల్లో సెలవు ఉంటుంది)

సెప్టెంబర్ 4 (గురువారం) : ఓనం పండుగ (కేరళ రాష్ట్రంలో..)

సెప్టెంబర్ 5 (శుక్రవారం) : మిలాద్ ఉన్ నబీ (కొన్ని నగరాల్లో సెలవు ఉంటుంది. అహ్మదాబాద్, ఐజ్వాల్, బేలాపూర్, ➻చెన్నై, బెంగళూరు, రాంచీ, న్యూఢిల్లీ, శ్రీనగర్, సిక్కిం, జమ్ము నగరాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది)

సెప్టెంబర్ 6 (శనివారం) : ఇంద్రజాత్ర పండుగ (సిక్కిం, జమ్ము, శ్రీనగర్ లో బ్యాంకులకు సెలవు ఉంటుంది)

సెప్టెంబర్ 22: మహారాజ్ హరిసింగ్ జన్మదినం సందర్భంగా జమ్ముకశ్మీర్ లో బ్యాంకులకు సెలవు ఉంటుంది.

సెప్టెంబర్ 29,30: మహాసప్తమి, అష్టమి సందర్భంగా వెస్ట్ బెంగాల్, అస్సాం, ఒడిశా, త్రిపుర రాష్ట్రాల్లో బ్యాంకులకు సెలవు ఉంటుంది.

బ్యాంకులు మూసివేతకు గురైనప్పటికీ%ౌ %పండుగల సందర్భంగా బ్యాంకులు మూసివేతకు గురైనప్పటికీ.. డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయి. యూపీఐ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, మొబైల్ యాప్‌లు, ఏటీఎంలు ఈ సెలవు దినాల్లో కూడా పని చేస్తాయి. కాబట్టి ఆర్థిక లావాదేవీలు చేయాలనుకునే వారు ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

సెప్టెంబర్ నెలలో బ్యాంకు సెలవులు రాష్ట్రాలను బట్టి మారుతాయి. మొత్తంగా సెప్టెంబర్ లో తొమ్మిది పండుగ సెలవులు, ఐదు వారాంత సెలవులు ఉంటాయి. ఈ సమాచారం ఆధారంగా..

బ్యాంకు సంబంధిత పనులను ముందుగానే ప్లాన్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నందున, అత్యవసర ఆర్థిక అవసరాలకు పెద్దగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండదు.

## ఇకపై ఏటీఎంలో 100, 200 నోట్లు తప్పనిసరి

### సామాన్యుల వెతలు తీర్చేందుకు ఆర్బీఐ కీలక నిర్ణయం



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాన్యులకు శుభవార్త చెప్పింది. ఇకపై పెద్ద నోట్లతో పాటు చిన్న నోట్లు కూడా అందుబాటులో ఉంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఆదేశాలు త్వరలో అమలులో తీసుకురావాలని బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

మనం తరచూ ఎదుర్కొనే సమస్యల్లో ఒకటి ఏటీఎంలో పెద్ద నోట్లు మాత్రమే రావడం. ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసినప్పుడు ఎక్కువగా రూ.500, రూ.2,000 నోట్లు మాత్రమే వస్తాయి. దీనివల్ల అవసరాల కోసం చిన్న నోట్లు దొరకడం కష్టంగా మారుతుంది. బస్సులో ప్రయాణం చేయాలన్నా, ఆటోలో వెళ్లాలన్నా, షాపుల్లో కొనుగోలు చేయాలన్నా చిల్లర కోసం చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. చిల్లర లేదని చాలామంది దుకాణదారులు యూపీఐ ద్వారా చెల్లించమంటున్నారు. కానీ ప్రతిసారీ యూపీఐ సరిగ్గా పనిచేయదు. నెట్‌వర్క్ సమస్యలు, సాంకేతిక లోపాలు రావడంతో ఆ సమయంలో చేతిలో చిల్లర లేక ప్రజలు ఇబ్బందుల్లో పడాల్సి వస్తుంది.

ఈ సమస్యను ఆర్బీఐ గుర్తించింది. అందుకే ఆర్బీఐ సరికొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఇకపై దేశంలోని అన్ని బ్యాంకులు తమ ఏటీఎంలలో తప్పనిసరిగా రూ.100, రూ.200 నోట్లను అందుబాటులో ఉంచాలని ఆర్బీఐ ఆదేశించింది. అంటే, ఇకపై ఏటీఎంలో చిన్న నోట్ల కొరత ఉండకూడదని ఖచ్చితంగా చెప్పడం విశేషం. ఇది కేవలం ఆదేశం మాత్రమే కాదు.. అమలు చేయడానికి టైమ్ లిమిట్ కూడా పెట్టింది. సెప్టెంబర్ 30, 2025 నాటికి దేశంలోని కనీసం 75 శాతం ఏటీఎంలలో ఒక క్యాసెట్ మాత్రం తప్పనిసరిగా రూ100, రూ200 నోట్ల కోసమే ఉండాలని తెలిపింది. ఆ తర్వాత మార్చి 31, 2026 నాటికి 90 శాతం ఏటీఎంలలో చిన్న నోట్లు అందుబాటులో ఉండాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఆదేశం ప్రభుత్వ బ్యాంకులకు మాత్రమే కాదు ప్రైవేట్ బ్యాంకులు, అలాగే వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లకు కూడా వర్తిస్తుందని ప్రకటించింది.

**వైట్ లేబుల్ ఏటీఎంలు అంటే**

వైట్ లేబుల్ ఏటీఎంలు అంటే బ్యాంక్ పేరు లేకుండా, ప్రైవేట్ సంస్థలు నడిపే ఏటీఎంలు. అంటే దేశవ్యాప్తంగా ఎక్కడ ఏటీఎం ఉందో అక్కడ ఈ నిబంధన తప్పనిసరిగా అమల్లోకి రావలసి ఉంటుంది. చాలామందికి ఏటీఎంలలో చిన్న నోట్లు ఎందుకు దొరకడం లేదనే ప్రశ్న వస్తుంది. వాస్తవానికి ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు నింపడానికి అవసరమైన ప్రత్యేక బాక్స్‌లు ముందే ఉన్నాయి. కానీ కొన్నిసార్లు బ్యాంకుల నిర్లక్ష్యం, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల చిన్న నోట్లు రావడం లేదు. ఆర్బీఐ ఈ సమస్యని గుర్తించి బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రజలకు రెండు రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఒకటి చిల్లర కోసం తిప్పలు పడాల్సిన అవసరం తగ్గిపోతుంది. రెండోది నగదు లావాదేవీలు సులభతరం అవుతాయి.

**అవసరాలకు చిన్న నోట్ల కొరత**

మరోవైపు బస్సు కండక్టర్‌కు టికెట్ డబ్బు ఇవ్వాలన్నా, టీ షాపులో టీ తాగాలన్నా, చిన్న చిన్న అవసరాల కోసం డబ్బులు చెల్లించాలన్నా ఏటీఎంలో లభించే రూ.100, రూ.200 నోట్లు చాలా సౌకర్యంగా మారతాయి. ఆర్బీఐ తీసుకున్న ఈ నిర్ణయం సామాన్యులకు పెద్ద ఉపశమనమనే చెప్పాలి. ఇదే సమయంలో బ్యాంకులపై కూడా బాధ్యత పెరుగుతుంది. ఇకపై చిన్న నోట్లు ఆర్బీఐలలో లేకపోతే, అది ప్రజల నిర్లక్ష్యం కాదు, బ్యాంకుల నిర్లక్ష్యమే అవుతుంది. అందుకే ఈ నిర్ణయం వల్ల ఏటీఎంల నిర్వహణలో క్రమశిక్షణ పెరిగి ప్రజలకు ఉపయోగం చేకూరే అవకాశం ఉందని చెప్పవచ్చు. ఆర్బీఐ నిర్ణయం నిజంగానే సామాన్యుడి జీవితానికి ఊరట ఇస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## మీ పిల్లల భవిష్యత్తు కోసం అద్భుతమైన స్కీమ్

### వారు ఇంటర్‌లో చేరేసరికి చేతికి రూ.15 లక్షలు

మీ బిడ్డ పుట్టిన వెంటనే మీరు పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే వారు కళాశాలకు వెళ్లే సమయానికి సరిగ్గా 15 సంవత్సరాలలో మీ చేతుల్లో డబ్బు ఉంటుంది. మీరు వారి కళాశాల ఫీజులను చెల్లించడానికి దీన్ని ఉపయోగించవచ్చు. అలాగే ఈ పథకం స్థిరమైన వడ్డీ రేటును అందిస్తుంది. పెట్టుబడి..

మీ పిల్లల భవిష్యత్తు కోసం అద్భుతమైన స్కీమ్

వారు ఇంటర్‌లో చేరేసరికి చేతికి రూ.15 లక్షలు

భారతదేశంలో పోస్ట్ ఆఫీస్ పొదుపు పథకాలు సురక్షితమైన పొదుపు పథకాలు. ప్రతి నెలా కొంత మొత్తాన్ని ఆదా చేయడం ద్వారా ఇది దీర్ఘకాలిక భద్రతను అందిస్తుంది. మంచి పోస్ట్ ఆఫీస్ పథకంలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు మీ పిల్లల భవిష్యత్తు కోసం రూ. 15 లక్షల నిధిని సృష్టించవచ్చు. ఈ మొత్తం భవిష్యత్తులో వారి విద్యా ఖర్చులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది సురక్షితమైనది మాత్రమే కాదు. ఇది పన్ను రహితమైనది కూడా. పెట్టుబడి పెట్టే మొత్తానికి వార్షిక వడ్డీ కూడా లభిస్తుంది.

ప్రావిడెంట్ ఫండ్:

దీర్ఘకాలిక పెట్టుబడికి ప్రావిడెంట్ ఫండ్ పథకం నమ్మదగిన ఎంపిక. ఇది సురక్షితమైనది మాత్రమే కాదు. మంచి రాబడిని కూడా ఇస్తుంది. ఈ పథకంలో మీరు సంవత్సరానికి కనీసం రూ. 500 నుండి గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టవచ్చు. మీరు ఈ పథకంలో మొత్తం 15 సంవత్సరాలు పెట్టుబడి పెట్టవచ్చు. మీరు ఈ పథకంలో 15 సంవత్సరాలు పెట్టుబడి పెడితే చివరికి మీకు పెద్ద మొత్తం లభిస్తుంది. పిల్లల ఉన్నత విద్య వంటి అవసరాలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకం సంవత్సరానికి 7.1 శాతం వడ్డీని అందిస్తోంది. ఈ పథకం అదనపు ప్రత్యేక లక్షణం ఏమిటంటే ఇది పన్ను రహితమైనది. మీరు ఈ పథకంలో నెలకు రూ. 2,100 పెట్టుబడి పెడితే మీరు సంవత్సరానికి రూ. 25,200 పెట్టుబడి పెడతారు. మీరు ఈ మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం కొనసాగిస్తే 15 సంవత్సరాలలో మొత్తం డిపాజిట్ మొత్తం రూ. 3.75 లక్షలు అవుతుంది. మీరు వార్షిక వడ్డీని 7.1 శాతంగా లెక్కిస్తే చివరకు మీకు మొత్తం రూ. 6.78 లక్షలు లభిస్తాయి. మీ పిల్లలు కళాశాలలో చేరినప్పుడు ఇది చాలా సహాయపడుతుంది.

తక్కువ ప్రమాదం:

ప్రావిడెంట్ ఫండ్ పథకం అనేది ప్రభుత్వం నిర్వహించే పథకం. అందుకే దీనిలో పెట్టుబడి పెట్టడం పూర్తిగా సురక్షితం. బ్యాంకులా కాకుండా, మీ పెట్టుబడులు మార్కెట్



హెచ్చుతగ్గుల వల్ల ప్రభావితం కావు. దీనిలో వచ్చే వడ్డీ, మెచ్యూరిటీ మొత్తం రెండూ ఆదాయపు పన్ను నుండి పూర్తిగా మినహాయించబడ్డాయి. ఇది పొదుపు పరంగా వ్యక్తికి రెట్టింపు ప్రయోజనం లాంటిది. ఒక వైపు సాధారణ పొదుపుల నుండి పెద్ద నిధి సృష్టించబడుతుంది. మరోవైపు పన్ను ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఈ ప్లాన్ ఎందుకు ఉత్తమ ఎంపిక?

మీ బిడ్డ పుట్టిన వెంటనే మీరు పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే వారు కళాశాలకు వెళ్లే సమయానికి సరిగ్గా 15 సంవత్సరాలలో మీ చేతుల్లో డబ్బు ఉంటుంది. మీరు వారి కళాశాల ఫీజులను చెల్లించడానికి దీన్ని ఉపయోగించవచ్చు. అలాగే ఈ పథకం స్థిరమైన వడ్డీ రేటును అందిస్తుంది. పెట్టుబడి చాలా సురక్షితం. ఇది పన్ను మినహాయింపును కూడా అందిస్తుంది. తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టే వ్యక్తి పెద్ద లాభం పొందవచ్చు.

## సిబి125 హార్నెట్ - షైన్ 100 డిఎక్స్ లను ఆవిష్కరించిన హెూండా



హైదరాబాద్ : హెూండామోటర్‌సైకిల్ %డ% స్కూటర్‌ఇండియా(హెచ్‌ఎంఎస్‌ఐ) తమ తాజా ద్విచక్ర వాహన ఆవిష్కరణలు – సరికొత్త హెూండా సిబి 125 హార్నెట్ మరియు హెూండా షైన్ 100 డిఎక్స్‌లను హైదరాబాద్ నగరంలో వైభవంగా విడుదల చేసింది. ఈ భారీ ఆవిష్కరణ కార్యక్రమం కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్‌లో హెచ్‌ఎంఎస్‌ఐ జోనల్ హెడ్ (సేల్స్) సునీల్ రెడ్డి, డీలర్ భాగస్వాములు, ఏరియా సేల్స్ %డ% సర్వీస్ మేనేజర్లు మరియు కస్టమర్ల సమక్షంలో జరిగింది.భారతీయ కస్టమర్ల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా అత్యాధునిక డిజైన్, అధునాతన సాంకేతికత, ఉన్నతమైన సవారీ అనుభవాలను అందించడంలో తమ నిబద్ధతను హెచ్‌ఎంఎస్‌ఐ వెల్లడించింది . తదుపరి తరం రైడర్ల కోసం రూపొందించబడిన హెూండా సిబి 125 హార్నెట్, "రైడ్ యువర్ రిజ్" అనే యువత స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్తోంది. ఇది గోల్డెన్ యుఎస్‌డి ఫ్రంట్ ఫోర్కులు, కీ–ఆన్–ట్యాంక్ ఇగ్నిషన్ సిస్టమ్, యుఎస్‌బి ఛార్జింగ్ పోర్ట్ , చురుకైన హ్యాండ్లింగ్ కోసం 5–స్టెప్ అడ్జస్టబుల్ మోనో–షాక్ అబ్జార్బర్ వంటి ఫీచర్లను ఈ విభాగంలో మొట్టమొదటి సారిగా కలిగి వుంది.క్రోమ్ మఫ్లర్ కవర్ దీనిలో ప్రధాన ఆకర్షణలు.

## తక్కువ ధర కే బిఎస్‌ఎన్‌ఎల్ ప్లాన్స్

### 2 జీబీ డేటా.. 28 రోజుల వ్యాలిడిటీ..?

సరికొత్త, సరసమైన ప్లాన్స్ తో బిఎస్ఎన్ఎల్ ప్రైవేట్ టెలికాం కంపెనీలను సవాల్ విసురుతోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఈ కంపెనీ రూ.200 కంటే తక్కువ ధర కలిగిన సూపర్ ప్లాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది 2 జిబి రోజువారీ డేటాను అందిస్తుంది. బిఎస్ఎన్ఎల్ తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ద్వారా ఈ ప్లాన్ వివరాలను ప్రకటించింది. ప్రైవేట్ ప్రొవైడర్ల నుండి ఇలాంటి ప్లాన్‌ల కంటే తమ ఆఫర్ ఎంత చౌకగా ఉందో హైలైట్ చేసింది. ఈ ప్లాన్ లో అపరిమిత కాలింగ్, ఉచిత ఎస్ ఎం ఎస్ సౌకర్యం కూడా అందిస్తోంది.

**రూ. 199తో కొత్త ప్లాన్ ప్రకటన**

బిఎస్ఎన్ఎల్ ఎక్స్ హ్యాండిల్ ద్వారా తన కొత్త రూ.199 ప్లాన్ ను పరిచయం చేసింది. ఈ ప్లాన్ తో రీఛార్జ్ చేసుకుంటే 30 రోజుల పాటు వ్యాలిడిటీ ఉంటుంది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రతి టెలికాం సర్కిల్ లో ఈ ప్లాన్ అందుబాటులో ఉన్నట్లు బిఎస్ఎన్ఎల్ వెల్లడించింది. సబ్ స్క్రైబర్లకు అపరిమిత కాలింగ్ లభిస్తుంది. అంతేకాదు, ఉచిత నేషనల్ రోమింగ్, రోజువారీ 2 జిబి డేటా, 100 ఉచిత ఎస్ ఎం ఎస్ లు అందిస్తుంది. నెల రోజుల్లో మొత్తం 60 జిబి డేటా లభిస్తుంది.

**ప్రైవేట్ కంపెనీలతో బిఎస్ఎన్ఎల్ ప్లాన్ పోలిక**

బిఎస్ఎన్ఎల్ దాని రూ.199 ప్లాన్ ను ఇతర ప్రైవేట్ టెలికాం కంపెనీలతో పోల్చింది. రూ.199తో ఒక ప్రైవేట్ ప్రొవైడర్ చౌకైన ప్లాన్ కేవలం 14 రోజుల చెల్లుబాటును అందిస్తుంది. ఇది అపరిమిత కాలింగ్, ఉచిత నేషనల్ రోమింగ్, 2 జిబి రోజు వారీ డేటా, 100 ఉచిత ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలను అందిస్తుంది. అంటే, బిఎస్ఎన్ఎల్ ప్లాన్ అదే ధరకు 16 అదనపు రోజుల చెల్లుబాటును అందిస్తుంది. మరొక టెలికాం కంపెనీ రూ.379కి 30 రోజుల ప్లాన్ ను అందిస్తుంది. అపరిమిత కాలింగ్, ఉచిత నేషనల్ రోమింగ్, 2జిబి రోజువారీ డేటా, 100 ఉచిత ఎస్ ఎం ఎస్ లను అందిస్తుంది. ఇది బిఎస్ఎన్ఎల్ ఆఫర్ కంటే రూ.180 ఎక్కువ ఖరీదైనది. మరో ప్రైవేట్ ప్రొవైడర్ రూ.365కి 28 రోజుల చెల్లుబాటుతో రోజువారీ 2 జిబి డేటా ప్లాన్‌ను అందిస్తుంది.

**బిఎస్ఎన్ఎల్ బిటివి ప్రీమియం ప్లాన్**

బిఎస్ఎన్ఎల్ బి టివి అనే కొత్త ప్రీమియం ప్లాన్ ను కూడా ప్రవేశపెట్టింది. దీని ధర నెలకు రూ.151, అంటే రోజుకు దాదాపు రూ.5. ఈ ప్లాన్‌తో, వినియోగదారులు 450 కంటే ఎక్కువ లైవ్ టీవీ ఛానెల్స్, 25 ప్రముఖ స్ట్రీమింగ్ సేవలను పొందవచ్చు. ఈ ప్లాన్ తో వచ్చే అదనపు ఫీచర్లు, ప్రయోజనాలను కంపెనీ వెల్లడించలేదు. మొత్తంగా ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బిఎస్ఎన్ఎల్ ప్రైవేట్ టెలికాం సంస్థలు ధీటైన ప్లాన్స్ ను పరిచయం చేస్తూ వినియోగదారులను మరింతగా ఆకట్టుకుంటుంది.

## పవర్ గ్రిడ్ కు స్కోప్ ఎమినెన్స్ అవార్డు




ఢిల్లీ: భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మహారత్న సిపిఎస్ యు అయిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ), గౌరవనీయులైన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ముచే స్కోప్ మానవ వనరుల నిర్వహణలో ఎమినెన్స్ అవార్డును ప్రదానం చేశారు.ఆగస్టు 29, 2025న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో. ఈ అవార్డును పవర్ గ్రిడ్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ర వీంద్ర కుమార్ త్యాగి, పవర్ గ్రిడ్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ యతీంద్ర ద్వివేదితో కలిసి అందుకున్నారు. ఈ సందర్భంగా, గౌరవనీయులైన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మరియు డిపిఈ కార్యదర్శి కె. మోసెస్ చలై, సిపిఎస్ యులు, స్కోప్ మరియు పవర్ గ్రిడ్ సీనియర్ అధికారులతో పాటు పాల్గొన్నారు.ఈ గుర్తింపు పవర్ గ్రిడ్ ప్రగతిశీల హెచ్ ఆర్ పద్ధతులను హైలైట్ చేస్తుంది, ఇవి ఉద్యోగి–కేంద్రీకృత విధానాలు, నిరంతర నైపుణ్యాభివృద్ధి మరియు నాయకత్వ అభివృద్ధిని నొక్కి చెబుతాయి, అదే సమయంలో సంస్థ అంతటా ఆవిష్కరణ, కలుపుకోలు మరియు సమగ్ర శ్రేయస్సు యొక్క సంస్కృతిని పెంపొందిస్తాయి.

## జీమెయిల్ పాస్‌వర్డ్ మార్చాల్సిందే!




గూగుల్ తన 2.5 బిలియన్ జీమెయిల్ యూజర్లకు కీలక హెచ్చరిక జారీ చేసింది. సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేసేందుకు వెంటనే పాస్‌వర్డ్‌లు మార్చుకోవాలని సూచించింది. దీంతో పాటు టూ–స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ప్రారంభించుకోవాలని తెలిపింది. హ్యాకింగ్ ప్రయత్నాలు గణనీయంగా పెరగడంతో ఈ హెచ్చరిక చేసినట్లు గూగుల్ తెలిపింది. వీటి వెనక షైనీహంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్ల ముఠా ఉన్నట్లు గుర్తించామని వెల్లడించింది.

2020 నుంచి యాక్టివ్‌గా ఉన్న ఈ గ్రూప్‌పై ఇప్పటికే ఏటీ%డ%టీ, మైక్రోసాఫ్ట్, సాంటాండర్, టికెట్‌మాస్టర్ వంటి సంస్థల డేటా లీక్ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ హ్యాకర్లు ఫిషింగ్ పద్ధతిని ప్రధాన ఆయుధంగా వాడుతున్నట్లు గూగుల్ తెలిపింది. నకిలీ ఇమెయిళ్లు పంపి యూజర్లను వేరే లాగిన్ పేజీలలోకి మళ్లించడం, సెక్యూరిటీ కోడ్‌లు సహా కీలక సమాచారాన్ని దోచుకోవడం వీరి ప్రధాన వ్యూహం. గూగుల్ జూన్‌లోనే ఒక బ్లాగ్‌పోస్ట్‌లో "షైనీహంటర్స్ గ్రూప్ డేటా లీక్ సైట్ ప్రారంభించడానికి సిద్ధమవుతోందని భావిస్తున్నాం. దీంతో సున్నిత సమాచార దోపిడీ మరింత పెరిగే అవకాశముంది" అని హెచ్చరించింది. ఆ తరువాత ఆగస్టు 8న ప్రభావితమయ్యే అవకాశం ఉన్న యూజర్లకు ప్రత్యేకంగా మెయిల్స్ పంపి అకౌంట్ సెక్యూరిటీని తక్షణం పెంచుకోవాలని సూచించింది.

**టూ–స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరి**

దీని ద్వారా మీ ఇమెయిల్‌కు అదనపు సెక్యూరిటీ అందించొచ్చు. హ్యాకర్లు మీ పాస్‌వర్డ్‌ను తెలుసున్నప్పటికీ భద్రతా కోడ్ లేకుండా వారు లాగిన్ కాలేరు. ఈ కోడ్ సాధారణంగా మీ మొబైల్ లేదా నమ్మదగిన డివైజ్‌కు వస్తుంది. "2ఎస్‌వీ ప్రారంభిస్తే, దొంగలు మీ అకౌంట్‌లోకి చొరబడలేరు. మీ ఇమెయిల్‌ను సురక్షితంగా ఉంచుకోవడానికి ఇది అత్యవసరం" అని బ్రిటన్‌లోని యాక్షన్ ఫ్రాడ్ కూడా తెలిపింది. "2ఎస్‌వీ ఆన్ చేయడం కేవలం కొన్ని నిమిషాల పని. కానీ ఇది సైబర్ మోసాలను దరిచేరనీయదు" అని స్టాప్ థింక్ ఫ్రాడ్ వెబ్‌సైట్ పేర్కొంది.

**లింక్డిన్‌లో టిక్‌టాక్ ఉద్యోగావకాశాలు.. భారత్‌లోకి మళ్లీ అడుగుపెడుతుందా?**

ఇది జీమెయిల్‌కే పరిమితం కాదు. బ్యాంకింగ్, షాపింగ్, సోషల్ మీడియా అకౌంట్ల వంటి అన్ని ప్రధాన ఆన్‌లైన్ సర్వీసుల్లోనూ 2ఎస్‌వీ ఆప్షన్ అందుబాటులో ఉంది. సెక్యూరిటీ సెట్టింగ్స్‌లో టూ–ఫాక్టర్ ఆథెంటికేషన్ (2ఎఫ్ఏ) లేదా మల్టీ–ఫాక్టర్ ఆథెంటికేషన్ (ఎంఎఫ్ఏ) పేరుతో అందుబాటులో ఉంటుంది.

## ఇకపై ఆధార్ సెంటర్లకు వెళ్లక్కర్లేదు!


### మొబైల్‌లోనే పేరు, అడ్రస్, నంబర్ మార్పులు చేర్పులు!!




ఆధార్ కార్డ్ యూజర్లు అందరికీ గుడ్ న్యూస్ . త్వరలోనే ఏఐ, ఫేస్ ఐడీ ఫీచర్లతో కొత్త 'ఈ–ఆధార్ యాప్'ను లాంచ్ చేసేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) సిద్ధమవుతోంది. ఇది కనుక అందుబాటులోకి వస్తే మీ మొబైల్‌లోనే మీరు పేరు, చిరునామా, పుట్టిన తేదీ, ఫోన్ నంబర్ అప్డేట్ చేసుకోవడానికి వీలవుతుంది.ప్రస్తుతం ఎవరైనా తమ ఆధార్ వివరాలను అప్డేట్ చేయాలంటే, కచ్చితంగా ఆధార్ నమోదు కేంద్రాలకు 0వ్యక్తిగతంగా వెళ్లాల్సి వస్తోంది. దీని వల్ల చాలా సమయం, డబ్బు వృథా అవుతోంది. చిన్న అప్డేట్ చేయాలన్నా ఆధార్ సెంటర్ల వద్ద క్యూలో నిలబడాల్సి వస్తోంది. ఉద్యోగులు అయితే ఒక రోజు సెలవు పెట్టాల్సి వస్తోంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో, ఇంటర్నెట్ అందుబాటులో లేని ప్రాంతాల్లోని ప్రజలైతే చాలా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు యూఐడీఏఐ సిద్ధమవుతోంది.


సూర్య
హైదరాబాద్
సోమవారం
1 సెప్టెంబర్ 2025






ఏ పరిస్థితుల్లో ఉన్నా..... నీ కర్తవ్యం నీకు గుర్తుంటే ......... జరగవలసిన పనులు అవే జరిగిపోతాయి.

- స్వామి వివేకానంద



చిన్న విషయమే కదా అని దేనినీ తేలికగా తీసుకోకూడదు. అతి పెద్ద ఓడను కూడా ఓ చిన్న రంధ్రం నిలువునా ముంచేస్తుంది.

- చాణక్యుడు



తన తల్లిని గాఢంగా ప్రేమించే వ్యక్తి జీవితాంతం విజేత మనస్తత్వంతో ఉంటాడు.

- మహాత్మా గాంధీ

# చైనా, భారత్ ఒక్కటవ్వాలి..

● భారత్- చైనా సంబంధాలపై చైనా అధ్యక్షుడు జిన్పింగ్ ● చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగిస్తాం భారత ప్రధాని మోడీ ● ఇరు దేశాల ప్రజల శ్రేయస్సు దృష్ట్యా సంబంధాల పునరుద్ధరణ ● ఇప్పటికే కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైంది ● పరస్పర విశ్వాసం, గౌరవంతో ఇరు దేశాల మధ్య సంబంధాలుంటాయి



షాంఘై: షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం భారత ప్రధాని మోదీ చైనాలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్పింగ్తో భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాలపై మాట్లాడారు. ఈ క్రమంలో జిన్పింగ్ మాట్లాడుతూ.. భారత్- చైనా స్నేహంగా ఉండటం సరైన నిర్ణయమన్నారు.ప్రధాని మోదీని మరోసారి కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందంటూ.. ఎస్సీవో సదస్సుకు జిన్పింగ్ ఆహ్వానం పలికారు. గతేడాది కజన్లో ఇరువురి నేతల మధ్య జరిగిన భేటీని జిన్పింగ్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు.. గ్లోబల్ సౌత్లో ముఖ్యమైన సభ్యులని పేర్కొన్నారు. ఇరు దేశాల్లోని ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంబంధాల పునరుద్ధరణ బాధ్యతను తాము భుజాన వేసుకున్నామన్నారు. పొరుగు దేశాలుగా తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల విజయాలకు దోహదపడే అంశాల్లో.. డ్రాగన్, ఏనుగు కలిసి రావడం సరైన ఎంపికన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షికంగా స్థిర, దృఢమైన సంబంధాలు దీర్ఘకాలం కొనసాగేలా చూసుకోవాలన్నారు. ప్రపంచంలో శాంతి, శ్రేయస్సు కోసం భారత్-చైనాలు బాధ్యతను తీసుకోవాలని జిన్పింగ్ పిలుపునిచ్చారు. అంతకు ముందు ప్రధాని మోదీ మాట్లాడుతూ.. చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ఇరుదేశాల సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొన్నాయని, కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైందని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇరుదేశాల మధ్య సహకారంతో దాదాపు 2.8 బిలియన్ల మంది ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. చైనాతో సానుకూల సంబంధాలు కొనసాగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. గతేడాది రష్యాలోని కజన్లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్పింగ్తో జరిగిన సమావేశం గురించి ఆయన ఇక్కడ ప్రస్తావించారు. నాడు తమ భేటీ ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు బాటలు వేసిందన్నారు. భారత్- చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొందన్నారు. కైలాశ్ మానససరోవర్ యాత్ర కూడా తిరిగి ప్రారంభమైన విషయాన్ని గుర్తు చేశారు. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇరుదేశాల మధ్య సహకారంతో దాదాపు 2.8 బిలియన్ల మంది ప్రజల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు.పరస్పర విశ్వాసం, గౌరవంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు ముందుకు తీసుకెళ్లేందుకు నిశ్చయించుకున్నామన్నారు. ఈ సందర్భంగా చైనాలో పర్యటించేందుకు, ఎస్సీవో సదస్సుకు తనను ఆహ్వానించినందుకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు 2019లో భారత్లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించే అంశంపై సైనిక, దౌత్యాధికారుల మధ్య పలు దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్పై విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే ట్రంప్ సుంకాలను ఖండించిన డ్రాగన్.. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.

# జమ్ము కశ్మీర్లో విరిగిపడ్డ కొండచరియలు..

**11మంది మృతి, పలువురికి గాయలు..**



జమ్ము: జమ్ము కశ్మీర్లో మరోసారి క్లౌడ్ బరస్ట్ సంభవించింది. భారీ వర్షాల కారణంగా రాంబాన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి 11 అక్కడికక్కడే మృతి చెందారు.. అలాగే శిథిలాల కింద మరికొంత మంది ఉన్నారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ ఘటనలో మరణించిన వారిలో ఐదుగురు 12 ఏళ్లలోపు చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు.ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ జిల్లా కమిషనర్తో మాట్లాడి, అన్ని సాధ్యమైన సహాయాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా తక్షణ రెస్క్యూ, రిలీఫ్ చర్యలను ఆదేశించారు.అయితే భారీ వర్షాలు, క్లౌడ్ బరస్ట్ రాజ్గఢ్ ప్రాంతంలోని గడ్గ్రామ్ పాకెట్లో ఇళ్లను దెబ్బతీశాయి. అక్కడి ప్రాంతంలో వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి, ఇది విస్తృతమైన నష్టానికి దారితీసింది. జమ్ము-శ్రీనగర్ నేషనల్ హైవే ఐదు రోజులుగా మూసివేయబడింది. దీంతో ఉధంపూర్ జిల్లాలోని జఖేని, చెనాని మధ్య కొండచరియల కారణంగా 2,000 కంటే ఎక్కువ వాహనాలు చిక్కుకుపోయాయి. అంతేకాకుండా జమ్ము ప్రాంతంలో తొమ్మిది ఇంటర్-డిస్ట్రిక్ట్ రోడ్లు మూసివేయబడ్డాయి, డజన్ల కొద్దీ గ్రామాలు కట్ ఆఫ్ అయ్యాయి.

**గత రెండు వ్యార్శాల్లో115 మరణాలు..**

గత రెండు వారాల్లో, తీవ్రమైన వర్షాలు, క్లౌడ్ బరస్టు, కొండచరియలు జమ్ము ప్రాంతంలో గణనీయమైన వినాశనానికి కారణమయ్యాయి. మొత్తం 115 కంటే ఎక్కువ మరణాలు సంభవించాయి. ప్రధానంగా యాత్రికులు, కిష్త్వార్లోని మచైల్ మాత యాత్రలో 65 మరణాలు, జమ్ములోని మాత వైష్ణోదేవి దేవాలయం సమీపంలో 30 మరణాలు, రాంబాన్ , రీసీలలోని సంఘటనలు 11 మంది మరణాలకు దారితీశాయి. ఈ ఘటనపై సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలు ల్యాండ్స్లైడ్-ప్రోన్ ప్రాంతాలలో ప్రయాణించకుండా ఉండాలని, నదులు, నాలాల నుండి దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అలాగే అత్యవసర సమయంలో 112 సంప్రదించండని తెలిపారు.

# యూపీఎస్సీ అభ్యర్థుల కోసం 'ప్రతిభా సేతు'..

● 125వ మన్‌కి బాత్‌లో ప్రధాని మోడీ ● యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా చర్యలు తీపుకుంటున్నాం ● అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోవటంతో ప్రధాని ఆవేదన ● విపత్తు సమయంలో, సహాయం చేయడానికి ముందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు ● క్రీడాకారులతో మోడీ మాటామంతి



న్యూఢిల్లీ : యూపీఎస్సీ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా 'ప్రతిభా సేతు' పోర్టల్ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. దీని ద్వారా యూపీఎస్సీ అభ్యర్థులకు అనేక ప్రయోజనాలు ఉన్నట్లు మన్కీ బాత్ 125వ కార్యక్రమంలో మోదీ తెలిపారు. దేశంలోని కఠినమైన పరీక్షల్లో సివిల్ సర్వీసెస్ ఒకటని.. ప్రతి ఏడాది ఎంతో మంది అభ్యర్థులు రాస్తుంటారన్నారు. ఎంతో సమయం, డబ్బును ఖర్చు చేసి నిజాయతీగా కష్టపడుతున్న అభ్యర్థులు ఒక్కోసారి స్వల్ప తేడాతో సివిల్స్ తుది జాబితాలో చోటు దక్కించుకోలేకపోతున్నారని.. ఇలాంటి వారి కోసం 'ప్రతిభ సేతు' పోర్టల్ను ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

**జెట్ ఇంజిన్లను తయారుచేస్తాం**

సివిల్స్ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించి.. మెరిట్ లిస్టులో పేరు లేని అభ్యర్థుల వివరాలను ఇకపై ఈ పోర్టల్లో ఉంచనున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఈ వివరాలను ప్రైవేట్ కంపెనీలు తీసుకొని.. తమ సంస్థలలో వారికి ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయి..**

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం, వరదలపై మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయన్నారు. అనేక రాష్ట్రాల్లో భారీ వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారని.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారన్నారు. తీవ్రంగా శ్రమిస్తున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాలు , భద్రతా దళాలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ వర్షాకాలంలో, ప్రకృతి వైపరీత్యాలు దేశాన్ని పరీక్షిస్తున్నాయి. గత కొన్ని వారాలలో, వరదలు మరియు కొండచరియలు విరిగిపడటం వలన సంభవించిన తీవ్ర విధ్వంసాన్ని మనం చూశాము. కొన్ని చోట్ల ఇళ్ళు ధ్వంసమయ్యాయిబీ మరికొన్ని చోట్ల పొలాలు మునిగిపోయాయిబీ కుటుంబాలు సామూహికంగా నాశనమయ్యాయి, మరికొన్ని చోట్ల, బలమైన నీటి ప్రవాహంలో వంతెనలు కొట్టుకుపోయాయిబీ రోడ్లు కొట్టుకుపోయాయిబీ ప్రజల జీవితాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. ఈ సంఘటనలు ప్రతి భారతీయుడిని బాధపెట్టాయి. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాల బాధ మన ఉమ్మడి బాధ. సంక్షోభం ఎక్కడ సంభవించినా, మన %ఖీ% సిబ్బంది, ఇతర భద్రతా దళాలు, ప్రతి ఒక్కరూ అక్కడి ప్రజలను రక్షించడానికి పగలు మరియు రాత్రి శ్రమించారు. సైనికులు సాంకేతిక పరిజ్ఞాన సహాయాన్ని కూడా పొందారు. థర్మల్ కెమెరాలు, లైఫ్ డిటెక్టర్లు, స్నిఫర్ డాగ్లు మరియు డ్రోన్ నిఘా వంటి అసంఖ్యాక ఆధునిక వనరుల సహాయంతో, సహాయ చర్యలను వేగవంతం చేయడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. ఈ సమయంలో, హెలికాప్టర్ల ద్వారా సహాయ సామగ్రిని పంపిణీ చేశారుబీ గాయపడిన వారిని విమానంలో తరలించారు. విపత్తు సమయంలో, సైన్యం సహాయం చేయడానికి ముందుకు వచ్చింది. స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, వైద్యులు, పరిపాలన... ఈ సంక్షోభ సమయంలో అందరూ సాధ్యమైనంత కృషి చేశారు. ఈ పరీక్షా సమయంలో మానవత్వాన్ని అన్నింటికంటే ఎక్కువగా ఉంచిన ప్రతి పౌరుడికి నేను హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**జమ్మూకశ్మీర్ మరింత ముందుకు వెళ్తోంది..**

వినాశకరమైన ప్రకృతి వైపరీత్యాలు జమ్మూకశ్మీర్ను అతలాకుతలం చేస్తున్నప్పటికీ.. అనేక విషయాల్లో ముందుకు వెళ్తుందన్నారు. ఇటీవల శ్రీనగర్లోని దాల్ సరస్సులో నిర్వహించిన ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ గురించి మోదీ ప్రస్తావించారు. దేశ్వాప్తంగా 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారన్నారు. పురుషులతో సమానంగా మహిళా అథ్లెట్లు కూడా ఇందులో ప్రతిభ చూపారన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా కశ్మీర్లోని పుల్వామాలో తొలి సారిగా డే-నైట్ క్రికెట్ మ్యాచ్ జరిగిందని పేర్కొన్నారు. దేశం మార్పువైపు పయనిస్తోందనడానికి ఇవి ఉదాహరణగా నిలిచాయన్నారు.ఇంతకుముందు ఇది అసాధ్యం, కానీ ఇప్పుడు నా దేశం రూపాంతరం చెందుతోంది. ఈ మ్యాచ్ 'రాయల్ ప్రీమియర్ లీగ్'లో భాగం, దీనిలో జమ్మూ మరియు కాశ్మీర్లోని వివిధ జట్లు ఆడుతున్నాయి. వేలాది మంది ఔత్సాహికులు, ముఖ్యంగా యువత, పుల్వామాలో రాత్రిపూట క్రికెట్ ఆస్వాదిస్తున్నారు... ఇది నిజంగా చూడటానికి ఒక దృశ్యం. మిత్రులారా, దృష్టిని ఆకర్షించిన రెండవ కార్యక్రమం దేశంలో మొట్టమొదటి ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ మరియు అది కూడా శ్రీనగర్లోని దాల్ సరస్సులో జరిగింది. నిజంగా, అటువంటి ఉత్సవాన్ని నిర్వహించడానికి ఇది ఎంత ప్రత్యేకమైన ప్రదేశం. జమ్మూ కాశ్మీర్లో జల క్రీడలను మరింత ప్రాచుర్యం పొందేలా చేయడమే దీని లక్ష్యం. భారతదేశం నలుమూలల నుండి 800 మందికి పైగా అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారు. మహిళా అథ్లెట్లు కూడా వెనుకబడి లేరు... వారి భాగస్వామ్యం కూడా దాదాపు పురుషులతో సమానంగా ఉంది. ఇందులో పాల్గొన్న అన్ని క్రీడాకారులను నేను అభినందిస్తున్నాను. అత్యధిక పతకాలు గెలుచుకున్న మధ్యప్రదేశ్కు ప్రత్యేక అభినందనలు, తరువాత హర్యానా మరియు ఒడిశా ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం మరియు అక్కడి ప్రజల ఆప్యాయత మరియు ఆతిథ్యాన్ని నేను ఎంతో అభినందిస్తున్నాను. ఈ ఈవెంట్ అనుభవాన్ని మీకు తీసుకురావడానికి, ఇందులో పాల్గొన్న ఇద్దరు క్రీడాకారులుఒడిశాకు చెందిన రష్మితా సాహు మరియు మరొకరు శ్రీనగర్కు చెందిన మొహ్సిన్ అలీ. తో మాట్లాడారు.

# అమిత్ షాపై వివాదాస్పద వ్యాఖ్యలు..

● తృణమూల్ మహిళా ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు!
● జాతీయ సమైక్యతకు హాని కలిగిస్తాయన్న పోలీసులు



న్యూఢిల్లీః కేంద్ర హోంమంత్రి అమిత్ షాను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో రాయ్పూర్లోని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొయిత్రాపై ఎఫ్ఐఆర్ నమోదైంది. స్థానిక నివాసి, భారతీయ జనతా పార్టీ (బిజెపి) నాయకుడు గోపాల్ సమంతో ఫిర్యాదు మేరకు శనివారం మానా పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదైంది. బిఎన్ఎస్ సెక్షన్లు 196, 197 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసు అధికారులు నిర్ధారించారు. ఈ సెక్షన్లు మతం, జాతి లేదా జన్మస్థలం వంటి కారణాలతో వివిధ సమూహాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, జాతీయ సమైక్యతకు పక్షపాతపూరిత ప్రకటనలు చేయడం వంటి వాటికి సంబంధించినవి.

**మహువ్వా మొయిత్ర్రా ఏం చెప్పారు?**

పశ్చిమ బెంగాల్లోని నాడియా జిల్లాలో గురువారం మొయిత్రా చేసిన ప్రకటన ఈ వివాదం రేపింది. ఒక కార్యక్రమంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ నుండి చొరబాట్లను నిరోధించడంలో అమిత్ షా విఫలమైతే "మీరు చేయవలసిన మొదటి పని అమిత్ షా తలను నరికి మీ టేబుల్పై ఉంచడమే" అని ఆమె అన్నారు. ఈ ప్రకటన రాజకీయ ఆగ్రహాన్ని రేకెత్తించింది. 1971 నుండి రాయ్పూర్లోని మానా క్యాంప్ ప్రాంతంలో బంగ్లాదేశ్ నుండి వచ్చిన పెద్ద సంఖ్యలో శరణార్థులు నివసిస్తున్నారు. ఈ ప్రకటన స్థానిక వర్గాలలో భయం, కోపాన్ని రేకెత్తించవచ్చని పోలీసులు తెలిపారు.ఫిర్యాదుదారుడైన బిజెపి నాయకుడు గోపాల్ సమంటో, మొయిత్రా వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తూ, "నేను చాలా బరువెక్కిన హృదయంతో ఫిర్యాదు చేశాను. మహువా మొయిత్రా మా వర్గానికి చెందినది మరియు ఆమె ఒక ఎంపీ. హోంమంత్రి అమిత్ షాపై ఆమె ఇంత బాధ్యతారహితమైన ప్రకటన చేసింది. ఇది సిగ్గులేనితనం." ఇటువంటి విభజన వ్యాఖ్యలు చేసే వ్యక్తులకు "పార్లమెంటులో స్థానం ఉండకూడదు", "సమాజం నుండి బహిష్కరించబడాలి" అని ఆయన అన్నారు.

# పాక్‌కు సపోర్ట్ చేసిన చైనాతో స్నేహమా?

● జిన్పింగ్తో మోదీ భేటీపై కాంగ్రెస్ ఫైర్ ● భారత్, చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొందా? ఎక్కడ?
● మోదీ ప్రభుత్వం వెన్నుముక లేనట్లు ప్రవర్తించిందని విమర్శ

న్యూఢిల్లీ : చైనాలోని తియాంజిన్లో ఆ దేశ అధ్యక్షుడు జిన్పింగ్, ప్రధాని మోదీ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-చైనా సరిహద్దుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని మోదీ ప్రకటించడాన్ని తప్పుబట్టింది. చైనా బెదిరింపుల వల్ల ఇలా అన్నారని అనుకోవాలా? లేదా మోదీ సర్కార్ వెన్నెముక లేనితనం అని నిర్వచించాలా? అని ప్రశ్నించింది."2020 జులైలో గల్వాన్ లోయలో చైనా దురాక్రమణకు పాల్పడింది. ఆ సమయంలో మన వీర జవాన్లు 20 మంది దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. దీనిని ఖండించాల్సిన మన ప్రధాని మోదీ, 2020 జూన్ 19న చైనాకు క్లీన్ చీట్ ఇచ్చారు. వాస్తవానికి లద్ధాఖ్లోని మన భూభాగం నుంచి చైనా వెనక్కు వెళ్లాలని మన ఆర్మీ చీఫ్ డిమాండ్ చేశారు. కానీ దీనిని సాధించడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైంది. పైగా ఇప్పుడు చైనాతో సయోధ్యకు సిద్ధమైంది. ఈ విధంగా చైనా ప్రాదేశిక దురాక్రమణను చట్టబద్ధం చేసింది."

**జైర్యాం రమేశ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఎక్స్ పోస్ట్**

**పాక్కు సాయం చేసిన చైన్యా**


"ఆపరేషన్ సిందూర్ తరువాత పాక్ నేరుగా భారత్పై దాడులకు దిగింది. ధీటుగా స్పందించిన భారత్, పాక్ను చావుదెబ్బ కొట్టింది. అయితే ఆ సమయంలో చైనా బహిరంగంగా పాకిస్థాన్కు మద్దతు నిలిచింది. ఆయుధాలతోపాటు సాంకేతిక సహకారాన్ని అందించింది. దీనిని జిన్పింగ్తో భేటీ సందర్భంగా మోదీ ప్రస్తావించకపోవడాన్ని జైరాం రమేశ్ తప్పుపట్టారు."ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్కు చైనా ఫుల్ సపోర్టు నిలిచింది. ఈ విషయాన్ని 2025 జులై 4న డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ సింగ్ చాలా స్పష్టంగా చెప్పారు. ఈ అపవిత్ర కూటమిపై ప్రతిస్పందించడానికి బదులుగా, మోదీ సర్కార్ నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఇప్పుడు చైనా పర్యటనలో ఉన్న మోదీ, కనీసం దానికి గురించి మాట్లాడలేదు. చైనా దుర్మార్గపు చర్యలను ఖండించాల్సిన మోదీ, అలా చేయకుండా, చిరునవ్వుతో జిన్పింగ్తో కరచాలనం చేశారు" అని జైరాం రమేశ్ విమర్శించారు.

**చైన్యా ప్రాజెక్టుతో భారత్కు ఎంతో నష్టం!**

"చైనా యార్లుంగ్ త్సాంగ్పో నదిపై భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించనున్నట్లు ప్రకటించింది. దీని నిర్మాణం పూర్తయితే భారత ఈశాన్య రాష్ట్రాలపై చాలా దుష్ప్రభావం పడుతుంది. దీనిపై కూడా మోదీ ఒక్క మాట మాట్లాడలేదు. చైనా ఉత్పత్తులు భారత్లోకి ఎలాంటి నియంత్రణ, అడ్డంకులు లేకుండా వచ్చి పడుతున్నాయి. దీని వల్ల మన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) తీవ్రంగా నష్టపోతున్నాయి. వీటిపైనా మోదీ సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

**ఇదేన్యా దౌత్యం అంటే?- మోదీపై ఆప్ విమర్శలు**

మరోవైపు ప్రధాని మోదీ చైనా పర్యటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విమర్శలు గుప్పించింది. చైనా ఆక్రమించిన భూమిని తిరిగి భారత్కు అప్పగించాలని మోదీ కోరాలని డిమాండ్ చేసింది. "రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు అని ప్రధాని మోదీ అన్నారు. ఆ మాటలను నేను మళ్లీ గుర్తు చేయాలని అనుకుంటున్నాను. చైనా గల్వాన్ లోయలో మన సైనికులపై దాడి చేసింది. మన సైనికులను చంపి, మన భూభాగాన్ని స్వాధీనం చేసుకుంది. ఆ భూమి ఇప్పటికీ చైనా ఆధీనంలోనే ఉంది. కానీ మోదీ సర్కార్ దీనిని అంగీకరించడం లేదు. మొదట మోదీ, మన భూమిని మనకు అప్పగించమని చైనాను అడగాలి. కానీ మోదీ అలా చేయడం లేదు. అమెరికాతో కలిసి ఉండలేకపోతున్నాం కనుక, చైనాతో కలిసి ఉండాలని ప్రయత్నిస్తున్నారు. ఇదేనా అంతర్జాతీయ దౌత్యం అంటే?" అని దిల్లీ ఆప్ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు.



**పాజిటివ్ డైరెక్షన్లో భారత్- చైన్యా సంబంధాలు**

ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణపై దృష్టి కేంద్రీకరించారు. అందుకే 'పరస్పర విశ్వాసం, గౌరవం, సున్నితత్వం ఆధారంగా చైనాతో ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు తీసుకెళ్లడానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్పింగ్కు స్పష్టం చేశారు. సరిహద్దు నిర్వహణపై కూడా భారత్, చైనా ప్రత్యేక ప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం ఉందని మోదీ స్పష్టం చేశారు. గతేడాది కజాన్లో జరిగిన చర్చల తర్వాత భారత్, చైనా సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం నెలకొంది అని పేర్కొన్నారు. గల్వాన్ ఘర్షణల తరువాత భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి ఇరువురు నేతలు విస్తృత చర్చలు జరిపిన సందర్భంగా ప్రధాని మోదీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తరువాత షాంఘై సహకారం సంస్థ (ఎస్సీఓ)కు చైనా విజయవంతంగా అధ్యక్షత వహించినందుకు జిన్పింగ్కు అభినందనలు తెలిపారు.

# 'ట్రంప్ ఈజ్ డెడ్' మోత మోగిపోతున్న సోషల్ మీడియా



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చనిపోయాడంటూ సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. ఆయన ఆరోగ్యం గురించి పలు రకాల ఊహాగానాలు వెల్లువెత్తుతున్న వేళ, సోషల్ మీడియాలో ఆయన చనిపోయారంటూ హ్యాష్ ట్యాగ్ లను ట్రెండ్ చేస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రతీకార సుంకాలతో ట్రంప్ నిత్యం వార్తల్లో ఉంటున్నారు. అదే సమయంలో ఆయన ఆరోగ్యంపై కూడా పలు రకాల వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆయన చనిపోయారంటూ హ్యాష్ ట్యాగ్ లు ట్రెండింగ్ లోకి రావడం మరింత సంచలనంగా మారింది. కొంతమంది ట్రంప్ శవపేటికలో పడుకొని ఉన్నట్టుగా క్యారికేచర్ లు తయారు చేసి సోషల్ మీడియాలో వదిలారు. మొత్తమ్మీద ట్రంప్ మరణించకుండానే ఆయన మరణ వార్తల్ని వైరల్ చేస్తున్నారు, అన్నిటికంటే మించి ఆ వార్తల్ని కామెడీగా మార్చేస్తున్నారు.

**అసలు ట్రంప్ కి ఏమైంది?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వయసు 79 ఏళ్లు. ఆ వయసులో హుషారుగా ఉండటం కూడా కష్టమే. కానీ ట్రంప్ అత్యంత క్లిష్టమైన బాధ్యతలు మోస్తున్నారు. అమెరికా ప్రెసిడెంట్ గా అసాధారణ నిర్ణయాలు తీసుకుంటున్నారు, ప్రపంచ యాత్రలు చేస్తున్నారు. అయితే వయసు రీత్యా ట్రంప్ కొన్ని అనారోగ్యాలతో బాధపడుతున్నారు. ఆయనకు సిరల వాపు వ్యాధి ఉంది. ఇది కూడా వయసుతోపాటు వచ్చేదే. సిరలలో రక్త ప్రవాహం సరిగా జరగకపోవడం వల్ల అవి వాచిపోయినట్టు కనపడతాయి. దీంతో చేతులు, కాళ్లలో అసాధారణ వాపు స్పష్టంగా కనపడుతుంది. చీలమండలు కూడా వాచిపోయి నడవడానికి ఇబ్బందిగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా ట్రంప్ బహిరంగ వేదికలపైకి రావడంతో ఆయన అనారోగ్యం గురించి మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి.

**వైట్ హౌస్ వివరణ ఇచ్చిన్యా..**

ట్రంప్ ఆరోగ్యం బాగానే ఉందని, చిన్న చిన్న ఇబ్బందులు సహజం అని, ఆయన గుండె పనితీరు బాగుందని.. ఇటీవల కాలంలో వైట్ హౌస్ వర్గాలు పలుమార్లు వివరణ ఇచ్చుకున్నాయి. కానీ ఆయన బయటకు వచ్చే సమయంలో మేకప్ తో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అనారోగ్య లక్షణాలు స్పష్టంగా కనపడుతున్నాయి. అందుకే ఆయన ట్రోలింగ్ కి గురవుతున్నారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ తో సమావేశమైన సమయంలో కూడా ఆయన తూలిపోతున్నట్టుగా కనపడ్డారు.

**బాంబ్ పేల్చిన జేడీవ్యాన్స్..**

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజా ఇంటర్వ్యూ ట్రంప్ అనారోగ్య వార్తలకు మరింత ఆజ్యం పోసింది. ఊహించని విషాదం ఏదయినా జరిగితే తాను నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నానని వాన్స్ చెప్పారు. అంటే దాని అర్థం ఏంటి అని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. అధ్యక్షుడికి జరగరానిది ఏదైనా జరిగితే ఆ పదవి చేపట్టేందుకు తాను రెడీ అని ఉపాధ్యక్షుడు చెప్పినట్టేనా అని అర్థాలు తీస్తున్నారు చాలామంది. జేడీ వాన్స్ మాటల మర్మం కూడా అదేనంటున్నారు. స్వయానా ఉపాధ్యక్షుడే అలాంటి వ్యాఖ్యలు చేయడంతో ఆ తర్వాత ట్రంప్ ఆరోగ్యం గురించి మరింతగా ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో ట్రంప్ ఆరోగ్యంపై వాన్స్ మరోసారి ప్రకటన చేయాల్సి వచ్చింది. ఆయన అద్భుతమైన ఆరోగ్యంతో ఉన్నారని, రాత్రి పొద్దుపోయే వరకు పనిచేస్తుంటారని, తెల్లవారిన తర్వాత కూడా ఉత్సాహంగా విధులకు హాజరవుతున్నారని కవర్ చేసే ప్రయత్నం చేశారు.ట్రంప్ వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ సీన్ బార్బబెల్లా కూడా ఇటీవల ఒక అధికారిక నోట్ విడుదల చేయడం విశేషం. ఆస్పిరిన్ మందులు వాడటం వల్ల వచ్చే చికాకు తప్ప ఆయనకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని చెప్పుకొచ్చారు డాక్టర్ బార్బబెల్లా. అయినా కూడా ట్రంప్ పై పుకార్లు ఆగలేదు. ఇప్పుడు ఏకంగా ఆయన చనిపోయాడంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న వార్తలు సంచలనంగా మారాయి.

# అత్యంత ప్రజాదరణ కలిగిన సిఎంగా ఆదిత్యనాథ్

**మూడో స్థానంలో ఏపి సిఎం చంద్రబాబు**



మూడ్ ఆఫ్ ది నేషన్ పేరిట నిర్వహించిన సర్వేలో దేశంలోని ముఖ్యమంత్రుల పనితీరుపై వివరాలు సేకరించారు. ఈ సర్వేలో ఏపీ సీఎం చంద్రబాబు మూడో స్థానంలో నిలవడం విశేషం. దేశంలోని 28 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల సీఎంల పనితీరుపై ఈ సర్వే జరిగింది. ఇందులో ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కు మొదటి స్థానం లభించింది. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి రెండో స్థానం దక్కగా, ఏపీ సీఎం చంద్రబాబు మూడో స్థానంలో నిలిచారు. యూపీ సీఎం యోగికి 36 శాతం జనామోదం లభించింది.

ఆ తర్వాత రెండో స్థానంలో ఉన్న మమతకు 12.5 శాతం ఓట్లు లభించాయి. చంద్రబాబుకి 7.3 శాతం మంది ప్రజలు జై కొట్టారు. బీహార్ సీఎం నితీష్ కుమార్ 4.3 శాతం ఓట్లతో నాలుగో స్థానంలో ఉండగా, తమిళనాడు సీఎం స్టాలిన్ 3.8 శాతం ఓట్లతో ఐదో స్థానంలో నిలిచారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఇదే సర్వేలో చంద్రబాబు ఐదో స్థానంలో ఉండగా.. ఇప్పుడు తన ర్యాంకు మెరుగు పరచుకున్నారు. మూడో స్థానానికి చేరుకున్నారు.

**ఆస్తుల్లో చంద్రబాబు మొదటి స్థానం..**

ఇక ముఖ్యమంత్రుల ఆస్తులపై కూడా ఓ సర్వే జరిగింది. ఈ సర్వేలో ఏపీ సీఎం చంద్రబాబు మొదటి స్థానంలో నిలిచారు. ఆయన ఆస్తుల విలువ రూ.931.83 కోట్లు. ఆ తర్వాత అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండు రూ.332.56 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో నిలిచారు. తర్వాతి స్థానాల్లో కర్నాటక, నాగాలాండ్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు కొనసాగుతున్నారు. 50 కోట్ల రూపాయల కంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్న ముఖ్యమంత్రులు దేశంలో ముగ్గురు ఉన్నారు. రూ.11కోట్ల కంటే ఎక్కువ, రూ.50కోట్ల కంటే తక్కువ ఆస్తి కలిగి ఉన్నవారు 9మంది ఉన్నారు. కోటి రూపాయల నుంచి 11 కోట్ల రూపాయల మధ్య ఆస్తి ఉన్నవారు 16మంది ఉన్నారు. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆస్తులు కేవలం రూ.15లక్షలు. ఆమె కంటే ముందు స్థానంలో జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రూ.55 లక్షల ఆస్తి కలిగి ఉన్నారు. కనీసం కోటి రూపాయల ఆస్తులు కూడా లేని ముఖ్యమంత్రులు దేశంలో వీరిద్దరే.


**టెన్త్పాస్ సీఎం ఒకే ఒక్కరు..**

ముఖ్యమంత్రుల వయసు, విద్యార్హతలపై కూడా ఈ సర్వే జరిగింది. ఇందులో కేవలం టెన్త్ క్లాస్ మాత్రమే పాస్ అయిన సీఎం ఒకే ఒక్కరు ఉన్నారు. డిప్లొమా వరకు చదివిన వారు ఇద్దరున్నారు.

ఇంటర్మీడియట్ వరకు చదివిన వారు ముగ్గురు, డిగ్రీ చదివిన వారు 9మంది, పోస్ట్ గ్రాడ్యుయేట్లు 8మంది, డాక్టరేట్ కూడా సాధించిన వారు ఇద్దరు ఉన్నారు.

**యంగెస్ట్ సీఎం**

అరుణాచల్ ప్రదేశ్ సీఎం పెమా ఖండు, మేఘాలయ సీఎం సీకే సంగ్మా ఇద్దరూ దేశంలోనే అత్యంత పిన్న వయసు ముఖ్యమంత్రులు. కేరళ సీఎం పినరయి విజయన్ అత్యంత వృద్ధ ముఖ్యమంత్రిగా పేరుగాంచారు. ఆయన వయసు 77 సంవత్సరాలు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో వెస్ట్ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా మాత్రమే మహిళలు.



"జీవితంలో విజయం సాధించాలంటే, మీకు రెండు విషయాలు అవసరం : అజ్ఞానం మరియు విశ్వాసం."
- మార్క్ ట్వైన్



"విజయం అంటే ఉత్సాహం తగ్గకుండా వైఫల్యం నుండి వైఫల్యానికి నడవడం."
- విన్స్టన్ చర్చిల్



"విజయం అంటే మీరు ఎంత డబ్బు సంపాదిస్తారనే దాని గురించి కాదు, ప్రజల జీవితాల్లో మీరు చేసే తేడా గురించి."
- మిచెల్ ఒబామా

# హరీష్ చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ చెబుతున్నారు

- విద్యాసాగర్ రావు బతికి ఉంటే వీళ్ల అబద్ధాలు వినలేక అదే కాళేశ్వరంలో దూకి ఆత్మహత్య చేసుకునేవారు
- నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితో కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారు
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఆనాడు మంత్రిగా ఉన్న హరీష్ రావు ఈనాటికీ మంత్రిగా ఉన్నట్టుగానే భావిస్తున్నారు. చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ చెబుతున్నారు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.ఆదివారం అసెంబ్లీలో మాట్లాడుతూ నీరు అందుబాటులో ఉందని చెప్పినా మళ్లీ పరిశీలించాలని లేఖ రాయాల్సిన అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రాజెక్టు నిర్మించుకుంటామని వాదించకుండా.. పేరు మార్చి ఊరు మార్చి దోపిడీకి పాల్పడ్డారన్నారు. విద్యాసాగర్ రావు బతికి ఉంటే వీళ్ల అబద్ధాలు వినలేక అదే కాళేశ్వరంలో దూకి ఆత్మహత్య చేసుకునేవారు అని ఎద్దేవ చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టొద్దని ఎప్పుడూ చెప్పలేదు , ఎత్తు తగ్గించుకోవాలని మాత్రమే వాళ్లు సూచించారు అని సీఎం పేర్కొన్నారు. నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితో కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారు

మేడిగడ్డ దగ్గర కట్టాలని కేసీఆర్, హరీష్ ముందే నిర్ణయించుకున్నాక రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీని నియమించారు . రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక వారికి అనుకూలంగా లేదని ఆ నివేదికను తొక్కిపెట్టి వాళ్లు అనుకున్న చోట ప్రాజెక్టు కట్టారు వీళ్ల ఉద్దేశమే తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు తరలించడం అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వీళ్ల ప్రణాళికలకు ఆదిలోనే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అడ్డు చెబితే ఆ నివేదికను కనిపించకుండా మాయం చేశారు అని సీఎం పేర్కొన్నారు. ఇవన్నీ తెలుసుకోవాలంటే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు. ఆ నివేదికపై అసంపూర్తి సమాచారంతో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం శాసన సభ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత చేవెళ్లలో నీరు అందుబాటులో ఉందని, హైడ్రాలజీ అనుమతులు ఇస్తున్నామని ఆనాటి కేంద్ర మంత్రి ఉమా భారతి 214 అక్టోబర్ 24న స్పష్టంగా చెప్పారని, 205 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని లెటర్ రాస్తే.. హరీష్ రావు మళ్లీ పరిశీలించాలని లేఖ రాశారని గుర్తు చేశారు. వీళ్ల తప్పుడు విధానాలతో మళ్లీ పరిశీలించాలని లేఖ రాశారు అని, ఒకసారి ఎమ్మెల్యేగా గెలిచి సర్టిఫికెట్ తీసుకున్నాక మళ్లీ పరిశీలించాలని ఎవరైనా అడుగుతారా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2009 లో కూడా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నీరు అందుబాటులో ఉందని అనుమతి నిచ్చిందన్నారు. ఈ రికార్డులను కావాలనే ఆనాటి బీఆరెస్ ప్రభుత్వం తొక్కిపెట్టిందన్నారు. కాళేశ్వరం పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టులో వాస్తవాలని బయటపెట్టారనే వారిపై విషం చిమ్ముతున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. హరీష్ రావు తప్పు చేశారని నివేదికలోని పేజీ నెంబర్ 98 లో పిసీ



ఘోష్ కమిషన్ స్పష్టంగా పొందుపరిచారు అని వివరించారు. సీబీఐ కావాలా, సీబీ సీఐడీ కావాలా ఏ విచారణ కావాలో చెప్పకుండా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అసంపూర్తి సమాచారంతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన హరీష్ రావు వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఖైరతాబాద్ గణనాథున్ని దర్శించుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ఖైరతాబాద్ గణనాథున్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం సాయంత్రం 6 గంటలకు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ నగరంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించుకుంటామన్నారు. పాడిపంటలతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు. బార్డర్ లో ఉండి దేశ రక్షణకోసం కాపలా కాస్తున్న సైనికులకు మరింత శక్తినివ్వాలని కోరుకుంటున్నానన్నారు. భారతదేశం ఎంతో వేగంగా అభివృద్ధి సాధిస్తుంది మన దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేని అమెరికా లాంటి కొన్ని శక్తులు మన దేశంపై ఎన్నో ఆంక్షలు విధించే ప్రయత్నం చేస్తున్నారు ఈ నేపథ్యంలో దేశాన్ని మరింత బలోపేతం చేయాలి విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువుల వాడకాన్ని పెంచాలి. 70 సంవత్సరాల క్రితం ప్రారంభమైన ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ప్రతిష్టను పెంచే విధంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఈ సందర్భంగా అందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలిజేస్తున్నానని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని గవర్నర్ ఆమోదిస్తారని విశ్వసిస్తున్నాం

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బీసీ రిజర్వేషన్లపై కేంద్రం ప్రభుత్వం సహకరించి ఉంటే బీసీ లకు ఎప్పుడో న్యాయం జరిగేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల చట్టానికి రాష్ట్ర గవర్నర్ ఆమోదిస్తారని విశ్వసిస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు చట్టానికి యావత్ తెలంగాణ సమాజం సహకరించాలని జాజుల విజ్ఞప్తి చేశారు. ఆదివారం అసెంబ్లీ ముందున్న గన్‌పార్క అఅమరవీరుల స్థూపం వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లు బిల్లు చట్టం చేసిన సందర్భంగా మాట్లాడడం సంతోషంగా ఉందని తెలిపారు. సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం సీలింగును ఎత్తివేస్తూ అసెంబ్లీలో పంచాయతీ చట్ట సవరణ బిల్లును ఆమోదించడం అభినందనీయం అని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయడం ముదావహం అన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, వాకటి శ్రీహరి, ఆది శ్రీనివాసలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టం చేయడానికి అసెంబ్లీలో చర్చలో పాల్గొని మద్దతు తెలియజేసిన బీఆర్ఎస్ బిజెపి సిపిఐ ఎంఐఎం పార్టీలకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. బీసీ రిజర్వేషన్లపై దయచేసి ఎవరు కోర్టుకు వెళ్లొద్దు, న్యాయస్థానాలను అడ్డం పెట్టుకొని బీసీల నోటికాడ ముద్దను గుంజుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బీసీ రిజర్వేషన్లకు ఇప్పటికైనా ముగింపు పలకాలి, బీసీల విషయంలో రాజకీయాలు చేసి, న్యాయస్థానాలను అడ్డం పెట్టుకుని బీసీ రిజర్వేషన్ల అంశాన్ని రా రావణ కాష్టం ల కావడానికి కారకులెవరో గుర్తించి వారిని బీసీ ద్రోహులుగా ప్రకటిస్తామని హెచ్చరించారు.అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ఆమోదించాలని త్వరలో బీసీ సమాజం తరఫున రాష్ట్ర గవర్నర్ సువ్వ కలిసి విజ్ఞప్తి చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ యూనిటీ అధ్యక్షులు ప్రొఫెసర్ చలమల వెంకటేశ్వర్లు, పూలే ఆశయ సాధన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాకాధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గౌడుగు మహేష్ యాదవ్, యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు గూడూరు భాస్కర్, జగదీశ్వర్ చారి ఉన్నారు.

## బీహార్ మాజీ సీఎం లాలూతో కాంగ్రెస్ నేత విహెచ్ భేటీ



పాట్నా: ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం, మాజీ కేంద్ర మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌తో సీనియర్ కాంగ్రెస్ నేత, ఓబీసీ ఎంపీల ఫోరం మాజీ కన్వీనర్ వి.హనుమంత రావు సమావేశమయ్యారు. బీహార్‌లో రాహుల్ గాంధీ చేస్తున్న ఓటు అధికార్ యాత్రలో పాల్గొంటున్న వి.హెచ్ ఆదివారం లాలూ ప్రసాద్ యాదవ్ స్వగృహానికి వెళ్ళి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూపీఏ హయాంలో ఐఐఎం, ఎయిమ్స్ లో ఉన్న రిజర్వేషన్స్ ను సుప్రీమ్ కోర్టు కొట్టివేసిన సమయంలో సోనియా గాంధీ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా పార్లమెంట్ లో బిల్లు ను ఆమోదించిన సమయంలో కేంద్ర మంత్రిగా లాలూ ప్రసాద్ యాదవ్ రిజర్వేషన్స్ కోసం బిల్లు ఆమోదం కోసం చేసిన కృషిని వి.హెచ్ ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

# బొగ్గు గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు

- ప్రమాద రహిత సంస్థగా సింగరేణి కార్మిక సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకుంటాం
- రక్షణ త్రైపాక్షిక సమావేశంలో సంగరేణి సీఎండీ ఎన్.బలరామ్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : బొగ్గు గనుల్లో భద్రత పెంపుదలకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణలోకి తీసుకొని అవసరమైన చర్యలను తక్షణమే తీసుకుంటామని సింగరేణి సంస్థ చైర్మన్ ఎండి ఎన్.బలరామ్ గారు తెలియజేశారు. ఎంఎన్ఆర్ గార్డెన్స్ లో ఆదివారం జరిగిన 49వ రక్షణ త్రైపాక్షిక సమీక్ష సమావేశంలో ఆయన డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారులు, గుర్తింపు, ప్రాతినిధ్య కార్మికసంఘాల ప్రతినిధులు, సింగరేణి అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. సమావేశానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉజ్వల్ థా అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. చైర్మన్ ఎండి బలరామ్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉత్పత్తిలో ఆదర్శప్రాయంగా ఉందని, అలాగే రక్షణలో కూడా ప్రమాద రహిత కంపెనీగా రూపుదిద్దాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, ప్రతి కార్మికుని ప్రాణాలు ఎంతో విలువైనవని జరగకుండా, ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, అలాగే యాజమాన్యంతో పాటు కార్మికులు కూడా రక్షణను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ప్రాణనష్టం చాలా ప్రమాదాల్లో నిర్లక్ష్యం, నిర్లిప్తత వల్లే చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ లేని పని ప్రదేశాల్లో విధులు నిర్వహించమని యాజమాన్యం ఎప్పుడూ ఒత్తిడి చేయబోదని అదే సమయంలో ప్రతీ ఒక్కరూ కూడా స్వీయ రక్షణ అత్యంత ముఖ్యమన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. అలాగే మహిళా ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, వారి రక్షణ తప్పనిసరిగా సంస్థ చూసుకుంటుందని తెలియజేశారు. ఈ సమావేశంలో గనుల్లో రక్షణ పెంపుదలకు కార్మిక సంఘాలు అనేక సూచనలు చేశాయి. నాణ్యమైన హెల్మెట్లు, బూట్లు సరఫరా చేయాలని, వైద్య సేవలు పెంపుదల, క్యాంటీన్లలో మెరుగైన సౌకర్యాలు. కొత్త యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, అవసరమైన సిబ్బంది నియామకం వంటి అనేక అంశాలపై గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియూసి యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య సందర్భంగా మహిళా ఉద్యోగులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో మహిళలకు భూగర్భంలో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ శ్రీ ఉజ్వల్ థా గారు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ శ్రీ టి.ఆర్. కన్నన్ గారు, ఇతర డి.జి.ఎం.యస్. అధికారులు సింగరేణి వ్యాప్తంగా రక్షణ పెంపుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం సంస్థ డైరెక్టర్లు (ఈ అండ్ ఎం) డి.సత్యనారాయణ రావు (ఆపరేషన్స్) సూర్యనారాయణ, (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె వెంకటేశ్వర్లు , గౌతం పొట్రూ రక్షణ చర్యలపై ప్రసంగించారు.సమావేశంలో ముందుగా ఇటీవల పలు ప్రమాదాల్లో మృతి చెందిన కార్మికులకు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ సేఫ్టీ కార్పొరేట్ చింతల శ్రీనివాస్ రక్షణ నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియూసీ సెక్రెటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ ,డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ , హైదరాబాద్, టి.ఆర్. కన్నన్ , డైరెక్టర్ (ఎలక్ట్రికల్ %ಂ% మెకానికల్) డి. సత్యనారాయణ రావు , డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ , డైరెక్టర్ (ప్లానింగ్ %ಂ% ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు గారు, డైరెక్టర్ (పీఏ %ಂ% డబ్ల్యూ) శ్రీ గౌతమ్ పొట్రు ఐ.ఏ.ఎస్ , ఎస్సీడబ్ల్యూయు ప్రెసిడెంట్ వి. సీతారామయ్య , ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్ రావు మైక్ కట్..

### మా గొంతు నొక్కుతున్నారంటూ.. సభలో బీఆర్ఎస్ ఆందోళన..

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యులు మాటల యుద్ధానికి దిగారు. కాగా, మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతుండగా స్పీకర్ మైక్ కట్ చేశారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు.

స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారని మండిపడ్డారు. మాట్లాడే అవకాశం ఇస్తేనే కూర్చుంటామని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చను ప్రభుత్వం అడ్డుకుంటోందని హరీశ్ రావు ఆరోపించారు. కమిషన్ ముందు మాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు, ఇప్పుడు భలో కూడా మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. మా గొంతు నొక్కుతున్నారని ధ్వజమెత్తారు. సుంకిశాల, ఎస్ఎల్ బీసీ కూలిపోతే ఎందుకు కమిషన్ వేయరు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు హరీశ్ రావు. 7వ బ్లాక్ మరమ్మతులు చేసి వర్కింగ్ లోకి తెచ్చుకోవచ్చని ఎన్ డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు.

# వెల్లి విరిసిన క్రీడోత్సవం

- ఉత్సాహంగా సాగుతున్న క్రీడలు
- స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు నిర్వహణ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తొమ్మిది రోజులపాటు నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభ రితంగా కొనసాగాయి. ఇటు క్రీడాకారుల్లోనూ క్రీడోత్సవం వెల్లి విరిసింది. జాతీయ క్రీడా దినోత్సవం ఒక రోజుకే పరిమితం కాకుండా తొమ్మిది రోజులపాటు ఈ క్రీడా ఉత్సవాలు నిర్వహించాలన్న స్పోర్ట్స్ అథారిటీ ఆలోచనకు క్రీడా సమాజము నుండి అనుహ్య స్పందన లభించింది. అన్ని వర్గాలను క్రీడల్లో భాగస్వామ్యం చేయాలన్న క్రీడా విధానం ఆలోచనను అమల్లోపెట్టే దిశగా ఈ తొమ్మిది రోజుల వేడుకలు కొనసాగాయి. పసివయసుల నుండి పండు ముదుసలి వరకు అన్ని వయసుల వారికి క్రీడా కార్యక్రమాలు అందుబాటులో తీసుకురావాలని స్పోర్ట్స్ అథారిటీ చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. ఆగస్టు 23, 24 వ తేదీలలో క్రీడా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో భాగంగా అన్ని స్టేడియాల ప్రాంగణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం జరిగింది గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరు నెలల పసిపాపల నుండి పది సంవత్సరాల పిల్లల వరకు నిర్వహించిన క్రీడా పోటీలు పలువురి ప్రశంసలు అందుకుంది. అదేవిధంగా ఆగస్టు 23 నాడు సెలబ్రేషన్స్ మేకర్స్ వారి సమన్వయంతో హైదరాబాద్ హైటెక్స్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రదర్శన మరియు వేద కాక క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆగస్టు 24వ తేదీ ఆదివారం నాడు హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ వారి సహకారంతో నిర్వహించిన మారథాన్ రన్ విజయవంతమైంది. అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యంతో ఆగస్టు 25వ తేదీ నాడు ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపు లో క్రీడాకారులు కోచులు స్పోర్ట్స్ అథారిటీ లోని వివిధ విభాగాల సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అథారిటీ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలోమెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం పట్ల ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న వారే కాకుండా యావత్ క్రీడా సమాజం నుండి హర్షం వ్యక్తం అవుతుంది. ఆగస్టు 26వ తేదీ నాడు నగరంలోని అన్ని స్టేడియాల్లో సీనియర్ సిటిజన్స్ కు మరియు క్రీడాకారులకు మహిళలకు, పారా క్రీడాకారులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించడం జరిగింది. ఆగస్టు 27వ తేదీ నాడు నగరంలోని అన్ని స్టేడియాల్లో వినాయక వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మంటపాల వద్ద వివిధ క్రీడా కార్యక్రమాలు నిర్వహించి మన సాంస్కృతి సాంప్రదాయ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు క్రీడా కార్యక్రమాలను జోడించడం జరిగింది. ఆగస్టు 28వ తేదీ నాడు ఫిజికల్ లిటరసీ డే లెట్స్ మూవ్ అనే నినాదంతో ఉద్యోగులకు ఆట పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిఓ టీఎన్జీవో సచివాలయ ఉద్యోగులు నాలుగో తరగతి సిబ్బందితోపాటు వివిధ శాఖల ఉద్యోగులు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ క్రీడా అంశాలు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని తీసుకువచ్చాయి

ఆకట్టుకున్న క్రీడా ముగ్గులు

రంగవల్లుల కార్యక్రమంలో వివిధ క్రీడా నినాదాలతో వేసిన ముగ్గులు పలువురిని ఆకర్షించాయి. ఆగస్టు 29వ తేదీ స్వర్గీయ ధ్యాన్చంద్ గారి జయంతి సందర్భంగా నగరంలో అన్ని స్టేడియాల్లో ధ్యాన్చంద్ గారి విగ్రహానికి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అదేవిధంగా గచ్చిబౌలి హాకీ స్టేడియంలో స్వర్గీయ ధ్యాన్చంద్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించడమే కాకుండా వివిధ క్రీడా ప్రోత్సాహక కార్యక్రమాలు పెద్ద ఎత్తున



నిర్వహించడం జరిగింది. ఇటీవల క్రీడా ప్రతిభ ప్రదర్శించి తెలంగాణకు ఖ్యాతి తీసుకువచ్చిన 41 మంది క్రీడాకారులకు ఒక కోటి 29 లక్షల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని ఇవ్వడమే కాకుండా వారిని ఘనంగా సన్మానించుకోవడం జరిగింది. క్రీడాకారులను తీర్చిదిద్దుతూ దిద్దుతున్న కోచులకు ఆపన్న హస్తం అందించాలని లక్ష్యంతో గురువందనం పేరిట ఒక భరోసా పథకాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ లో పనిచేస్తున్న కోచులను, అధికారులను సిబ్బందిని పలువురిని సత్కరించుకోవడం జరిగింది. క్రీడా కార్యక్రమాలు విజయవంతం చేస్తున్నాను కోచులను సిబ్బందిని సన్మానించుకోవాలన్న ఒక నూతన ఒరవడికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. మన గ్రామీణ ప్రాంతాల్లో మన పిల్లలు మర్చిపోతున్న విస్మృత క్రీడలను ప్రోత్సహించి గ్రామీణ స్థాయి నుంచే క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆగస్టు 30వ తేదీ నాడు వివిధ సంప్రదాయ క్రీడ పోటీలు నిర్వహించడం జరిగింది. కాగా ఆదివారం కూడా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించడం విశేషం. ఇలా తొమ్మిది రోజులపాటు తెలంగాణ స్పోర్ట్స్ పార్టీ నిర్వహించిన వివిధ వినూత్న కార్యక్రమాలు తెలంగాణ క్రీడ సమాజానికి చేరువయ్యి క్రీడాకారుల్లో ఒక నూతన ఉత్సాహాన్ని తీసుకురావడమే కాకుండా వివిధ క్రీడా కార్యక్రమాల రూపకల్పనకు ఒక చోదక శక్తి లాగా ఈ తొమ్మిది రోజుల కార్యక్రమాలు ఒక మంచి క్రీడా వాతావరణానికి దోహదం చేశాయి.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### ఉద్యోగుల జేఏసీ మద్దతు కోరిన డా. సంజీవ్ నాయక్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం ) ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్ళండని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావులను ఆర్‌బీఎస్‌కే ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి. సంజీవ్ నాయక్ కోరారు. ఈ మేరరకు ఆదివారం నాడు వారిని కలిసి వినతి పత్రం అందజేశారు. సెప్టెంబర్ 2 వ తేదీన ఉద్యోగ జేఏసీ తో ప్రభుత్వం చర్చలకు పిలిచే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఎం జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని సంజీవ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని, . ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డు ఇవ్వాలని, ఉద్యోగులకు పీఆర్‌సీ తో పాటు వేతనం పెంచాలని, పెండింగ్ ఏరియల్స్ త్వరగా ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఈ దిశగా ప్రభుత్వంకు తెలియజేయాలని సంజీవ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఉద్యోగుల జేఏసీ నేతలు తమ మద్దతు తెలియ జేశారు. తప్పని సరిగా ఈ డిమాండ్లను ప్రభుత్వంకు తెలియ జేస్తామని హామీ ఇచ్చారు.

# బ్యాంకు ఉద్యోగాల పోటీ పరీక్షలకు టి-సాట్ ఆన్ లైన్ స్పెషల్ కోచింగ్

- నేటి నుండి అక్టోబర్ మూడవ తేది వరకు కోచింగ్
- 35 రోజుల పాటు 100 ఎపిసోడ్స్.
- ఉదయం-సాయంత్రం నిపుణ, విద్య ఛానళ్లలో ప్రతి రోజూ ప్రత్యేక ప్రసారాలు
- సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి : ప్రభుత్వ ఉద్యోగాలు, పాఠశాల విద్య వంటి అంశాలపై డిజిటల్ కంటెంట్ అందించే టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు బ్యాంకు ఉద్యోగాల పోటీ పరీక్షలకూ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోంది . దేశ వ్యాప్తంగా నిర్వహించే ఐ.బి.పి.ఎస్ పోటీ పరీక్షలకు తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రత్యేక ప్రసారాలు చేసేందుకు షెడ్యూలు ఖరారు చేసింది. టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రసారాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.

ఐబిపిఎస్ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్) ఆధ్వర్యంలో భర్తీ చేసే 10,227 పోస్టులలో తెలంగాణా రాష్ట్రానికి 261, ఆంధ్రప్రదేశ్ కు 367 పోస్టులు మొత్తం 628 ఉద్యోగాలు తెలుగు రాష్ట్రాలకు కేటాయించబడ్డాయన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల యువత పోటీపరీక్షల్లో సముచిత స్థానం సంపాదించాలన్నదే టి-సాట్ లక్ష్యమని, అందుకోసం తెలుగు, ఇంగ్లీష్ లో డిజిటల్ కంటెంట్ అందిస్తున్నామని వేణుగోపాల్ రెడ్డి గుర్తుచేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో జరిగే ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన కాంపిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటితో పాటు పజిల్స్, పారా జంబుల్స్ తదితర ప్రధాన సబ్జెక్టులపై డిజిటల్ ప్రసారాలుంటాయని సీఈవో తెలిపారు. సెప్టెంబర్ ఒకటవ తేదీన నిపుణలో సాయంత్రం ఏడు నుండి తొమ్మిది గంటల వరకు ఉదయం విద్యలో ఏడు గంటల నుండి తొమ్మిది గంటల వరకు ప్రసారమయ్యే డిజిటల్ పాఠ్యాంశాలు అక్టోబర్ మూడవ తేది వరకు 35 రోజుల పాటు 100 ఎపిసోడ్స్ ప్రసారాలు కొనసాగనున్నాయని వేణుగోపాల్ రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఎన్.ఎం.ఎం.ఎస్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదవ తరగతి విద్యార్థుల కోసం ఎం.హెచ్.ఆర్.డి (మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవెలప్ మెంట్) ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి రాబోయే నవంబర్ లేదా డిసెంబర్ నెలలో నిర్వహించే ఎన్.ఎం.ఎం.ఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్) అర్హత పరీక్ష కోసం విద్యార్థుల మేధో సామర్థ్యాన్ని పెంచేందుకు కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ ఒకటవ తేది నుండి విద్య ఛానల్ లో ఉదయం 11 నుండి 12 గంటల వరకు అరగంట నిడివిగల రెండు పాఠ్యాంశ భాగాల చొప్పున 100 ఎపిసోడ్స్ డిసెంబర్ నెలలో నిర్వహించే పరీక్షల వరకు ప్రసారం చేయనున్నామని, మ్యాట్ అండ్ స్యాట్ కు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల పాఠ్యాంశాలపై డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుతున్న విద్యార్థులు అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచి



ప్రభుత్వం అందించే ఉపకారవేతనానికి అర్హత సాధించేందుకు సిద్ధం కావాలని వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.

## బీసీల జీవితాలలో వెలుగు నింపేందుకే రిజర్వేషన్లు

- 42 శాతం రిజర్వేషన్ అమలుకు మంత్రివర్గ నిర్ణయం పట్ల హర్షం
- బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః అసెంబ్లీలో రిజర్వేషన్ల కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రివర్గానికి తమ హర్షమోదాలు తెలుపుతూ, జిల్లా కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవాలని, బీసీ సమాజానికి కోరుతున్నట్లు బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఆదివారంనాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ, గత ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ శాతాన్ని సీలింగ్ చేస్తూ చేసిన కాప్ ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్ లుఅమలు చేసేందుకు బిల్లు ఆమోదించిన నేపథ్యంలో, రాష్ట్ర మంత్రివర్గానికి, ఏ.ఐ.సి. సి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కి లోక్ సభప్రధాన ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీకి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ఏఐసిసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజ్ కి మంత్రివర్గానికి ధన్యవాదాలు తెలుపుతూ, అన్ని జిల్లాల వ్యాప్తంగా బాణాసంచా కాల్చి స్వీట్స్ పంచి సంబరాలు చేసి పత్రికా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఈ చారిత్రక ఘట్టాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు. ఈ 42 శాతం రిజర్వేషన్లు బీసీ వర్గాలలో, వారి జీవితాలలో వెలుగు నింపుతుంది అనడంలో అతిశయోక్తి లేదు అన్నారు. ఈరోజును సువర్ణ అక్షరాలలో లిఖించదగ్గరోజని, ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతున్న నేపద్యంలో బీసీలు సంబరాలు చేసుకోవాలని నూతి శ్రీకాంత్ గౌడ్ కోరారు.

సూర్య
హైదరాబాద్
సోమవారం
1 సెప్టెంబర్ 2025

suryachitramagazine@gmail.com

# సూర్య సినిమా

## 'ది ప్యారడైజ్' కోసం హాలీవుడ్ కొలాబరేషన్



నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్'లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని ఇంటెన్స్, ఫియర్సెస్ట్ క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, %యాూఎ% సినిమాస్ బ్యానర్ పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. రా స్టేట్మెంట్, రెండు పవర్ ఫుల్ ఫస్ట్-లుక్ పోస్టర్లతో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన ఈ చిత్రం బిహైండ్ ది సీన్స్ 'స్పార్క్ ఆఫ్ ప్యారడైజ్' గ్లింప్స్‌తో అంచనాలని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది.

'ది ప్యారడైజ్'ను గ్లోబల్ సినిమా విజన్‌తో చాలా గ్రాండ్ స్కేల్‌లో రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ తో మేకర్స్ యూనివర్సల్ విజన్ అందరికీ అర్థమైయింది. మల్టీ లాంగ్వేజ్ రిలీజ్, బోల్డ్ ప్రమోషన్స్ అన్నీ గ్లోబల్ మూవీ దిశగానే సాగుతున్నాయి. లేటెస్ట్ అప్డేట్ ఏమిటంటే.. ది ప్యారడైస్ టీం హాలీవుడ్‌లోని Connekkt MobScene ఎగ్జిక్యూటివ్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ అలెగ్జాండ్రా ఈ. విస్కోంటిని కలసి సినిమా కోసం కొలాబరేషన్ డిస్కస్ చేస్తున్నారు. ఈ డెవలప్మెంట్ వాళ్ల ఇంటర్నేషనల్ ప్లాన్స్‌ని మరింత స్ట్రాంగ్‌గా ప్రజెంట్ చేస్తోంది. మొదటినుంచే ఈ ప్రాజెక్ట్‌ని రీజనల్ సినిమా లాగా కాకుండా, పాన్-వరల్డ్ మూ వీలా ట్రీట్ చేస్తున్నారు. ఆగ్రెసివ్ ప్రమోషన్స్‌తో ఇప్పటి నుంచే అన్ని లాంగ్వేజెస్‌లో, మార్కెట్స్‌లో, ఆడియన్స్‌లో బజ్ క్రియేట్ అయ్యింది. 2026 మార్చిలో వరల్డ్‌వైడ్ రిలీజ్‌కి రెడీ అవుతుండగా, ఇప్పటికే ట్రేడ్ సర్కిల్స్ ది ప్యారడైస్‌ని ఇండియా నుంచి వచ్చే మోస్ట్ అవైటెడ్ ఫిల్మ్‌గా చెబుతున్నారు. ఇంటర్నేషనల్ వెర్షన్‌లను ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి ఇండియాలో భారీ సంఖ్యలో పాలోవర్స్ ని కలిగి ఉన్న ప్రఖ్యాత హాలీవుడ్ నటుడిని తీసుకురావడానికి టీం చర్చలు జరుపుతోంది. ఇది ప్రాజెక్ట్‌కి ఇంకో గ్లోబల్ డైమెన్షన్‌ని జోడిస్తుంది.

## దుబాయిలో అంగరంగ వైభవంగా గామా అవార్డ్స్

ప్రతిష్టాత్మమైన GAMA (Gulf Academy Movie Awards) అవార్డ్స్ కు టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉంది. దుబాయ్‌లో ఇప్పటికే నాలుగు ఎడిషన్లు అంగరంగ వైభవంగా జరిగాయి. తాజాగా వైభవ్ జ్యువెలర్స్ సమర్పణలో Keinfra Properties 5వ ఎడిషన్ వేడుకలు ఆగస్ట్ 30న దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో అతిరథ మహారథుల సమక్షంలో మరింత గ్రాండ్ గా జరిగింది. ఈ వేడుకలో



టాలీవుడ్ పరిశ్రమ నుంచి పలువురు సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు గారు, సీఈఓ సౌరభ్ కేసరి గారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అత్యంత వైభవంగా ఈ అవార్డుల కార్యక్రమం ఘనంగా జరిగింది. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు - ఏ. కోదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు - కోటి, ప్రముఖ సినీ దర్శకులు - బి. గోపాల్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్ కళాకారులకు, సినిమాలకు GAMA అవార్డ్స్ బహుకరించబడ్డాయి. నేషనల్ లెవెల్‌లో మంచి గుర్తింపును అందుకున్న పుష్ప 2 ది రూల్ చిత్రానికి గానూ.. గామా బెస్ట్ మూవీగా అవార్డ్ కైవసం చేసుకుంది. గ్లోబల్ కమెడియన్‌గా ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం గారు స్పెషల్ అవార్డును అందుకున్నారు. వీరితోపాటు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును నిర్మాత అశ్వినీ దత్ అందుకున్నారు. అలాగే హీరో సత్యదేవ్ జీబ్రా చిత్రానికి గాను ప్రామిసింగ్ యాక్టర్ గా అవార్డును కైవసం చేసుకున్నారు. ఫ్యాన్స్ ఫేవరెట్ స్టార్ అవార్డును అందాల భామ ఊర్వశీ రౌటెల అవార్డును అందుకున్నారు.

## "కానిస్టేబుల్" ట్రైలర్ లాంచ్

జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్‌పై వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో బలగం జగదీష్ నిర్మించిన థ్రిల్లర్ చిత్రం "కానిస్టేబుల్".ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ లోని అమీర్ పేట్ లో ట్రిపుల్ ఎ మల్టీ ప్లెక్స్ థియటర్ లో ఘనంగా జరిగింది.. సీనియర్ నటుడు డా: రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డా: రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో నేను కూడా పోలీస్ పాత్రలు చేశాను. అయితే ఆ పాత్రలు కామెడీ ప్రధానంగా సీరియస్ నెస్ సాగేవి. కానీ ఈ సినిమా కంటెంట్ నేటి ట్రెండ్ కు తగ్గట్టుగా



ఉంది. వరుణ్ సందేశ్ కూడా తన పాత్రలో ఒదిగి పోయి ఉంటాడని భావిస్తున్నానని అన్నారు. అతిథులు తెలంగాణ కల్చరల్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, నటుడు శివారెడ్డి లు మాట్లాడుతూ.. కంటెంట్ ఉన్న సినిమాలకు నేడు అధిక ప్రాధాన్య ఉంది. ప్రేక్షకులు ఇలాంటి సినిమాలకే బ్రహ్మరథం పడుతున్నారు. పోలీస్ వారు మన భద్రతకు అహర్నిశలు ఎంత శ్రమ పడుతున్నారో మనకు తెలిసిందే. అలాంటి కథను సెలెక్ట్ చేసుకొని తీసిన ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పవన్‌కుమార్ గౌడ్ చిత్ర హీరోయిన్ మధులిక వారణాసి,వరుణ్ సందేశ్ సతీమని వితిక, కెమెరామెన్ హజరత్ వలి, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్, గాయకుడు గద్దర్ నర్సన్న, డైస్ ఆర్ట్ ఫిల్మ్స్ అధినేత హర్ష, నటుడు దువ్వాసి మోహన్, నటీమణులు కల్పన, తేజు, భావన, నిత్య తదితరులు పాల్గొన్నారు.


## 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకోవడంపై నందమూరి బాలకృష్ణ



నందమూరి నటసింహం బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో ఆయన పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ అరుదైన గౌరవానికి ఎంపికైన తొలి హీరో బాలకృష్ణనే కావడం విశేషం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ యూకే గోల్డ్ ఎడిషన్‌లో స్థానం కల్పించినట్టుగా సీఈవో సంతోష్ శుక్లా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ బాలకృష్ణను ఘనంగా సత్కరించింది. ఈ మేరకు శనివారం (ఆగస్ట్ 30) నాడు నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ గారు, ఏపీ ఐటీ మినిస్టర్ శ్రీ నారా లోకేష్ గారు, సహజ నటి జయసుధ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్ర పరిశ్రమలోని దర్శక, నిర్మాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని బాలకృష్ణకు అభినందనలు తెలిపారు. ఈ ఈవెంట్‌లోనే నందమూరి బాలకృష్ణ గారు తెలంగాణ రాష్ట్రంలో వరదలకు అతలాకుతలం అయిన ప్రాంతాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి యాభై లక్షల ఆర్థిక విరాళాన్ని కూడా ప్రకటించారు.

కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూలి .. 'నాకు ఇంతటి ధన్యమైన జన్మను ఇచ్చిన దైవాంశ సంభూతుడు, నా గురువు, నా దైవం విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, కళా ప్రపూర్ణ, నట రత్న, పద్మశ్రీ నందమూరి తారక రామారావు గారు, నా తల్లి బసవతారకం గారికి ధన్యవాదాలు. ఈ రోజు ఈ కార్యక్రమానికి వచ్చిన కేంద్ర హోం శాఖ సహాయమంత్రి శ్రీ బండి సంజయ్ గారికి, ఏపీ ఐటీ, ఎడ్యుకేషన్ మినిస్టర్ శ్రీ నారా లోకేష్ గారికి, సహజ నటి జయసుధ గారికి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ సీఈఓ సంతోష్ శుక్లా గారికి, జాయింట్ సెక్రటరీ ఓలా గారికి, ఉస్మాన్ గారికి కృతజ్ఞతలు. ఈ రోజు మా బావ దగ్గుబాటి వెంకటేశ్వరరావు గారు అంతా చెప్పేశారు. నాది చాలా పెద్ద కుటుంబం. హిందూపూర్ ప్రజలు, నా అభిమానులు, తెలుగు చిత్ర సీమలోని శ్రేయోభిలాషులు ఇలా నాది చాలా పెద్ద కుటుంబం. నేను ఇండస్ట్రీలో 50 ఏళ్ల సుదీర్ఘమైన ప్రయాణాన్ని పూర్తి చేశాను. నాకు ఈ లెక్కలన్నీ సరిగ్గా గుర్తుండవు. అంకెలన్నీ కూడా అభిమానులు గుర్తు పెట్టుకుంటారు. నా మనవళ్లు కూడా నన్ను బాలా అని పిలుస్తుంటారు. నటుడిగా మా నాన్న గారే నాకు స్ఫూర్తి. రాజకీయాల్లోకి రాక ముందే ప్రజా సేవా చేసేవారు. వరదల సమయంలో ముందుండి సాయం చేసేవారు. ప్రాంతాలు వేరైనా సరే విపత్కర పరిస్థితుల్లో ఆయన సేవా కార్యక్రమాలు చేశారు. అందరి సహాయ సహకారాలతో క్యాన్సర్ హాస్పిటల్‌ను నడిపిస్తున్నాను. నేను నా హిందూపురం ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటాను. కోట్ల మంది అభిమానాన్ని పొందడం నా పూర్వ జన్మ సుకృతం, జన్మజన్మల రుణబంధం అని అనిపిస్తుంటుంది. ఇదే ఉత్సాహం, ప్యాషన్‌తో ముస్ముందుకు సాగుతానని మాటిస్తున్నాను. ఈ జర్నీ ఇంకా కొనసాగుతూనే ఉంటుంది' అని అన్నారు. ఇటీవల తెలంగాణలో వర్షం కారణంగా ప్రభావితమైన ప్రాంతాలలో సహాయక చర్యల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కి 50 లక్షల విరాళాన్ని ప్రకటిస్తున్నాను' అన్నారు.

## 'ఘాటి' తప్పకుండా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది - క్రిష్ జాగర్లమూడి



క్వీన్ అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి. విక్రమ్ ప్రభు మేల్ లీడ్ గా నటించిన ఈ చిత్రానికి విజనరీ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యు.వి. క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ నేపధ్యంలో మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. డైరెక్టర్ క్రిష్ మాట్లాడుతూ... కొన్ని కథలు చాలా సహజంగా, పచ్చిగా, పేలడానికి సిద్ధంగా ఉన్నట్లుగా ఉంటాయి. ఘాటి అలాంటి కథ. తూర్పు కనుమలు, ఆ పర్వత శ్రేణులు అక్కడ ఉన్న ఒక తీవ్రమైన భావోద్వేగాలు చాలా గట్టి మనుషులు గొప్ప మనస్తత్వాలు ఇవన్నీ కలగలిపి ఒక మంచి కథ చెప్పడానికి ఆస్కారం దొరికింది. చింతకింద శ్రీనివాసరావు గారు గొప్ప రచయిత. మొదటిగా ఆయన నాకు ఈ ప్రపంచం గురించి చెప్పారు చాలా ఎక్సైటింగ్ గా అనిపించింది. నేను స్వీటీ వేదం సినిమాలో కలిసి పని చేశాం. అందులో సరోజ పాత్రను పోషించింది. ఇప్పుడు ఘాటిలో శీలావతిగా మనందరి ముందుకు రాబోతుంది. అరుంధతి, సరోజ, దేవసేన, భాగమతి.. ఇలా ఎన్నో ఐకానిక్ క్యారెక్టర్స్ అనుష్క చేసింది. ఘాటిలో కూడా చాలా ఎక్స్ట్రార్డినరీగా చేసింది. తను సూపర్ స్టార్ డమ్ లో వుంది. వేదం నుంచి ఇప్పటివరకు స్టార్ డమ్ లో అనేక రెట్లు ఎదిగింది. తన మనసు మాత్రం అలాగే ఉంది. ఈ సినిమా కథ చెప్పగానే చాలా అడ్వంచర్ తో కూడుకున్న మూవీ తప్పకుండా చేద్దాం అని చెప్పింది. అనుష్క విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. సెన్సార్ కి ఇచ్చేముందు కాపీ చూసుకుని అనుష్కకి ఫోన్ చేశాను. తను ఇప్పటివరకు చేసిన సినిమాల్లో ఇది ఒక ఫైనెస్ట్ పెర్ఫార్మెన్స్ అని చెప్పాను. అదే మాట ఆడియన్స్ కచ్చితంగా చెప్తారు. ఈ కథ రాస్తున్నప్పుడే శీలావతి పాత్ర అనుష్కగారు చేయాలని నేను మా ప్రొడ్యూసర్ రాజీవ్ గారు సాయిబాబా విక్రమ్ ప్రమోద్ వంశీ డిసైడ్ అయ్యాం. దేశిరాజు క్యారెక్టర్ లో విక్రమ్ ప్రభుగారిని ఊహించుకుని రాశాను. ఆయన ప్రతి సినిమాలో ఒక డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తారు. ఇందులో కూడా చాలా అద్భుతంగా ఉంటుంది. గ్రేట్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. ఆయనే ఈ పాత్రకు తన సొంత వాయిస్ తో డబ్బింగ్ చెప్పుకున్నారు. అలాగే కుందుల నాయుడు క్యారెక్టర్ కి చైతన్య పర్ఫెక్ట్ యాప్ట్. ఈ సినిమాలో పెర్ఫార్మెన్స్ లన్నీ ఎక్స్ట్రార్డినరీ. జగపతిబాబు క్యారెక్టర్ ఈ సినిమాకి ఒక సూత్రధారిలాగా ఉంటుంది. మొదటి సీను, చివరి సీను ఆయనతోనే ఉంటుంది. ఒక మంచి కథకి మంచి నటీనటులు టెక్నిషియన్స్ దొరకడం అదృష్టం. తోట తరిణి లాంటి ప్రొడక్షన్ డిజైనర్. ఐశ్వర్య గారు కాస్ట్యూమ్స్, సాయిమాధవ్ బుర్ర గారి డైలాగులు ఇవన్నీ అద్భుతంగా ఉంటాయి. ఘాటి సినిమాకి హార్ట్ బీట్ లాంటిది మ్యూజిక్. సాగర్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. ఇందులో యాక్షన్ సీక్వెన్స్ చాలా ఎక్సైటింగ్‌గా ఉంటాయి. కనీ, వినని పాత్రలు ఈ ఘాటిలో చూస్తారు.

## 'కొక్కొరొకో' ఘనంగా ప్రారంభం

ప్రముఖ దర్శక, నిర్మాత రమేష్ వర్మ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు గానూ 'ఆర్వి ఫిల్మ్ హౌస్' అనే బ్యానర్‌ను స్థాపించారు. ఆర్వి ఫిల్మ్ హౌస్ ప్రొడక్షన్ కంపెనీ మీద నిర్మిస్తున్న మొదటి ప్రాజెక్ట్ 'కొక్కొరొకో'ని ఆదివారం (ఆగస్ట్ 31) నాడు పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ఈ రోజు జరిగిన ఈ పూజా



కార్యక్రమాల్లో ముహూర్తపు షాట్‌కు నిర్మాత రేఖ వర్మ క్లాప్ కొట్టగా.. నిర్మాత కూరపాటి శిరీష కెమెరా స్విచ్ ఆన్ చేశారు. రమేష్ వర్మ స్క్రిప్ట్‌ను దర్శకుడు శ్రీనివాస్ వసంతలకు అందజేశారు. ఈ మూవీతో శ్రీనివాస్ వసంతల దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. వినూత్నమైన కథతో, డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ అందించేలా శ్రీనివాస్ వసంతల ఈ మూవీని తెరకెక్కించనున్నారు. ప్రముఖ స్క్రీన్ రైటర్ జి. సత్యమూర్తి కుమారుడు, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ సోదరుడు ప్రముఖ నేపథ్య గాయకుడు జివి సాగర్ ఈ మూవీకి సంభాషణలు రాసే బాధ్యతను స్వీకరించారు. తన తండ్రి వారసత్వాన్ని అనుసరించి 'రాక్షసుడు' తర్వాత రచయితగా రెండో ప్రాజెక్ట్‌ని సాగర్ చేపట్టారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా ఆకాష్ ఆర్ జోషి, లండన్‌కు చెందిన ఒక యంగ్ అండ్ ఎనర్జిటిక్ మ్యూజిక్ డైరెక్టర్‌గా సంకీర్తన్ పని చేయ నున్నారు. ఈ చిత్రాన్ని రేఖ వర్మ, కూరపాటి శిరీష నిర్మా తలుగా.. నీల్లాద్రి ప్రొడక్షన్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ పూడి పని చేయనున్నారు.

## చంద్రహాస్ నూతన చిత్రం కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేసిన సందీప్ కిషన్

ఆటిట్యూడ్ స్టార్ చంద్రహాస్ మొదటి చిత్రంలోనే తన నటనతో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇప్పుడు 'బరాబర్ ప్రేమిస్తా' అంటూ ఆడియెన్స్‌ను మరోసారి మెప్పించేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే



వదిలిన పోస్టర్లు, గ్లింప్స్, పాటలు ఆడియెన్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి. ఇక ఇప్పుడు చంద్రహాస్ నూతన చిత్రానికి సంబంధించిన అప్డేట్ వచ్చింది. ఈ మేరకు సందీప్ కిషన్ ఈ కొత్త చిత్రానికి సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కాన్సెప్ట్ పోస్టర్ చూస్తుంటే ఇదేదో రెగ్యులర్ కమర్షియల్ చిత్రంలా కనిపించడం లేదు. ఈ కథలో దేశ భక్తికి సంబంధించిన అంశాల్ని కూడా జోడించినట్టుగా అనిపిస్తోంది. ఐదు రూపాయల బిళ్ల, వాటి చుట్టూ ఉన్న బుల్లెట్లు, పోస్టర్‌ను డిజైన్ చేసిన తీరు చూస్తుంటే మంచి పవర్ ఫుల్ స్టోరీతోనే సినిమా రాబోతోందని అర్థం అవుతోంది. జైరామ్ చిటికెల ఈ మూవీకి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. ఈ చిత్రాన్ని పివికె ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. చంద్రహాస్ బర్త్ డే సందర్భంగా సెప్టెంబర్ 17న ఈ మూవీకి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను రిలీజ్ చేయబోతోన్నారు.

## శృంగేరిని సందర్శించిన నభా నటేష్

సోషల్ మీడియాలో బిజీగా ఉంటూ తన పర్సనల్, ప్రొఫెషనల్ విషయాలు షేర్ చేస్తుంటుంది హీరోయిన్ నభా నటేష్. ఆమె తాజాగా తన సొంత పట్టణం శృంగేరికి వెళ్లింది. అక్కడి ప్రసిద్ధ దేవాలయాలు సందర్శించి, ఆ విశేషాలు ఇన్ స్టాగ్రామ్ ద్వారా షేర్ చేసింది. తన కుటుంబ సభ్యులతో కలిసి తాను తీసుకున్న ఫొటోస్ ను నభా పోస్ట్ చేసింది. ఇన్ స్టాగ్రామ్ పోస్ట్ లో నభా నటేష్ స్పందిస్తూ - శృంగేరి, నా జన్మస్థలం. రామాయణానికి పూర్వపు పవిత్రమైన చరిత్ర ఈ నగరానికి ఉంది. మహర్షుల తపస్సులచే పవిత్రమైన భూమి ఇది.



దశరథుడితో పుత్రకామేష్టి యాగం చేయించిన ఋషి ఋష్యశృంగుడికి కూడా ఈ నగరంతో అనుబంధం ఉంది. త్రేతాయుగానికి అనుసంధానించే గొప్ప చరిత్ర గల నగరమిది. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు తన మొదటి అమ్నాయ పీఠాన్ని స్థాపించడానికి శృంగేరిని ఎంచుకున్నారు. ఆయన జ్ఞాన స్వరూపమైన శారదాంబ దేవతను ప్రతిష్ఠించి, శృంగేరిని అద్వైత వేదాంతానికి ప్రసిద్ధ ప్రాంతంగా మార్చారు. వేదాలు, కళలకు నాకు పరిచయం చేసింది శృంగేరి. చిన్నతనం నుంచి ఈ పవిత్ర పట్టణం అందించిన చరిత్ర, సంస్కృతి, జ్ఞానం నాకెంతో ప్రేరణ ఇచ్చాయి. పెద్దయ్యాక భారతీయ పురాణాలు, ఆధ్యాత్మిక ఆలోచనల పట్ల నాకున్న ఇష్టం మరింత పెరిగింది. దట్టమైన అడవుల మధ్య ఉండి, భారీ వర్షపాతానికి ప్రసిద్ధి చెందిన శృంగేరి సహనం, అంతర్గత బలాన్ని కలిగిస్తుంది. ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ నా చిన్ననాటి జ్ఞాపకాలు పలకరిస్తూ నిత్యం మార్గదర్శనం చేస్తుంటాయి. అని పేర్కొంది.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044